తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

సోమవారం 16.06.2025 | సంపుటి :11 సంచిక : 328 | పేజీలు :12 వెల: రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

ప్రకటనల కోసం సంప్రదించండి 98483 28698









గుజరాత్ విమాన ప్రమాదం..

## డీఎన్‌ఏతో మృతుల గుర్తింపు

**అందులో విజయ్ రూపాణీ మృతదేహం**

**అహ్మదాబాద్(జనంసాక్షి):** అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారిని గుర్తించేందుకు డీఎన్‌ఏ పరీక్షలు కొనసాగుతున్నాయి. బాధిత కుటుంబ సభ్యుల డీఎన్‌ఏ నమూనాతో పోల్చి చూసే ప్రక్రియ మూడు రోజులుగా కొనసాగుతోంది. ఇప్పటివరకు 47 మందిని గుర్తించగా..

మిగతా 2లో..



ఆస్ట్రేలియా పోలీసుల కర్కశం..

## భారత సంతతి వ్యక్తి మృతి

**సిడ్నీ(జనంసాక్షి):** ఆస్ట్రేలియాలోని అడిలైడ్‌లో భారత సంతతికి చెందిన గౌరవ్ కుండి అనే యువకుడిపై అక్కడి పోలీసులు ఇటీవల కర్కశంగా వ్యవహరించిన విషయం

మిగతా 9లో..

# సర్కారు బడులకు సాంకేతిక విద్య

## ప్రభుత్వ విద్యకు ఆధునిక సొబగులు

**ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక సాంకేతిక బోధనకు సీఎం రేవంత్ సమక్షంలో పలు ఎన్జీవోలతో విద్యాశాఖ ఒప్పందం**

**హైదరాబాద్(జనంసాక్షి):** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ప్రముఖ ఎన్‌జీవో సంస్థలతో రాష్ట్ర విద్యాశాఖ ఎంవోయూలు కుదుర్చుకుంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అత్యాధునిక సాంకేతిక బోధనా సేవలను ఉచితంగా అందించాలన్న లక్ష్యంతో ఎంవోయూ కుదుర్చుకున్నట్టు విద్యాశాఖ తెలిపింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన ఆరు ప్రముఖ సంస్థల భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో అధునాతన ఎడ్ టెక్ సదుపాయాలను ప్రభుత్వం కల్పించనుంది. ఇందుకు నందన్ నీలేకని నేతృత్వంలోని ఏక్ స్టెప్ ఫౌండేషన్, డాక్టర్ సునీతా కృష్ణన్ నేతృత్వంలోని ప్రజ్వల ఫౌండేషన్, అలక్ పాండే ఆధ్వర్యంలో ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ, షోయబ్‌దార్ నిర్వహిస్తోన్న పైజామ్ ఫౌండేషన్, సఫీనా హుస్సేన్

మిగతా 2లో..



సర్కారు బడుల్లో సాంకేతిక విద్య బోధనకు సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో విద్యాశాఖతో ఒప్పందం కుదుర్చుకున్న పలు ఎన్జీవో సంస్థల ప్రతినిధులు




## తెలంగాణలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించండి

- సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి జయంత్ చౌదరి సూచన
- ఐటీఐలకు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని విజ్ఞప్తి
- స్కిల్ వర్సిటీకి మద్దతివ్వాలని కేంద్ర మంత్రిని కోరిన సీఎం

**హైదరాబాద్(జనంసాక్షి):** రాష్ట్రంలో వీఎఫ్ఎక్స్, గేమింగ్, ఆడియో విజువల్స్ రంగాలకు సంబంధించి సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర

మిగతా 2లో..

# స్థానిక ఎన్నికలకు సర్కారు సై




## నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్

- కేబినెట్ సమావేశ అనంతరం తేదీ ప్రకటిస్తాం
- వారం రోజుల్లో 'రైతు భరోసా'
- సన్నాలకు బోనస్‌ను రైతుల ఖాతాల్లో జమ
- సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత స్థానిక నేతలదే..
- ఎన్నికలల్లో విజయం కోసం కాంగ్రెస్ శ్రేణులు కృషిచేయాలి
- అందుకు సిద్ధం కావాలి: మంత్రి పొంగులేటి




**ఖమ్మం(జనంసాక్షి):** ఈ నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదలవుతుందని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం నిర్వహించే క్యాబినెట్ సమావేశంలో చర్చించిన అనంతరం ఎన్నికల తేదీపై స్పష్టత ఇస్తామని చెప్పారు. తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు.. ఆ తర్వాత సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో వివిధ

మిగతా 2లో..

## బీసీ రిజర్వేషన్ సంగతేంది?

- అరవై శాతం జనాభా ఉన్న బీసీలకు మంత్రి పదవులు మూడేనా!
- కాంగ్రెస్‌వి బూటకపు మాటలు
- మండిపడ్డ భారాస నాయకులు




2లో

# యుద్ధం.. భీతావహం

## కొనసాగుతున్న ఇజ్రాయెల్- ఇరాన్ ఘర్షణలు

**ఆదివారం ఇరాన్ అణు కేంద్రాలపై టెల్‌అవీవ్ భీకరదాడులు**

**ప్రపంచంలోనే అతిపెద్ద గ్యాస్ క్షేత్రమైన సౌత్‌పార్స్ ధ్వంసం**

- పలు అణు కేంద్రాలకు భారీ నష్టం
- పలువురు అణు శాస్త్రవేత్తలు మృతి
- సైనిక స్థావరాలు చిన్నాభిన్నం



**టెహ్రాన్(జనంసాక్షి):** పశ్చిమాసియా ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య దాడులు కొనసాగుతున్నాయి. టెహ్రాన్ ప్రధాన ఆర్థిక జీవనాడి అయిన ది సౌత్ పార్స్ క్షేత్రంపై దాడి చేసింది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద గ్యాస్ క్షేత్రం. టెహ్రాన్‌లోని ఇరాన్ అణు కేంద్రాలు సహా 150కి పైగా లక్ష్యాలపై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. ఇరాన్ చమురు మంత్రిత్వ శాఖ అధికారులు మీడియాతో మాట్లాడుతూ.. టెల్‌అవీవ్ దాడుల్లో షహ్రాన్‌లోని భారీ గ్యాస్ క్షేత్రం కూడా ధ్వంసమయినట్లు తెలిపారు. 11 నిల్వ ట్యాంకులు ఒకదాని తర్వాత ఒకటి పేలిపోతుండడంతో భారీగా అగ్నికీలలు ఎగసిపడుతున్నాయని పేర్కొన్నారు. దీనివల్ల సమీప నివాస ప్రాంతాలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. గ్యాస్ క్షేత్రాలపై దాడి

మిగతా 2లో..

## దాడులు ఆత్మరక్షణ కోసమే..

**ఇజ్రాయెల్ దాడులను నిలిపివేస్తే మేమూ ఆపేస్తాం**

**టెహ్రాన్(జనంసాక్షి):** అణుస్థావరాలే లక్ష్యంగా గగనతల దాడులకు దిగిన ఇజ్రాయెల్‌పై అంతే స్థాయిలో ప్రతిదాడి చేసిన ఇరాన్ కీలక ప్రకటన చేసింది. కేవలం ఆత్మరక్షణ కోసమే 'టెల్ అవీవ్'పై దాడి చేయాల్సి వచ్చిందని పేర్కొంది. ఇస్లామిక్ రిపబ్లిక్‌పై ఇజ్రాయెల్ సైనిక చర్యను నిలిపివేస్తే.. తాము కూడా దాడులు

మిగతా 2లో..

## యుద్ధాన్ని ఆపేస్తా..

- ఇజ్రాయెల్- ఇరాన్‌లు ఒప్పందం కుదుర్చుకోవడానికి సహకరిస్తా
- నెల రోజుల క్రితం భారత్,పాకిస్థాన్ మధ్య ఘర్షణలు ఆపేశా..
- నా మధ్యవర్తిత్వంలో ఎన్నో దేశాల మధ్య శాంతి నెలకొంది
- మళ్లీ గొప్పలకు పోయిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్
- ఇరాన్ ఇజ్రాయెల్ దాడులతో తమకు సంబంధం లేదని వెల్లడి

2లో

# భారత్‌కు సైప్రస్ విలువైన భాగస్వామి

**ఆ దేశ పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీ**

**ఘనంగా స్వాగతం పలికిన అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడోలైడ్స్**




**నికోసియా(జనంసాక్షి):** మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ నేడు ద్వీప దేశమైన సైప్రస్‌కు చేరుకున్నారు. దేశాధ్యక్షుడు నికోస్ క్రిస్టోడోలైడ్స్ ఆయనకు స్వాగతం పలికారు. రెండు రోజుల పాటు ఈ పర్యటన కొనసాగనుంది. 23 ఏళ్ల తర్వాత ఓ భారత ప్రధాని సైప్రస్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి. ఇందులో భాగంగా క్రిస్టోడొలైడ్స్‌తో మోదీ సమావేశం కానున్నారు. వాణిజ్యం, సాంకేతికత, రక్షణ, పునరుత్పాదక ఇంధనం, కౌంటర్ టెర్రరిజం తదితర రంగాల్లో సహకారాన్ని మరింత పెంపొందించుకునే దిశగా చర్చలు జరపనున్నారు. మూడు దేశాల పర్యటనకు బయల్దేరే ముందు ప్రధాని మోదీ ఓ ట్వీట్ చేస్తూ.. మధ్యధరా, ఈయూ ప్రాంతంలో సైప్రస్‌ను విలువైన భాగస్వామిగా పేర్కొన్నారు. ఈ పర్యటన ఇరుదేశాల మధ్య వాణిజ్యం, సాంస్కృతికం వంటి కీలక రంగాల్లో సంబంధాలను

మిగతా 2లో..

**బనకచర్లపై పోరులో ప్రభుత్వానికి**

# సహకరిస్తా

**రాజకీయాలకు తావులేకుండా కృషి చేస్తే తోడుగా ఉంటాం: హరీశ్‌రావు**



**హైదరాబాద్(జనంసాక్షి):** గోదావరి-బనకచర్లపై అపెక్స్ కౌన్సిల్ సమావేశమయ్యేలా చూడాలని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని మాజీ మంత్రి, భారాస నేత హరీశ్‌రావు కోరారు. వీలైనంత త్వరలో అఖిలపక్ష సమావేశం, శాసనసభ సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. సాగునీటికి సంబంధించిన అంశాలపై ఉత్తమ్‌కు హరీశ్‌రావు లేఖ రాశారు."రాష్ట్ర తాగునీటి అంశాలపై అందరి అభిప్రాయాలతో ఒక విధానపరమైన నిర్ణయం తీసుకువాలి. గోదావరి-బనకచర్లతో తెలంగాణ వాటాకు గండిపడే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం ఇంకా అనుమతి ఇవ్వలేదు. బనకచర్లకు కేంద్రం అనుమతిస్తే రాష్ట్ర

మిగతా 2లో..

## అవార్డుల వేడుకలకు తప్పనిసరిగా హాజరుకావాలి

**హైదరాబాద్(జనంసాక్షి):** ప్రభుత్వాలు నిర్వహించే సినిమా వేడుకకు తప్పనిసరిగా హాజరుకావాలని చిత్ర పరిశ్రమకు ఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్ రాజు సూచించారు. 'తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్' ప్రదానోత్సవం శనివారం జరిగిన సంగతి తెలిసిందే. ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్పేందుకు దిల్ రాజు తాజాగా ప్రెస్‌మీట్ నిర్వహించారు. "తెలంగాణ గద్దర్ అవార్డుల వేడుక నిన్న గ్రాండ్‌గా జరిగింది. ఆ విషయంలో ఆనందంగా ఉంది. దాని కోసం ఆరు నెలలుగా వర్క్ చేశాం. ఈ పురస్కారాలకు సంబంధించి

మిగతా 2లో..

- ప్రభుత్వంతో ప్రయాణించాల్సిన బాధ్యత సినిమా వారందరిపై ఉంది
- చిత్ర పరిశ్రమకు దిల్‌రాజు సూచన



## భారతీయులు జాగ్రత్తగా ఉండండి

**ఇరాన్‌లో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత రాయబార కార్యాలయం సూచనలు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఇజ్రాయెల్- ఇరాన్ మధ్య దాడులతో పశ్చిమాసియాలో మరోసారి తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలోనే ఇరాన్‌లోని భారతీయులకు అక్కడి మన రాయబార కార్యాలయం పలు సూచనలు జారీ చేసింది. దేశంలో ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా.. ఎవరూ భయాందోళనకు గురికావొద్దని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపింది. అదేవిధంగా టెహ్రాన్‌లోని దేశ రాయబార కార్యాలయంతో

మిగతా 2లో..

## పుణెలో ఘోరం

**ఇంద్రాయణి నదిపై వంతెన కూలి పలువురు గల్లంతు**



**పూణె(జనంసాక్షి):** పుణెలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఇంద్రాయణి నదిపై ఉన్న ఓ వంతెన కుప్పకూలింది. ఈ ఘటనలో అనేక మంది పర్యటకులు గల్లంతయ్యారు. వీరిలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా ఆరుగురిని స్థానికులు రక్షించినట్లు సమాచారం. మిగతా

మిగతా 2లో..

**మోగిన మృత్యుఘంటికలు**

## ఉత్తరాఖండ్‌లో హెలికాప్టర్ కుప్పకూలి..

**ఏడుగురి దుర్మరణం**

**గౌరీకుండ్(జనంసాక్షి):** ఉత్తరాఖండ్‌లోని గౌరీకుండ్‌లో హెలికాప్టర్ కుప్పకూలింది. ఈ ఘటనలో చిన్నారి సహా ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. ఆర్యన్ ఏవియేషన్‌కు

మిగతా 2లో..





## బాసరలో విషాదం..

**గోదావరిలో స్నానానికి దిగి ఐదుగురు యువకులు మృతి**

**మృతులంతా ఒకే కుటుంబానికి చెందినవారు..**

**ముథోల్(జనంసాక్షి):** నిర్మల్ జిల్లా బాసరలో విషాదం చోటు చేసుకుంది. గోదావరిలో స్నానానికి దిగి ఐదుగురు యువకులు మృతి చెందారు. మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. వారిని హైదరాబాద్‌లోని బేగంబజార్‌కు చెందిన రాకేశ్, వినోద్, మదన్, రుతిక్, భరత్‌గా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భైంసా

మిగతా 2లో..

## వానలే వానలు..

**ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు**

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో ఈ నెల 19 వరకు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని పేర్కొంది. దక్షిణ బంగ్లాదేశ్‌ను ఆనుకొని ఉత్తర బంగాళాఖాతం

మిగతా 2లో..



## బాసరలో విషాదం..

ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఆదివారం ఉదయం 18 మంది కుటుంబ సభ్యులు బాసరకు వచ్చారు. అమ్మవారి దర్శనానికి ముందు గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేయడానికి బోటుపై నది మధ్యలోకి వెళ్లారు. ఈక్రమంలో అయిదుగురు నీటమునిగి మృతి చెందారు. స్థానికులు, గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాలను బయటికి తీశారు. సీఐ మల్లేశ్, ఎస్సై శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పుణెలో ఘోరం

వారి కోసం గాలింపు కొనసాగుతోంది. పుణె జిల్లాలోని ఇంద్రాయణి నదిపై కుందమాలా పర్యాటక ప్రాంతానికి ఆదివారం పర్యటకులు పోటెత్తారు. అక్కడున్న ఇనుప వంతెనపై అనేక మంది వచ్చి నిలబడిన క్రమంలోనే కొంతభాగం ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో అనేక మంది నదిలో కొట్టుకుపోయారు. వెంటనే రంగంలోకి దిగిన స్థానిక పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. పలువురిని రక్షించినప్పటికీ.. అనేక మంది జాడ తెలియరాలేదు.ఇంద్రాయణి నదిపై ఈ ఇనుప వంతెనను 30 ఏళ్ల క్రితం నిర్మించినట్లు స్థానిక ఎమ్మెల్యే వెల్లడించారు. ఇది కేవలం కాలినడక మార్గమే. ప్రమాద సమయంలో వంతెనపై దాదాపు 100 మంది ఉన్నారని, అందులో అనేక మంది ఒడ్డుకు చేరుకున్నప్పటికీ పలువురు గల్లంతయ్యారని చెప్పారు. ఇదిలాఉంటే, మహారాష్ట్రలో అనేక ప్రాంతాల్లో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. పుణెతోపాటు, పింప్రీ చించ్వాడ్ ప్రాంతాలకు వాతావరణశాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది.

## ఉత్తరాఖండ్‌లో హెలికాప్టర్ కుప్పకూలి..

చెందిన హెలికాప్టర్ గుప్తకాశీ నుంచి కేదార్‌నాథ్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఉత్తరాఖండ్ పౌర విమానయాన అభివృద్ధి అథారిటీ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున 5:20 గంటలకు ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్‌కు చెందిన 6 మంది యాత్రికులతో హెలికాప్టర్ గుప్తకాశీ నుంచి కేదార్‌నాథ్‌కు బయల్దేరింది. అందులో సాంకేతిక సమస్యలు తలెత్తడం, వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో బయల్దేరిన 10 నిమిషాల్లోనే కుప్పకూలింది. సమాచారం అందుకున్న అధికారులు, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం ఎస్డీఆర్ఎఫ్ బృందాలు ప్రమాద స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి.ఈ ఘటనపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద స్థలంలో సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మే 2న కేదార్‌నాథ్ ద్వారాలు తెరుచుకున్నప్పటి నుంచి ఇది ఐదో ప్రమాదం. జూన్ 7న ఉత్తర్‌ప్రదేశ్‌లోని రుద్రప్రయాగ్ జిల్లాలో కేదార్‌నాథ్‌కు వెళ్తున్న ఓ హెలికాప్టర్ బాదాసుబేస్ నుంచి టేకాఫ్ అయిన వెంటనే అందులో సాంకేతిక లోపాలు తలెత్తాయి. దీంతో ఉత్తరాఖండ్‌లోని ఓ హైవేపై అత్యవసర ల్యాండింగ్ చేయాల్సి వచ్చింది. హెలికాప్టర్ టెయిల్ రోటర్ పడి సమీపంలోని కొన్ని భవంతులు, రోడ్డుపై నిలిపి ఉంచిన ఓ కారు పాక్షికంగా దెబ్బతిన్నాయి. పైలట్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

## భారత్‌కు సైప్రస్ విలువైన భాగస్వామి

మరింత పెంపొదిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. ఇజ్రాయెల్‌- ఇరాన్ పరస్పర దాడుల కారణంగా పశ్చిమాసియాలో గగనతల ఆంక్షల నేపథ్యంలో ప్రధాని మోదీ విమానం అరేబియా సముద్రం, ఆఫ్రికా గగనతలం మీదుగా సైప్రస్‌కు చేరుకున్నట్లు సమాచారం.సైప్రస్ నుంచి ప్రధాని మోదీ నేరుగా కెనడాకు వెళ్తారు. ఆ దేశ ప్రధాని మార్క్ కార్నీ ఆహ్వానం మేరకు జూన్ 16-17న కననాస్కిస్‌లో జరగనున్న జీ-7 సదస్సుకు హాజరుకానున్నారు. ఈ సదస్సులో ప్రధాని మోదీ పాల్గొనడం వరుసగా ఆరోసారి. ఇందులో భాగంగా జీ-7 దేశాధినేతలతో సమావేశం కానున్నారు. జీ-7 దేశాల్లోని అంతర్జాతీయ సంస్థల అధిపతులతో ఇంధన భద్రత, కీలక అంతర్జాతీయ సమస్యలు, సాంకేతికత, ఆవిష్కరణలపై చర్చలు జరపనున్నారు. తిరుగు ప్రయాణంలో భాగంగా జూన్ 18న మోదీ ఐరోపాలోని క్రొయేషియాకు వెళ్లనున్నారు. ఆ దేశంలో భారత ప్రధాని పర్యటించడం ఇదే తొలిసారి.

## డీఎన్‌ఏతో మృతుల గుర్తింపు

24 మృతదేహాలను వారి కుటుంబీకులకు అప్పగించినట్లు అధికారులు వెల్లడించారు. వీరిలో గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందినవారే ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. విమానంలో మొత్తం 242 మందికిగాను 241 మంది చనిపోయారు. వీరితోపాటు 29 మంది వైద్య విద్యార్థులు, స్థానికులు ప్రాణాలు కోల్పోగా.. అనేక మృతదేహాలు గుర్తుపట్టకుండా కాలిపోయాయి. దీంతో డీఎన్ఏ పరీక్షలు అనివార్యమయ్యాయి. ఈ ప్రక్రియ సుదీర్ఘ సమయం పడుతుండటంతో బాధిత కుటుంబాలు వేచిచూస్తున్నారు. విమాన ప్రమాద ఘటనా ప్రదేశాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రిన్సిపల్ సెక్రటరీ పీకే మిశ్రా పరిశీలించారు. అనంతరం చికిత్స తీసుకుంటున్న బాధితులు, వారి కుటుంబీకులను పరామర్శించారు. వారికి అందుతున్న సాయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆ సందర్భంగా ఘటనకు సంబంధించిన వివరాలను రాష్ట్ర అధికారులు ఆయనకు వివరించారు.

ఎయిరిండియా ప్రమాద ఘటన..

- విజయ్ రూపాణీ మృతదేహం గుర్తింపు

అహ్మదాబాద్: గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఈ నెల 12న జరిగిన ఘోర విమాన ప్రమాదంలో గుజరాత్ మాజీ సీఎం, భాజపా సీనియర్ నేత విజయ్ రూపాణీ మృతి చెందిన విషయం తెలిసిందే.ఘటన జరిగిన మూడు రోజుల అనంతరం ఆయన మృతదేహాన్ని గుర్తించినట్లు గుజరాత్ హోంమంత్రి హర్ష్ సంఘ్వీ వెల్లడించారు. రూపాణీ కుటుంబ సభ్యుల నమూనాలతో మృతదేహం డీఎన్ఏ సరిపోలిందన్నారు. దీంతో భౌతికకాయాన్ని వారి కుటుంబసభ్యులకు అప్పగించామన్నారు. ఇప్పటిదాకా 32 మంది మృతుల డీఎన్ఏ వారి కుటుంబసభ్యుల జన్యు పరీక్షలతో సరిపోలినట్లు బీజే వైద్య కళాశాల సీనియర్ ప్రభుత్వ వైద్యుడు తెలిపారు.డీఎన్ఏ పరీక్ష నిర్వహించి.. ఇప్పటి వరకు 14 మంది మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. పరీక్షతో పనిలేకుండా బంధువులు గుర్తుపట్టిన 8 మృతదేహాలను ఇప్పటికే వారి కుటుంబసభ్యులకు ఇచ్చారు. ప్రమాద తీవ్రత వల్ల చాలా వరకు గుర్తుపట్టలేని విధంగా కాలిపోవడంతో డీఎన్ఏ టెస్టులు నిర్వహిస్తున్నామన్నారు. ఒక్కో పరీక్షకు ఎక్కువ సమయం పడుతుండడం గుర్తింపు ఆలస్యం అవుతోందని తెలిపారు. బాధితుల కుటుంబాలతో సమన్వయం చేసుకోవడానికి 230 బృందాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో మరణించిన 11 మంది విదేశీయుల కుటుంబాలను ఇప్పటికే సంప్రదించామన్నారు.

## బనకచర్లపై పోరులో ప్రభుత్వానికి సహకరిస్తా

ప్రయోజనాలు దెబ్బతింటాయి. రాష్ట్ర ప్రాజెక్టులకు కేటాయించిన 969 టీఎంసీలపై హక్కులు ఇంకా సాధించుకోలేదు. ఏపీ చేపట్టే ఏ కొత్త ప్రాజెక్టుకైనా అనుమతిస్తే అది ఆత్మహత్య సదృశ్యమే అవుతుంది. బనకచర్లతో ఏపీ 200 టీఎంసీలను తరలించాలని చూస్తోంది. కృష్ణాలో 112.5 టీఎంసీలు తెలంగాణకు కేటాయించాలని కేంద్రాన్ని కోరాలి. ఈ వాటాకు ఏపీ అంగీకరిస్తే బనకచర్లను పరిశీలించవచ్చని ఇంజినీర్లు భావిస్తున్నారు. .

## వానలే వానలు..!

ప్రాంతంపైనున్న ఆవర్తనం ప్రస్తుతం పరిసర ప్రాంతాలు, సగటు సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందని.. ఎత్తుకు వెళ్లేకొద్దీ నైరుతి దిశగా వంగి ఉందని తెలిపింది. ఉత్తరకోస్తాంధ్ర, పశ్చిమ బంగాళాఖాతంపై సముద్రమట్టానికి 5.8 కిలోమీట్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని.. ఈ ఆవర్తనం ఉత్తర బంగాళాఖాతంపై ఏర్పడిన ఆవర్తనంలో కలిసిపోయిందని పేర్కొంది. తూర్పు మధ్యప్రదేశ్ నుంచి బంగ్లాదేశ్ వరకు ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, గంగానది మీదుగా ఓ ద్రోణి.. సగటు సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని తెలిపింది. మరాఠ్వాడ, పరిసర ప్రాంతాల మీదుగానున్న ఉపరితల ఆవర్తనం నుంచి తెలంగాణ మీదుగా కోస్తాంధ్ర వరకు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి ఉందని తెలిపింది.



# తెలంగాణలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించండి

నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌదరి సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆయన నివాసంలో కేంద్ర మంత్రి జయంత్ చౌదరి ఆదివారం సమావేశమయ్యారు. ఐటీఐ విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఉపయోగపడుతుందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. తాము ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేసి.. దానిని ఐటీఐలను అనుసంధానిస్తామని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రికి తెలియజేశారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడంపై ముఖ్యమంత్రిని కేంద్ర మంత్రి అభినందించారు. జాతీయ నైపుణ్య శిక్షణ కింద యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి మద్దతు ఇవ్వాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. ఐటీఐలన్నింటికి ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని కేంద్ర మంత్రి సీఎంను కోరారు. ఐటీఐల్లో సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సీఎం వెంటనే అధికారులను ఆదేశించారు. ఆధునిక పరిశ్రమ అవసరాలకు తగినట్లు కాలానుగుణంగా ఐటీఐల్లో సిలబస్‌ను అప్‌గ్రేడ్ చేయాలని.. ఇందుకోసం ప్రత్యేక కమిటీ నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, సీఎంవో పరిశ్రమలు, జయేశ్ రంజన్, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్దన్ రెడ్డి, కేంద్ర నైపుణ్యాభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలకు సర్కారు సై

ప్రాంతాల ముఖ్యనేతలతో మంత్రి సమావేశం నిర్వహించారు.స్థానిక ఎన్నికలకు 15 రోజుల గడువు మాత్రమే ఉందని.. కాంగ్రెస్ శ్రేణులు సిద్ధం కావాలని పొంగులేటి సూచించారు. గ్రామాల్లో చిన్న చిన్న లోటుపాట్లు ఉంటే వాటిని సరిదిద్దుకుని ముందుకెళ్లాలని చెప్పారు. గెలిచే అవకాశాలు ఉన్న అభ్యర్థులనే ఎంపిక చేస్తామన్నారు. వారం రోజుల్లో 'రైతు భరోసా', సన్నాలకు బోనస్‌ను రైతుల ఖాతాల్లో జమచేస్తామన్నారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత స్థానిక నేతలదేనని చెప్పారు.కాగా రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రెండేళ్లుగా చర్చ సాగుతోంది. ఆ దిశగా ప్రభుత్వం కూడా ప్రస్తుతం అడుగులు వేస్తోంది రిజర్వేషన్లకు అనుగుణంగా గెలిచే అవకాశాలు ఉన్న అభ్యర్థులనే ఎంపిక చేస్తామని తెలిపారు. ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందించా మన్నారు. వారం రోజుల్లో అర్హులైన రైతు సోదరు లందరికీ కుంటవారం రోజుల్లో అర్హులైన రైతు సోదరులందరికీ కుంట మొదలుకోని ఎన్ని ఎకరా లుంటే అన్ని ఎకరాల వరకు రైతు భరోసా, సన్నాలకు రైతు బోనస్ వారి వారి బ్యాంకు ఖాతాలలో జమ చేస్తామని వెల్లడించారు. నెలాఖరులోగా ఎన్నికల షెడ్యూల్ వస్తుందని చెప్పారు. తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహిస్తామని, తర్వాత సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు ఉంటాయని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత స్థానిక నేతలదేనని చెప్పారు. ఆయా గ్రామాల్లో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించుకోవడమే కాదు.. వాటి నిర్మాణం పూర్తి చేయించే బాధ్యత కూడా నాయకులే చూసుకోవాలన్నారు.

## సర్కారు బడులకు సాంకేతిక విద్య

ఆధ్వర్యంలోనే ఎడ్యుకేట్ గర్ల్స్ లాంటి పేరొందిన సంస్థలతో విద్యాశాఖ ఎంవోయూ కుదుర్చుకొంది.రాష్ట్రంలో విద్యా నాణ్యతా ప్రమాణాలను మెరుగుపరచాలన్న సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా విద్యాశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రజాప్రభుత్వం అమలు చేస్తోన్న కార్యక్రమాలు, పథకాలకు ఆకర్షితులై రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు వివిధ సంస్థలు ముందుకొస్తున్నాయని ప్రభుత్వం తెలిపింది. నందన్ నీలేకని నేతృత్వంలో ఏక్ స్టెప్ ఫౌండేషన్ కృత్రిమ మేధ ఆధారిత ఫ్లాట్‌ఫామ్‌తో 540 పాఠశాలల్లో పనిచేస్తుంది. ఇకపై 33 జిల్లాల పరిధిలో 5వేలకు పైగా ప్రాథమిక పాఠశాలలకు విస్తరించనుంది. మూడో తరగతి నుంచి ఐదో తరగతి వరకు తెలుగు, ఇంగ్లీష్ భాషలతో పాటు మ్యాథ్స్ బేసిక్స్‌ను ఈ సంస్థ అందిస్తుంది.

## బీసీ రిజర్వేషన్ సంగతేంది?


**హైదరాబాద్(జనంసాక్షి):**కాంగ్రెస్ నాయకుల మాటలు బూటకమని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఇదే విషయాన్ని తాము మొదట్నుంచి చెబుతున్నామని తెలిపారు. బీసీల విషయంలో కాంగ్రెస్ నయవంచన చేసిందని విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్ ఇక చెత్తబుట్టలో పారేయాల్సిందేనని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. కులగణన ఏదో గొప్పగా చేశామని ఇది దేశానికి రోల్ మోడల్ అని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ వాళ్ళు ఎన్నికల్లో చెప్పిందేమిటి ?చేసిందేమిటి అని ఆయన ప్రశ్నించారు. కులగణన తప్పుల తడకగా చేశారని .. అరవై శాతం జనాభా ఉన్న బీసీలకు మూడేనా మంత్రి పదవులు అని నిలదీశారు. బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి మంత్రివర్గ కూర్పులో ఎందుకు పాటించలేదని ప్రశ్నించారు. బీసీ సబ్ ప్లాన్‌కు చట్టబద్దత ఏదీ ? కీలక శాఖలు బీసీల దగ్గర ఎందుకు లేవు? ఏడాదికి రూ.20వేల కోట్లు బీసీ లకు బడ్జెట్ లో పెడతామని చెప్పి ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. ఏ మొహం పెట్టుకుని స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ఓట్లు అడుగుతుందని మండిపడ్డారు. పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇవ్వడం ఏమిటి ? 42 శాతం సీట్లు బీసీలు ఎలాగైనా గెలుస్తారు.. మీరు ఇచ్చేది ఏమిటి అని నిలదీశారు.కేంద్రానికి బీసీ బిల్లును పంపించి చేతులు దులుపుకున్నారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో ప్రధాని మోదీని కలిసినపుడు బీసీ బిల్లు చట్టబద్ధత గురించి ఎందుకు చర్చించలేదని ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీసీలోని అన్ని కులాలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని విమర్శించారు. ఇంకా ఎన్నాళ్లు బీసీలను మోసం చేస్తారని మండిపడ్డారు. ఏదో రైతుబంధు డబ్బులు ఇచ్చి స్థానిక సంస్థల ఎన్నికల్లో గట్టెక్కాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుందని ఆరోపించారు. ఈ సారి స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే వచ్చే ఎన్నికల దాకా ఏ హామీలను పట్టించుకోరని తెలిపారు.

## భారతీయులు జాగ్రత్తగా ఉండండి

టచ్‌లో ఉండాలని సూచించింది."ఇరాన్‌లోని భారత పౌరులు, భారత సంతతి వ్యక్తులు అప్రమత్తంగా వ్యవహరించాలి. అనవసర ప్రయాణాలు మానుకోవాలి. రాయబార కార్యాలయం సోషల్ మీడియా ఖాతాలను అనుసరించాలి. స్థానిక అధికారులు సూచించిన భద్రతా నిబంధనలు పాటించాలి" అని టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం 'ఎక్స్' వేదికగా తెలిపింది. ఓ గూగుల్ ఫాంను పోస్ట్ చేసి.. భారత పౌరులు తమ వివరాలను పొందుపర్చాలని సూచించింది. స్థానిక పరిస్థితులపై తాజా వివరాల కోసం ఓ టెలిగ్రామ్ లింక్‌ను షేర్ చేసింది. అదేవిధంగా హెల్ప్‌లైన్ నంబర్లను పోస్ట్ చేసింది.ఇరాన్‌లోని అణు, ఆయుధ, సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ శుక్రవారం భీకర దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. దీంతో టెహ్రాన్ సైతం ప్రతీకార దాడులకు దిగింది. ఇరాన్ అణు కార్యక్రమాన్ని, క్షిపణి వ్యవస్థలను సమూలంగా నిర్మూలించడమే తమ ధ్యేయమని నెతన్యాహు ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ ప్రయత్నంలో ఇది ఆరంభం మాత్రమేనని, మరిన్ని వైమానిక, క్షిపణి దాడులు చేపడతామని చెప్పారు. ఈ క్రమంలోనే ఇరాన్ ఆయుధ తయారీ కర్మాగారాల సమీపంలో నివసించే పౌరులు తక్షణమే ఆ ప్రదేశాలను ఖాళీ చేయాలని ఐడీఎఫ్ కోరింది.

## అవార్డుల వేడుకలకు తప్పనిసరిగా హాజరుకావాలి

కొన్ని నియమ, నిబంధనలు ఉన్నాయి. ముందుగా 2024 చిత్రాలకే అవార్డులు ఇవ్వాలన్నది ప్లాన్. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన ఏడాది నుంచీ ఇస్తే బాగుంటుందని పలువురు సూచించారు. ఆ మేరకు ఓ కమిటీ ఏర్పాటైంది. 2014 నుంచి 2023 వరకూ ఏడాదికి మూడు ఉత్తమ చిత్రాలను ఎంపిక చేయడం కష్టమైన పని. వేడుకలో పాల్గొన్న వారందరికీ కృతజ్ఞతలు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు. సీఎం ఒక గంట కేటాయించారు. కానీ, ప్రోగ్రామ్ ప్లానింగ్ నాలుగున్నర గంటలుగా ఉంది. అందుకే రేవంత్ వేడుకకు వచ్చాక.. పరిస్థితి వివరించి, ఇంకా ఎక్కువ సమయం ఉండాలని వ్యక్తిగతంగా విజ్ఞప్తి చేశా. 'ఎంతసేపు ఉండాలి?' అని అడిగారు. పూర్తయ్యే వరకూ ఉంటే చాలా హ్యాపీ సర్ అని చెప్పా. అలా 2:15 గంటల పాటు అక్కడ ఉన్నారు. సీఎం చేతుల మీదుగా అవార్డులను అందుకున్న వారంతా చాలా ఆనందంగా ఉన్నారు. ఈ పురస్కారాల వేడుక విషయంలో మాకు మార్గనిర్దేశం చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు" "త్వరలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అవార్డులు ఇస్తుంది. ప్రభుత్వం నుంచి అవార్డులు వస్తున్నాయంటే.. చాలా జాగ్రత్తగా వాటిని స్వీకరించాలి. ఎక్కడున్నా, షూటింగ్‌తో బిజీగా ఉన్నా రావాలి. ప్రభుత్వంతో ప్రయాణించాల్సిన బాధ్యత సినిమా వారందరిదీ. ఇకపై ప్రభుత్వం తరఫున అవార్డుల వేడుక ప్రకటన వచ్చినప్పుడు.. మీ డైరీల్లో నోట్ చేసుకుని, మీకు వచ్చిన అవార్డు తప్పకుండా స్వీకరించండి. చిత్ర పరిశ్రమకు ఇది నా విజ్ఞప్తి. అందరూ అర్థం చేసుకుంటారని అనుకుంటున్నా" అని పేర్కొన్నారు. వేడుకకు హాజరై, విజయవంతం చేసిన వారందరికీ ఎఫ్‌డీసీ ఎండీ హరీశ్ ధన్యవాదాలు తెలిపారు.





# యుద్ధం.. భీతావహం

ఆ దేశ ఆర్థిక పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య దాడులు కొనసాగుతున్నాయి. తాజా దాడుల్లో ఇజ్రాయెల్ క్షిపణి ఓ నివాస భవనాన్ని లక్ష్యంగా చేసుకోవడంతో 29 మంది పిల్లలతో సహా 60 మంది మరణించినట్లు ఇరాన్ అధికారులు తెలిపారు. ఇజ్రాయెల్‌లోని గలిలీ ప్రాంతంలోని ఒక అపార్ట్‌మెంట్ భవనంపై టెహ్రాన్ చేసిన ప్రతిదాడుల్లో నలుగురు పౌరులు ప్రాణాలు కోల్పోయారు.శనివారం ఇరుదేశాలు పరస్పరం దాడులకు పాల్పడ్డాయి. టెహ్రాన్ లక్ష్యంగా యుద్ధ విమానాలు, మిస్సైళ్లతో ఇజ్రాయెల్ విరుచుకుపడగా... టెల్ అవీవ్‌పై ఇరాన్ అయిదు విడతల్లో వందల క్షిపణులను ప్రయోగించింది. రెండో రోజు ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్‌లోని పలు కీలక స్థావరాలు సహా నతాంజ్ అణు కేంద్ర ఉపరితల భాగం ధ్వంసమైంది. నేలమాళిగలో ఉన్న ఈ అణు శుద్ధి కేంద్రం ఇరాన్‌కు అత్యంత కీలకమైనది. టెహ్రాన్‌కు వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న ఫోర్డో అణుశుద్ధి కేంద్రంలోనూ పేలుళ్లు




సంభవించాయి.ఇజ్రాయెల్ వరుస దాడులతో ఇరాన్ అణు కేంద్రాలకు భారీ నష్టం వాటిల్లింది. దీనిని ఉపగ్రహ ఛాయా చిత్రాలు స్పష్టంగా చూపిస్తున్నాయి. ఈ ఉపగ్రహ చిత్రాలను మాక్సర్ విడుదల చేసింది.ఇరాన్ ప్రపంచ హెచ్చరికలను ధిక్కరించి, అణ్వాయుధ కార్యక్రమాన్ని కొనసాగిస్తోందని ఇజ్రాయెల్ చాలా కాలంగా ఆరోపిస్తోంది. ఇరాన్‌లో భారీస్థాయిలో అణు బాంబులను ఉత్పత్తి చేయగల యురేనియం నిల్వలు ఉన్నాయని ఇజ్రాయెల్ పేర్కొంది. అయితే ఇరాన్ మాత్రం తన అణు కార్యక్రమం పౌర ప్రయోజనాల కోసమేనని చెబుతోంది. తాజాగా విడుదలైన హై-రిజల్యూషన్ ఉపగ్రహ చిత్రాలు ఇరాన్‌లోని ముఖ్య అణు కేంద్రానికి వాటిల్లిన నష్టాన్ని చూపిస్తున్నాయి. అలాగే దీనికి ముందున్న స్థితిని కూడా సరిపోల్చాయి. యూఎన్ అంతర్జాతీయ అణు శక్తి సంస్థ (ఐఏఈఏ) తెలిపిన వివరాల ప్రకారం ఇజ్రాయెల్ ఆపరేషన్‌లో నటాంజ్, ఫోర్డోలోని ఇరాన్ భూగర్భ యురేనియం కేంద్రాలు, ఇస్ఫహాన్‌లోని యురేనియం తరలింపు కేంద్రంపై దాడులు జరిగాయి.ఉపగ్రహ చిత్రాలను విశ్లేషించిన యూఎస్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సైన్స్ అండ్ ఇంటర్నేషనల్ సెక్యూరిటీ (ఐఎస్ఐఎస్)నివేదిక ప్రకారం అణు కేంద్రంలో విద్యుత్ సరఫరాకు విస్తృతమైన నష్టం వాటిల్లింది. టెహ్రాన్‌కు ఆగ్నేయంగా 220 కిలోమీటర్ల దూరంలో ఉన్న నటాంజ్‌లోని అణు కేంద్రంలో సమృద్ధిగా యురేనియం నిల్వలు ఉన్నాయి. అలాగే ఫోర్డోలోని అణు కేంద్రం టెహ్రాన్‌కు నైరుతి దిశలో 100 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీనికి స్వల్పంగా నష్టం వాటిల్లిందని ఇరాన్ పేర్కొంది.

## దాడుల ఆత్మరక్షణ కోసమే..

ఆపేస్తామని ప్రకటించింది. ఈమేరకు ఆ దేశ విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాక్చీ వెల్లడించారు. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం వరకు వందల సంఖ్యలో క్షిపణులను ఇరాన్ ఇజ్రాయెల్‌పైకి ప్రయోగించిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో సుమారు 10 మంది మృతి చెందగా.. 200 మంది వరకు గాయపడినట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది.పరిస్థితులు డిమాండ్ చేస్తే తప్ప ఇజ్రాయెల్‌తో వివాదాన్ని పొరుగు దేశాలకు విస్తరించాలని ఇరాన్ భావించడం లేదని అబ్బాస్ అరాక్చీపేర్కొన్నారు. మరోవైపు టెహ్రాన్ అణ్వాయుధాలు తయారు చేస్తే తమకు ముప్పు ఉందని, దానిని అడ్డుకునేందుకే అణు స్థావరాలపై దాడులు చేస్తున్నామని ఇజ్రాయెల్ వాదిస్తోంది. వాటిని సమూలంగా నేలమట్టం చేసేంత వరకు దాడులు కొనసాగిస్తామని చెబుతోంది. ఈ నేపథ్యంలో అబ్బాస్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద గ్యాస్ క్షేత్రమైన 'ది సౌత్ పార్స్ క్షేత్రం' ఇజ్రాయెల్ దాడి చేయడంపై అబ్బాస్ తీవ్రంగా మండిపడ్డారు. ఈ క్షేత్రాన్ని ఖతార్ భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నట్లు చెప్పిన ఆయన.. ఇజ్రాయెల్ దుందుడుకు చర్యకు ఇదో ఉదాహరణ అని అన్నారు. యుద్ధాన్ని విస్తరించాలన్న కాంక్షతోనే ఇలాంటి ప్రమాదకర చర్యకు పాల్పడిందని వ్యాఖ్యానించారు. "వివాదాన్ని పర్షియన్ గల్ఫ్ వరకు లాగడం ఓ వ్యూహాత్మక తప్పిదం, యుద్ధాన్ని ఇరానియన్ భూభాగం దాటి విస్తరించాలనే ఉద్దేశంతోనే ఇజ్రాయెల్ ఇలాంటి చర్యలకు పాల్పడుతోంది" అని అబ్బాస్ అన్నారు.అంతర్జాతీయ చట్టాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ ఇరాన్‌లోని అణుస్థావరాలను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయెల్ ఇప్పటికే డేంజర్ లైన్ దాటేసిందని అబ్బాస్ అన్నారు. ఇరాన్- అమెరికా మధ్య అణు చర్చలను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు.

## యుద్ధాన్ని ఆపేస్తా..

**వాషింగ్టన్(జనంసాక్షి):** ఇజ్రాయెల్- ఇరాన్ మధ్య యుద్ధం తీవ్ర రూపం దాల్చుతున్న నేపథ్యంలో ఆ రెండు దేశాలూ ఓ ఒప్పందానికి రావాల్సిన అవసరముందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఆ దిశగా తాను ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. తన మధ్యవర్తిత్వంలో ఎన్నో దేశాల మధ్య శాంతి నెలకొందని చెప్పిన ఆయన.. ఆ క్రెడిట్ మాత్రం తానెప్పుడూ తీసుకోలేదని అన్నారు. ఈ మేరకు తన సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. కేవలం తన వల్లనే నెల రోజుల క్రితం భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగిందని మరోసారి గొప్పలు చెప్పుకొన్నారు. అయితే, ట్రంప్ వ్యాఖ్యలను భారత్ కొట్టిపారేసిన సంగతి తెలిసిందే.ప్రతి వివాదం తన వల్లే పరిష్కారమైందంటూ ప్రగల్భాలు పలికే ట్రంప్.. తాజాగా ఇజ్రాయెల్-ఇరాన్‌ల ఉద్రిక్తతలు తగ్గితే దాన్ని తన ఖాతాలోనే వేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కేవలం ఆత్మరక్షణకోసమే ఇజ్రాయెల్‌పై దాడులు చేశామని, ఆ దేశం సైనిక చర్యను నిలిపివేస్తే.. తాము కూడా ప్రతిదాడులు ఆపేస్తామని ఇరాన్ ప్రకటించిన కొద్ది సేపటికే.. ట్రంప్ ఈ ప్రకటన చేయడం గమనార్హం. అంతకు కొద్దిసేపటి ముందే ఇరాన్ హెచ్చరిస్తూ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్ దాడులతో అమెరికాకు ఎలాంటి సంబంధం లేదని,దాడికి తెగబడితే కనీవినీ ఎరుగని రీతిలో టెహ్రాన్‌పై విరుచుకుపడతామని హెచ్చరించారు. తాజాగా ఆ రెండు దేశాల మధ్య సంధి కుదురుస్తానని మరోసారి గొప్పలు చెప్పుకున్నారు. తాను తొలిసారి అధ్యక్షుడిగా పని చేసిన సమయంలో సెర్బియా-కొసోవో, ఈజిప్ట్ - ఇథియోపియా మధ్య వివాదాలను పరిష్కరించినట్లు చెప్పుకొచ్చారు. అలాగే ప్రస్తుతం ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య కూడా త్వరలోనే శాంతి ఒప్పందం ఏర్పడుతుందన్నారు.

# గద్దర్ అవార్డును మరో నందీ అవార్డుగా మార్చేశారా?

- ప్రొఫెసర్ కంచ ఐలయ్య

**హైదరాబాద్ (జనంసాక్షి) :** గద్దర్ అవార్డుల ప్రెజెంటేషన్ అనేది సినిమా నటుల, రాజకీయ నాయకుల వ్యవహారంగా మారిందని గద్దర్ మిత్రుడు కంచె ఐలయ్య అన్నారు. తెలంగాణను సంస్కృతిని భూస్వామ్య స్థితి నుంచి ప్రజాస్వామ్య రూపంలోకి మారడంలో గణనీయ పాత్ర పోషించి, ఆడి, పాడిన వందలాది మంది కళాకారులను, ప్రజా గాయకులను, పాటల రచయితలను తెలంగాణ ప్రభుత్వం మరచిపోవడం చాలా విచారకరమని, తాను గద్దర్‌కు చాలా దగ్గరి మిత్రుడిని, గద్దర్‌ను కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వమని ఒప్పించిన వాడినని, తనకుకు కూడా ఆహ్వానం రాలేదని, ఇలా చాలా మందికి రాలేదని, తాను రాహుల్ గాంధీకి, తెలంగాణ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నానని, అందుకు ప్రతిగా దూషణలు, బెదిరింపులు ఎదుర్కొంటున్నానని తెలిపారు. గద్దర్ పేరిట అవార్డు ప్రకటించడం ద్వారా తెలంగాణ కళలు, సంస్కృతిలో కొత్త విప్లవం మొదలవుతుందని భావించానని, ఇప్పుడు సినిమా రంగాన్ని ఏయే కులాలు ఆధిపత్యం చేస్తున్నాయో, ఎవరు పెత్తనం చేస్తున్నారో తెలుసునన్నారు. వారు తెలంగాణ ప్రజల సంస్కృతి పట్ల ఎలాంటి వైఖరితో ఉంటారో కూడా తెలుసునని అన్నారు. సినిమా అంటేనే డబ్బు కోసం అన్నట్లు ఉందని, ఇలా డబ్బు సంపాదనే లక్ష్యంగా పెట్టుకున్న సినిమా సంస్కృతిని మార్చి, పూలే తరహా కొత్త తెలుగు సినిమా నిర్మాణ సంస్కృతిని తీసుకురావాలని గద్దర్ అవార్డు ద్వారా ఆశించామని, అటువంటి కొత్త ప్రారంభం ఎక్కడా కనిపించలేదన్నారు. అవార్డు జ్యూరీలో ఒక్క జానపద కళాకారుడు కూడా లేడన్నారు. అందరూ డబ్బు కోసం పనిచేసే సినిమా కళాకారులే. ప్రజల కళలకు ప్రాతినిధ్యం ఎక్కడ? జ్యూరీలో గద్దర్ సాంస్కృతిక ప్రతినిధి ఎక్కడా ? గద్దర్ పాపులర్ పాట అయినా "పొడుస్తున్న పొద్దుమీద" అనే పాటకు ప్రాతినిధ్యం వహించే ఎస్సీ, ఎస్టీ, ఒబీసీ కళాకారులు ఎక్కడ? గద్దర్ అంటేనే ప్రజా పాట అని తెలిపారు. అవార్డు ప్రదాన సమయంలో అటువంటి ప్రజా పాటల, ప్రజా కళాకారులకు సంబంధించిన ప్రజా కళల ప్రతినిధులు ఎక్కడ? గద్దర్ అవార్డును మరో నందీ అవార్డుగా మార్చేశారా? అని ప్రశ్నించారు.

# టెక్నాలజీ ఆధారిత రియల్ ఎస్టేట్ కేంద్రంగా హైదరాబాద్

- ఐపీసీ సమావేశంలో ప్రణవ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ రాంబాబు బూరుగు




**హైదరాబాద్, జూన్ 15 (జనంసాక్షి) :** టెక్నాలజీ ఆధారిత రియల్ ఎస్టేట్ కేంద్రంగా హైదరాబాద్ ఎదుగుతోందని ప్రణవ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీటీఓ రాంబాబు బూరుగు తెలిపారు. రియల్ ఎస్టేట్ రంగాన్ని కొత్త పుంతలు తొక్కించడమే లక్ష్యంగా ప్రణవ గ్రూప్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ప్రాపర్టీ కన్సల్టెంట్ల (ఐపీసీ) సమావేశం హైటెక్ సిటీలోని ట్రైడెంట్ హోటల్‌లో నిర్వహించారు. ముందుగా అతిథులు దీప ప్రజ్వలనతో ఈ సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంబాబు బూరుగు మాట్లాడుతూ నగర అభివృద్ధి, సాంకేతిక ఆవిష్కరణలు, గర్వంగా చెప్పుకోదగిన ప్రాజెక్టుల నిర్మాణానికి కట్టుబడి ఉన్నామన్నారు. కృత్రిమ మేధ ఆధారిత మార్కెటింగ్, స్మార్ట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, సస్టైనబిలిటీ మధ్య సమన్వయం అవసరమన్నారు. నిర్మాణ రంగానికి టెక్నాలజీని అనుసంధానించే వ్యూహాలు అవసరమన్నారు. పరిశ్రమ అభివృద్ధికి కన్సల్టెన్సీల మధ్య భాగస్వామ్యం ఉండాలన్నారు.

ఈ సమావేశం హైదరాబాద్ నగర అభివృద్ధికి మార్గదర్శకంగా నిలిచేలా రియల్ ఎస్టేట్, మార్కెటింగ్ రంగాల్లో కొత్త ప్రమాణాలు ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్యానల్ చర్చ జరిగింది. ఈ సమావేశానికి హోస్ట్ గా నేహా గుప్తా వ్యవహరించారు. ఈ చర్చలో రాంబాబు బూరుగు, సందీప్ పాట్నాయక్, శ్రీకాంత్ రెడ్డి, జోసఫ్ థిలక్ పాల్గొన్నారు. ఈ చర్చ ఎంతో ఆసక్తికరంగా జరిగింది. నూతన డిజిటల్ పోర్టల్‌ను ఉపయోగించి ఆహ్వానితులను ప్రత్యక్షంగా ప్రశ్నలు అడిగి తమ ఆలోచనల్ని పంచుకునే అవకాశం కల్పించారు. ఈ చర్చలో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో మార్పులు, నియంత్రణ విధానాలు, కన్సల్టెన్సీ రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, సుస్థిర డిజైన్ ప్రాముఖ్యత, అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ నగర పురోగతికి సంబంధించిన విభిన్న అంశాలు చర్చించారు. ఈ చర్చలోని అంశాలు రియల్ ఎస్టేట్ రంగంలో కొత్త ప్రమాణాల స్థాపనకు ఆస్కారం ఇస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. ఇంటరాక్టివ్ సెషన్లో పలు అంశాలపై విలువైన సమాచారం పొందారు. కొత్త నెట్‌వర్క్‌లు ఏర్పరచుకున్నారు. అతిథులను నేహా గుప్తా సన్మానించారు. ఈ సమావేశం సహకారం, ఆవిష్కరణ, భాగస్వామ్యం శక్తికి నిదర్శనంగా నిలిచింది. కనెక్షన్, కొలాబరేషన్, క్రియేషన్ అనే మూలాలపై ఆధారపడి జరిగింది. కలలను వాస్తవంగా మార్చే దిశగా ఒక ముందడుగు చెప్పవచ్చు. ఈ కార్యక్రమంలో వరల్డ్ క్లాస్ ఇంటర్నేషనల్ ప్రాపర్టీ కన్సల్టెంట్లు సీబీఆర్ఈ, జేఎల్ఎల్, కుష్మన్ %డ% వేక్‌ఫీల్డ్, నైట్ ఫ్రాంక్, వెస్టియన్, కోలియర్స్ ఇంటర్నేషనల్, సిటాడెల్, సావిల్స్, అనారాక్ సంస్థలు పాల్గొన్నాయి.

### ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. మనోహరమైన కూచిపూడి నృత్యం 'ప్రణవ నాదం' ఈ ప్రదేశానికి ఆధ్యాత్మిక శోభను చేకూర్చింది. వెండి ట్రింగ్స్ ఆధ్వర్యంలో జరిగిన సంగీత ప్రదర్శన ఆధునిక బాలీవుడ్, టాలీవుడ్ గీతాలతో ప్రేక్షకులను ముగ్ధులను చేశారు. ఈ ఈవెంట్‌ను ఫిఫ్త్ మీడియా ఆర్గనైజ్ చేసింది.

# ఆపరేషన్ కగార్‌ను ఆపాలి

- దేశ సంపదను కార్పొరేట్లకు అప్పగించేందుకే ఆపరేషన్ కగార్
- ఆపరేషన్ కగార్ ను ఆపాలని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జూన్ 23న చలో రాజ్ భవన్
- ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి




**హైదరాబాద్ (జనంసాక్షి) :** దేశ సంపదను కార్పొరేట్లకు అప్పగించేందుకే ఛత్తీస్ గఢ్ లో మావోయిస్టులు, అమాయక గిరిజనులపై క్రూర దాడులు జరిపి భయానక నరమేధాన్ని కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్నదని, ఈ నరమేధ చర్యలు వెంటనే ఆపాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం హిమాయత్ నగర్ లోని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయం(సత్య నారాయణ రెడ్డి భవన్)లో జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలన్నారు. అటవీ సంపద, ఖనిజాలు, వనరులు, భూమిని.... అంబానీ, అదానీ వంటి బడా కార్పొరేట్లకు అప్పగించే కుట్రలో భాగమే ఆపరేషన్ కగార్ అని వారు విమర్శించారు. ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం జరిపిన క్రూర మావోయిస్టుల హత్యలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో నిష్పక్షపాత విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. శాంతిభద్రతల సమస్యగా సృష్టించి బూటకపు ఎన్కౌంటర్లను చేస్తున్నదని అన్నారు. డెడ్లైన్ విధించి మావోయిస్టులు, ఆ సంస్థలను అంతం చేస్తామంటూ కేంద్రం ప్రకటించడం వెనుక ఆర్ఎస్ఎస్ రహస్య అజెండాను కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్నట్లు వారు ధ్వజమెత్తారు. ఇలాంటి భయానక దాడులను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక సమస్యగా పరిగణించి చర్చల ద్వారా పరిష్కరించాలని సూచించారు. శాంతిభద్రతల సమస్యగా చూడటం సరైంది కాదన్నారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు ప్రజలంతా ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. మావోయిస్టులపై దాడుల పేరుతో ఆదివాసీలను చంపుతున్నారని విమర్శించారు. సంపదను బడాబాబులకు ఎలా కట్టబెట్టాలన్నదే మోడీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మావోయిస్టులను సాకుగా చూపి దాడులు చేస్తున్నదని అన్నారు. మోడీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మావోయిస్టులతో చర్చలెందుకు జరపడం లేదని ప్రశ్నించారు. చర్చలు జరపకుండా వారిని చంపడం ఫాసిస్టు ప్రభుత్వ లక్షణమని విమర్శించారు. ఉగ్రవాదుల సమస్య పరిష్కారానికి పాకిస్తాన్తో సంప్రదింపులు జరుపుతున్న మోడీ ప్రభుత్వం రాజకీయ సమస్య పరిష్కారానికి మావోయిస్టులతో చర్చలెందుకు జరపడం లేదని ప్రశ్నించారు. ప్రజా సమస్యలు పరిష్కారం కాకుంటే మావోయిస్టులు కాకుంటే మరో రూపంలో ప్రతిఘటన వస్తుందన్నారు. ప్రజాస్వామిక హక్కులను కాపాడుకోవడం కోసం ప్రజలు ముందుకొస్తారని చెప్పారు. అందుకే ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో జూన్ 23న అడవుల్లోని ఖనిజ సంపదను, వనరులను కార్పొరేట్లకు దోచిపెట్టే "ఆపరేషన్ కగార్"ను ఆపాలని, ఆదివాసీలపై దమనకాండను ఆపాలని, కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణను ప్రకటించి మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ ఛలో రాజ్ భవన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు ప్రకటించారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ వెంకటేశ్వర్లు, నానబాల రామకృష్ణ, బిజ్జ శ్రీనివాసులు, టి. సత్య ప్రసాద్, పేరబోయిన మహేందర్, శ్రీమాన్, కొండల్, రాష్ట్ర సమితి సభ్యులు ఎల్లంకి మహేష్, ఉపేంద్ర, సల్మాన్ బేగ్, శివ కుమార్, రాజేష్, మహమూద్, మాజీద్, మహేష్, మధు తదితరులు పాల్గొన్నారు.



# సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త

**హైదరాబాద్ (జనంసాక్షి) :** పేద ప్రజలకు కార్పోరేట్ వైద్యం అందించాలన్న దృఢ సంకల్పంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ అందిస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. సాయి రామ్ నగర్, బీఎన్‌రెడ్డి నగర్‌కు (ఆర్య వైశ్య సామాజిక వర్గం) చెందిన శ్రవణ్ కుమార్ కుమార్తె హన్యశ్రీ కి మంజూరైన రూ. 3. 5లక్షల చెక్కును ఉప్పల శ్రీనివాస్ గుప్త క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన విధానం పేద ప్రజలకు వరం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బొగ్గారపు వరుణ్, డాక్టర్ రాజయ్య గుప్తా, కాంగ్రెస్ నాయకులు, ఆర్య వైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

**బండ్లగూడ, జూన్ 15 (జనంసాక్షి) :** కుటుంబ కలహాలతో ఒక వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని భవాని నగర్‌లో నివాసముండే కుమారస్వామి రెడ్డి శనివారం సాయంత్రం ఇంట్లో గొడవపడ్డాడు. అనంతరం తన గదిలోకి వెళ్లి తలుపు వేసుకొని ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# కీసరగుట్టలో గుప్త నిధుల కోసం తవ్వకాలు



**కీసర, జూన్ 15 (జనంసాక్షి) :** కీసరగుట్టలో గుర్తు తెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపినట్టు ఆధారాలు లభించాయి. ఈ విషయపై కొంతమంది స్థానికులు ఉన్నతాధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. కీసరగుట్ట శ్రీ భవాని రామలింగేశ్వరస్వామి ఆలయం వెనుకభాగంలోని లింగాల కుంటలో గుర్తు తెలియని దుండగులు వ్యక్తులు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు ఆనవాళ్లు కన్పించాయి.

స్వామివారి ఆలయానికి కొద్ది దూరంలో ఉన్న లింగానికి పూజలు చేసి గుప్త నిధుల కోసం కొన్ని అడుగుల మేరకు అట్టి స్థలంలో పూజలు చేసి తవ్వకాలు జరిపారు. ఈ సంఘటన స్థలంలో ఓ మట్టికుండ, ఎర్రని గుడ్డ, పసుపు, నీళ్ల బాటిల్ కన్పించడటం పలు అనుమానాలకు తావిస్తుంది. సాక్షాత్తు శ్రీ రామచంద్రుడు పూజలు జరిపి ప్రతిష్టించాడని శ్రీ భవాని రామలింగేశ్వరస్వామి ఆలయానికి పురాతన కాలం నుంచి ఎన్నో కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి.

కీసరగుట్టలో గుప్త నిధుల కోసం గతంలో ఇంతకుముందు కూడా తవ్వకాలు జరిపిన ఆనవాళు కూడా ఉన్నాయి. ఈ విషయం మీద ఉన్నతాధికారులు ప్రత్యేక చొరువ తీసుకొని అక్రమంగా గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన దుండగులను గుర్తించి వారి మీద కఠిన చర్యలు తీసుకోవాలని కీసర ప్రజలతోపాటు పలువురు భక్తులు డిమాండ్ చేస్తున్నారు.


# ఘట్‌కేసర్‌లో బీటెక్ విద్యార్థి అదృశ్యం



**ఘట్‌కేసర్, జూన్ 15 (జనంసాక్షి) :** బీటెక్ విద్యార్థి అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ పట్టణంలోని వివేకానంద జూనియర్ కళాశాల సమీపంలో నివాసముంటున్న ఇస్లావత్ రాహుల్(21) మున్సి పాలిటీ పరిధి అంకుషాపూర్‌లోని ఏసీఈ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ 3వ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల14న ఎలాంటి సమాచారం లేకుండా తన రూమ్ నుండి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతని తండ్రి ఇస్లావత్ మల్లేష్ బంధుమిత్రులు, ఇతర ప్రాంతాలలో వెతికినా ఫలితం లేకపోవడంతో ఘట్‌కేసర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. అదృశ్యమైన విద్యార్థి తండ్రి మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. అదృశ్యమైన వ్యక్తి సమాచారం తెలిసినవారు సాయికుమార్ ఎస్సై 87125 80183, ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ 87126 62705 కు సమాచారం ఇవ్వాలని కోరారు.

# చెరువుల యాజమాన్యంపై తిరగబడ్డ గిరిజన మహిళలు

- కుక్కలను చేపలకు ఎరగా వేస్తున్న వైనం
- జీవం లేని కోళ్లకు అడ్డాగా ఏజెన్సీ చెరువులు





**మహబూబాబాద్ ప్రతినిధి, జూన్ 15 (జనంసాక్షి):** ప్రభుత్వం గిరిజన ప్రజానీకానికి దోహదపదే విధంగా సబ్సిడీ ఇస్తూ చేపల పెంపకాన్ని ప్రోత్సహించిన ప్రభుత్వాన్ని మోసం చేస్తూ అడ్డదారిగా అక్రమ సంపాదన ధ్యేయంగా లాభార్జన కోసం చేపల పెంపకం గుత్తేదారులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. స్థానికంగా ఉన్న మహబూబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని ఓటాయి రేన్య తండా గ్రామ వాసులు నేరుగా చేపల చెరువు ప్రాంతానికి వెళ్లి మా ప్రాణాలు తీయకండి అంటూ చెరువుల యాజమాన్యంపై ఆగ్రహించడం జరిగింది గత నాలుగు సంవత్సరాలుగా యదేచ్ఛగా పట్టణ ప్రాంతాల నుండి రాత్రులు టాటా గూడ్స్ ద్వారా కోడి వ్యర్థాలను చికెన్ షాప్ లు తిరుగుకుంటూ వాటిని సేకరించి చేపలకు మేతగా వేస్తున్నారు. గత కొన్నేళ్లుగా గుట్టుగా సాగుతున్న తతంగాన్ని స్థానిక మహిళ లోకం ఆగ్రహించి ఈ చేపల చెరువులను తక్షణమే తొలగించాలని యజమాన్యంతో వాగ్వాదానికి దిగడం జరిగింది. ప్రభుత్వ అధికారులు స్పందించడం లేదంటూ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలను తీసే ఇలాంటి చేపల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహించొద్దని సహజంగా పెంచే వారికి మాత్రమే సబ్సిడీలు ఇచ్చి ప్రభుత్వం ప్రోత్సహించాలని వారు కోరుతున్నారు. ఎలాంటి కల్తీ లేకుండా పెరిగే చాపలను ఇలా కల్తీ చేస్తూ జీవం లేని వ్యర్థాలను వేసి స్వచ్ఛమైన అడవి ప్రాంతాన్ని కాలుష్యం చేస్తూ పర్యావరణకు ఎంతో ముప్పు కలిగిస్తున్నారని అన్నారు. ఈ వ్యర్థాల ద్వారా వాసన రావడంతో శ్వాస తీసుకోవాలన్న ఇబ్బందిగా మారిందని ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని రాత్రులు సైతం నిద్ర పట్టడం లేదని అన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలకు పాటుపడితే కఠిన చర్యలు

- డిఎస్పి సూర్యనారాయణ




**కాటారం, జూన్ 15 ( జనం సాక్షి):** ప్రజాస్వామ్యంలో ప్రజల హక్కులు మానవ రాజ్యాంగ హక్కులు వాటి విషయంలో ఇలాంటి తప్పిదాలు జరిగిన వదిలిపెట్టి ది లేదని డి ఎస్ పి చెప్పారు పోలీసులు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని కాటారం డిఎస్పి సూర్యనారాయణ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాటారం సబ్ డివిజన్లోని అన్ని గ్రామాలలో పర్యటించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాంతి భద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తానన్నారు. అలాగే శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత చెడు అలవాట్లకు బానిసగా మారి ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లలలో పర్యవేక్షించాలన్నారు, గ్రామాలలో సమస్యలు ఉన్న, అక్రమ దందాలు నిర్వహించిన డయల్ 100 కి కాల్ చేయాలని అన్నారు. సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఏ గొడవలు లేకుండా ప్రశాంతంగా జీవించాలని సూచించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 16 జూన్ 2025
తెలంగాణ

# గాజాలో ఇజ్రాయెల్ జాతి నిర్మూలన

## అమెరికా స్థానికుల నిర్మూలనతో సమాంతరం

గాజా పట్టణంలో ఇజ్రాయెల్ అమలు చేస్తున్న జాతి నిర్మూలన, అమెరికాలో స్థానిక అమెరికన్లను నిర్మూలించిన చారిత్రక దురాగతాలతో ఆశ్చర్యకరమైన సమానతలను కలిగి ఉంది. ఈ రెండు సంఘటనల మధ్య సాంస్కృతిక, రాజకీయ, సైనిక సమాంతరాలు, అమెరికా అందిస్తున్న ఏకపక్ష మద్దతుతో జియోనిస్ట్ ఇజ్రాయెల్ పాలస్తీనియన్లపై చేస్తున్న మారణహోమాన్ని అర్థం చేసుకోవడానికి కీలకమైనవి. ఈ దురాగతాలు చరిత్ర యొక్క దారుణమైన పునరావృతంగా నిలుస్తున్నాయి, ఇది అంతర్జాతీయ సమాజం ముందు నైతిక సవాలుగా ఉంది.

**గాజాలో జరుగుతున్న భయానక సంఘటనలు**

ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ అధికారి ఒకరు, తెల్ల జెండా ఊపుతూ రోడ్డు దాటుతున్న ఇద్దరు గాజా పౌరులను కాల్చి చంపమని ఆదేశించిన ఆరోపణలు అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళనలను రేకెత్తించాయి. ఈ ఘటన, యుద్ధంతో ధ్వంసమైన "నెట్‌జారిమ్ కారిడార్"లో జరిగినట్లు, హిబ్రూ వార్తాపత్రిక హారెట్జ్ జూన్ 4, 2025న నివేదించింది. ఆశ్చర్యకరంగా, ఈ నిందిత అధికారికి పదోన్నతి ఇవ్వడం, జియోనిస్ట్ జాతి ప్రక్షాళనకు ఇజ్రాయెల్ సైన్యం బహిరంగ మద్దతు అందిస్తున్నట్లు సూచిస్తుంది. ఈ బహిర్గతం, గాజాలో జరుగుతున్న భయానక సంఘటనలకు కేవలం "మంచు కొండ కొన" మాత్రమేనని విమర్శకులు ఆరోపిస్తున్నారు. ఇది గాజాలో అమెరికా మద్దతుతో జరుగుతున్న మారణహోమాన్ని వివరించే ఒక చిన్న సూచన మాత్రమే.

అమెరికా ఏకపక్ష మద్దతుతో ఇజ్రాయెల్ ఈ దురాగతాలను కొనసాగిస్తోంది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి, గాజాలో "బేషరతు, శాశ్వత కాల్పుల విరమణ"కు పిలుపునిచ్చే తీర్మానాన్ని ప్రతిపాదించగా, అమెరికా దానిని వీటో చేసింది. జూన్ 5, 2025న, ట్రంప్ పరిపాలన, అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ICC) నెతన్యాహుపై అరెస్ట్ వారెంట్ జారీ చేయడాన్ని, అమెరికా యుద్ధ నేరాలపై దర్యాప్తును వ్యతిరేకిస్తూ, ICC న్యాయమూర్తులపై ఆంక్షలు విధించింది. ఈ చర్యలు, అమెరికా మరియు ఇజ్రాయెల్ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘిస్తాయని ట్రంప్ పరిపాలన వాదించింది. అయితే, ICC బందీల విడుదల, గాజాకు మానవతా సహాయంపై ఆంక్షల ఎత్తివేతను డిమాండ్ చేసింది. ఈ చర్యలు, గాజాలో మానవ హక్కుల ఉల్లంఘనలను కప్పిపుచ్చేందుకు అమెరికా చేస్తున్న ప్రయత్నాలను బహిర్గతం చేస్తున్నాయి.

**అమెరికా స్థానికుల నిర్మూలన**

గాజాలో జరుగుతున్న ఈ దురాగతాలు, అమెరికాలో స్థానిక అమెరికన్ల నిర్మూలనతో సమానమైన పద్ధతులను ప్రతిబింబిస్తాయి.



1776 నుండి 1898 వరకు, అమెరికా ప్రభుత్వం స్థానికులపై దాడులు చేసిన సైనికులకు భూమి, పతకాలు, గౌరవాలు అందించింది. అబ్రహం లింకన్ హయాంలో, 1862 హోమ్‌స్టెడ్ చట్టం ద్వారా 21 ఏళ్లు పైబడిన శ్వేతజాతీయులకు 10 డాలర్ల రిజిస్ట్రేషన్ ఫీజుతో 160 ఎకరాల భూమిని అందించి, స్థానికులపై మారణహోమాన్ని ప్రోత్సహించారు. 1863లో బేర్ రివర్ మారణహోమంలో 250–400 మంది షోషోన్ స్థానికులు, 1864లో సాండ్ క్రీక్‌లో 160 మంది శాంతియుత స్థానికులు హత్యకు గురయ్యారు. కల్నల్ జాన్ చివింగ్టన్ నేతృత్వంలోని 700 మంది సైనికులు, మహిళలు, పిల్లలు, శిశువులతో సహా నిరాయుధ స్థానికులను ఊచకోత కోశారు. వారు శరీర భాగాలను ట్రోఫీలుగా సేకరించి, గౌరవాలు పొందారు. చివింగ్టన్, "స్థానికులను చంపడం గౌరవప్రదం" అని ప్రకటించాడు. 1890లో వౌండెడ్ నీ మారణహోమంలో, 200 మంది నిరాయుధ స్థానికులను హత్య చేసిన సెవెంత్ కావల్రీ సైనికులకు అధ్యక్షుడు బెంజమిన్ హారిసన్ మెడల్ ఆఫ్ ఆనర్ ప్రదానం చేశారు.

ఈ చారిత్రక దురాగతాలు, గాజాలో పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ అనుసరిస్తున్న వ్యూహాలతో సమానంగా ఉన్నాయి. అమాయక పౌరులపై కాల్పులు, హంతకులకు పదోన్నతులు, మానవతా సహాయంపై ఆంక్షలుఇవన్నీ అమెరికా స్థానికుల నిర్మూలన సమయంలోని దారుణాలను పునరావృతం చేస్తున్నాయి. అమెరికన్ సైనికులు స్థానికుల చర్మాన్ని ఒలిచి బూట్లు తయారు చేయాలని, వారిని తుడిచిపెట్టాలని బహిరంగంగా ప్రకటించినట్లే, ఇజ్రాయెల్ సైన్యం కూడా పాలస్తీనియన్లపై హింసను సమర్థిస్తోంది.

**అమెరికా–ఇజ్రాయెల్ సహకారం: ఒక రాజకీయ ఆట**

జియోనిస్ట్ ఇజ్రాయెల్‌ను మధ్యప్రాచ్యంలో తన సైనిక స్థావరంగా అమెరికా ఉపయోగిస్తోందని విమర్శకులు ఆరోపిస్తున్నారు. ఈ సహకారం, పాలస్తీనియన్ల నిర్మూలనకు భౌతిక, సైనిక, రాజకీయ–ఆర్థిక మద్దతును అందిస్తోంది. గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషన్ వంటి సంస్థల ఆహార పంపిణీ కేంద్రాలపై దాడులు, అమెరికా సెటిలర్ వలసవాదులు స్థానిక అమెరికన్లపై అనుసరించిన వ్యూహాలను పోలి ఉన్నాయి. ఈ చర్యలు, చారిత్రక నిర్మూలన పద్ధతుల నుండి వారసత్వంగా వచ్చినవని స్పష్టమవుతోంది. అమెరికా, ఇజ్రాయెల్‌ను ఆయుధాలు, ఆర్థిక సహాయం, రాజకీయ రక్షణతో బలపరుస్తూ, ఈ దురాగతాలకు సహకరిస్తోంది. ఈ సందర్భంలో, అమెరికా స్థానికుల నిర్మూలన సమయంలో ఉపయోగించిన భూమి ఆకర్షణ, హత్యలకు గౌరవాలు వంటి వ్యూహాలు, గాజాలో పాలస్తీనియన్లపై జియోనిస్ట్ దాడులలో ప్రతిబింబిస్తున్నాయి.

గాజాలో జరుగుతున్న జాతి నిర్మూలన, అమెరికా స్థానికుల హత్యాకాండ చరిత్రను గుర్తు చేస్తూ, అంతర్జాతీయ సమాజం ముందు ఒక సవాలుగా నిలుస్తోంది. ఈ దురాగతాలను ఖండించడం, బందీల విడుదల, మానవతా సహాయం అందించడం కోసం ప్రపంచవ్యాప్తంగా ఒత్తిడి తీసుకురావాలి. ఇజ్రాయెల్ మరియు అమెరికా నాయకులను యుద్ధ నేరాలకు బాధ్యులను చేయడం ద్వారా, చరిత్ర యొక్క ఈ దుర్మార్గమైన పునరావృతాన్ని అరికట్టవచ్చు. పాలస్తీనియన్ల హక్కుల కోసం, న్యాయం కోసం పోరాడే ప్రతి గొంతు, మానవాళి యొక్క సమిష్టి ఆత్మను బలోపేతం చేస్తుంది. అంతర్జాతీయ సంస్థలు, ప్రజా ఉద్యమాలు, నీతివంతమైన సమాజాలు ఈ హింసను అరికట్టడానికి ఐక్యంగా పనిచేయాలి. గాజా ప్రజల బాధలు, స్థానిక అమెరికన్ల చారిత్రక బాధలను ప్రతిధ్వనిస్తూ, న్యాయం కోసం ప్రపంచవ్యాప్తంగా ఒక సమిష్టి కృషిని డిమాండ్ చేస్తున్నాయి.

గాజాలో జియోనిస్ట్ ఇజ్రాయెల్ చేస్తున్న జాతి నిర్మూలన, అమెరికా స్థానికుల నిర్మూలన చరిత్రతో సమాంతరంగా ఉంది. ఈ రెండు సంఘటనలు, సెటిలర్ వలసవాదం, సైనిక ఆధిపత్యం, హింసను సమర్థించే గౌరవాల వ్యవస్థల ద్వారా లింక్ చేయబడ్డాయి. అమెరికా మద్దతుతో, ఇజ్రాయెల్ ఈ చారిత్రక హోలోకాస్ట్ వ్యూహాన్ని పాలస్తీనియన్లపై అమలు చేస్తోంది. ఈ దురాగతాలను అరికట్టడానికి, ప్రపంచ సమాజం తన నైతిక బాధ్యతను నెరవేర్చాలి. పాలస్తీనియన్ల హక్కుల కోసం, మానవతా న్యాయం కోసం పోరాడే సమయం ఇప్పుడు. చరిత్ర యొక్క ఈ దుర్మార్గమైన అధ్యాయాన్ని మూసివేయడానికి, ప్రపంచం ఒక్కటై నిలబడాలి.



**పీజే జేమ్స్, ప్రధాన కార్యదర్శి,**
సీపీఐ (ఎం.ఎల్) రెడ్ స్టార్



# డిజిటల్ బజార్

## అబద్ధాల నీడలో మోసాల జాతర

మన అరచేతిలో ఇమిడిపోయిన డిజిటల్ ప్రపంచం, ఈ–కామర్స్ రూపంలో అపారమైన సౌలభ్యాన్ని అందిస్తోంది. ఇంటి నుండి బయటకు అడుగుపెట్టకుండానే వర్చువల్ దుకాణాలను సందర్శించవచ్చు, ధరలను పోల్చవచ్చు, క్షణాల్లో వస్తువులు గుమ్మం వద్దకు చేరతాయి. ఈ–కామర్స్ మన జీవితాలను ఊహించనంతగా సౌకర్యవంతం చేసింది. అయితే, ఈ తక్షణ సంతృప్తి, అనంత ఎంపికల వెనుక ఒక క్లిష్టమైన కథనం దాగి ఉంది. ఈ డిజిటల్ బజార్‌లో నిజాయితీకి, మోసానికి మధ్య గీత అస్పష్టమవుతోంది. ఈ సవాలును ఎదుర్కొనేందుకు, సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సిసిపిఎ) జూన్ 6, 2025న ఒక ముఖ్యమైన ఆదేశం జారీ చేసింది. అన్ని ఈ–కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు మూడు నెలల్లోపు తమ ప్రకటనలు, వెబ్‌సైట్ డిజైన్‌లను స్వయంగా తనిఖీ చేసి, మోసపూరిత "డార్క్ ప్యాటర్న్‌లను" తొలగించాలని స్పష్టం చేసింది. ఈ చర్య, డిజిటల్ కొనుగోళ్లలో పారదర్శకత, విశ్వసనీయత యొక్క అవసరాన్ని కళ్లకు కట్టినట్లు చూపిస్తుంది.

మన స్మార్ట్‌ఫోన్ తెరలపై మెరిసే వ్యక్తిగతీకరించిన ప్రకటనలు మొదట చూసినప్పుడు మాయాజాలంలా అనిపిస్తాయి. "నేను ఈ గ్యాడ్జెట్ గురించి ఆలోచిస్తున్నానని వీళ్లకు ఎలా తెలిసింది?" అని ఆశ్చర్యపోతాం. ఈ కచ్చితత్వం వెనుక మన బ్రౌజింగ్ అలవాట్లు, కొనుగోళ్లు, వెతికిన పదాలను నిశితంగా విశ్లేషించే అధునాతన అల్గారిథమ్‌లు పనిచేస్తాయి. నైతికంగా, పారదర్శకంగా జరిగినప్పుడు, ఈ వ్యక్తిగతీకరణ మన కొనుగోలు అనుభవాన్ని మెరుగుపరుస్తుంది. కావాల్సిన వస్తువులను సులభంగా కనుగొనేలా చేసి, సమయాన్ని ఆదా చేస్తుంది. ధరల పోలికలు, ఆకర్షణీయ డిస్కౌంట్‌లు, ఆఫర్‌లు వినియోగదారులకు నిజమైన ప్రయోజనాలను అందిస్తాయి. అయితే, ఈ అల్గారిథమ్‌లు ఒక్కోసారి మోసపూరిత వ్యూహాల వైపు మనల్ని నడిపిస్తాయి. "పరిమిత కాల ఆఫర్‌లు" ఎప్పటికీ ముగియవు, ఐదు నక్షత్రాల రేటింగ్‌లు కృత్రిమంగా కనిపిస్తాయి. ఇక్కడే డిజిటల్ బజార్ తన మోసపూరిత కోణాన్ని బయటపెడుతుంది. "డార్క్ ప్యాటర్న్‌లు" అని పిలవబడే సూక్ష్మమైన డిజైన్ ఎంపికలు, తెలియకుండానే మనల్ని కొనుగోలు చేయడానికి లేదా అనవసరమైన సబ్‌స్క్రిప్షన్‌లకు నమోదు చేయడానికి ఒత్తిడి చేస్తాయి.

**చీకటి తెర: డార్క్ ప్యాటర్న్‌ల ఉచ్చు**

డిజిటల్ బజార్, సౌలభ్యాన్ని అందిస్తూనే, అబద్ధాలు, మోసాల నిలయంగా కూడా మారుతోంది. ఈ మోసాలు తరచుగా "డార్క్ ప్యాటర్న్‌ల" రూపంలో వస్తాయి. ఉదాహరణకు, బాస్కెట్ స్నీకింగ్‌మీ అనుమతి లేకుండా కార్ట్‌లో అదనపు వస్తువులు చేర్చడం, లేదా కన్ఫర్మ్ షేమింగ్‌సబ్‌స్క్రిప్షన్ రద్దు చేయకుండా అపరాధభావంతో కూడిన భాష ఉపయోగించడం. తప్పుదోవ పట్టించే క్లెయిమ్‌లు ఉత్పత్తి లక్షణాలను అతిశయోక్తి చేయడం, మార్చబడిన చిత్రాలు ఉపయోగించడం కూడా సర్వసాధారణం. నకిలీ సమీక్షలు, కృత్రిమ సానుకూల అభిప్రాయాల ద్వారా వినియోగదారులను మోసగించడం జరుగుతోంది. డ్రిప్ ప్రైసింగ్‌ప్రారంభ ధర తక్కువగా చూపించి, చెల్లింపు దశలో షిప్పింగ్, ప్రాసెసింగ్ ఛార్జీలు జోడించడంమరో సాధారణ వ్యూహం. తప్పుడు ఆవశ్యకత సృష్టించడం"చివరి 2 వస్తువులు మాత్రమే!" లేదా "పరిమిత కాల ఆఫర్!" అని తొందరపాటు కొనుగోళ్లకు ప్రేరేపించడం కూడా ఉంది. సబ్‌స్క్రిప్షన్ ట్రాప్‌లుఉచిత ట్రయల్ తర్వాత రద్దు చేయడం కష్టతరం చేయడం, లేదా బైట్–అండ్–స్విచ్‌తక్కువ ధర వస్తువు ప్రకటించి, అది అందుబాటులో లేదని చెప్పి ఖరీదైన ప్రత్యామ్నాయాన్ని అంటగట్టడం వంటివి వినియోగదారుల నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయి. ప్రకటించని ఎండార్స్‌మెంట్‌లుడబ్బు తీసుకుని చేసే ప్రమోషన్‌లను నిజమైన సిఫార్సులుగా చూపించడం కూడా మోసపూరితమే.


ఈ పెరుగుతున్న ఆందోళనలను గుర్తించి, భారత నియంత్రణ సంస్థలు మోసపూరిత ఈ–కామర్స్ ప్రకటనలు, డార్క్ ప్యాటర్న్‌లను అరికట్టడానికి చురుకైన చర్యలు తీసుకుంటున్నాయి. కన్స్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్, 2019, సిసిపిఎ ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కులకు బలమైన రక్షణగా నిలుస్తుంది. 2023లో సిసిపిఎ జారీ చేసిన "డార్క్ ప్యాటర్న్‌ల నివారణ నియంత్రణకు మార్గదర్శకాలు", 13 నిర్దిష్ట డార్క్ ప్యాటర్న్‌లను నిషేధించాయి. జూన్ 2025లో సిసిపిఎ ఆదేశం ప్రకారం, ఈ–కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు మూడు నెలల్లో స్వీయ–ఆడిట్‌లు నిర్వహించి, మోసపూరిత పద్ధతులను తొలగించాలి. కన్స్యూమర్ ప్రొటెక్షన్ (ఈ–కామర్స్) రూల్స్, 2020, ప్రకటనలు ఉత్పత్తి లక్షణాలు, అందుబాటు, వినియోగానికి అనుగుణంగా ఉండాలని, ధర, వాపసు విధానాలు, ఫిర్యాదు పరిష్కారంలో పారదర్శకతను నిర్ధారిస్తాయి. నకిలీ సమీక్షలు, తప్పుదోవ పట్టించే ప్రకటనలను నిషేధిస్తాయి. అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఏఎస్‌సిఐ), స్వీయ–నియంత్రణ సంస్థగా, తప్పుదోవ పట్టించే ప్రకటనలపై ఫిర్యాదులను పరిష్కరిస్తుంది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్, 2000, ఆన్‌లైన్ లావాదేవీలు, సైబర్ సెక్యూరిటీని నియంత్రిస్తుంది. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్, 2023, వినియోగదారుల డేటా సేకరణ, ప్రాసెసింగ్‌లో స్పష్టమైన సమ్మతిని తప్పనిసరి చేస్తుంది.

ఈ బలమైన నియంత్రణలు ఉన్నప్పటికీ, సవాళ్లు కొనసాగుతున్నాయి. లెక్కలేనన్ని ప్లాట్‌ఫామ్‌లు, విక్రేతలతో కూడిన డిజిటల్ బజార్, నియంత్రణ సంస్థలకు అమలును సవాలుగా మార్చుతోంది. కృత్రిమ మేధ, డీప్‌ఫేక్ టెక్నాలజీ వంటి సాంకేతిక పురోగతులు మోసపూరిత పద్ధతులకు కొత్త మార్గాలను తెరుస్తున్నాయి. అంతర్జాతీయ లావాదేవీల సంక్లిష్టతలు నియంత్రణను మరింత కష్టతరం చేస్తాయి. ఈ–కామర్స్ ప్రపంచం ఒక రెండు అంచుల కత్తిలా ఉంది. ఇది సౌలభ్యం, ప్రయోజనాలను అందిస్తూనే, మోసపూరిత పద్ధతులకు నిలయంగా కూడా మారుతోంది. సిసిపిఎ లాంటి సంస్థలు, కఠిన నియంత్రణలు, స్వీయ–ఆడిట్ ఆదేశాల ద్వారా పారదర్శక, నమ్మదగిన డిజిటల్ మార్కెట్‌ను నిర్మించేందుకు కృషి చేస్తున్నాయి. అయితే, ఈ లక్ష్యం సాధించడానికి నియంత్రణలతో పాటు వినియోగదారుల జాగరూకత కూడా అవసరం. డిజిటల్ బజార్‌లో మన జాగరూకతే మన బలమైన కవచం. నిజమైన సమాచారంతో, విమర్శనాత్మక ఆలోచనతో, మన హక్కుల గురించి అవగాహనతో, ఈ మోసాల జాతరను ఎదుర్కొని, పారదర్శకమైన డిజిటల్ భవిష్యత్తును నిర్మించవచ్చు.



**జనక మోహన రావు దుంగ**
ఫోన్: 8247045230

# రక్తదానం- ప్రాణం పోసే మహోన్నత దానం!



దానాల్లో అత్యుత్తమమైనది రక్తదానం. ఒకరి ప్రాణాన్ని కాపాడే ఈ మహోన్నత చర్య గురించి తెలుసుకుందాం. మన భారత భూమి ఏకలవ్యుడు, కర్ణుడు, శిబి చక్రవర్తి, బలి చక్రవర్తి వంటి దానశీలులకు జన్మస్థానం. పురాణాల ప్రకారం, వైశాఖ మాసం దానాలకు పవిత్రమైనదిగా చెప్పబడింది. అయితే, ఏ కాలంలోనైనా, ఎప్పుడైనా చేయగలిగే ఒకే ఒక దానం రక్తదానం. ఇది ఎందరో ప్రాణాలను నిలబెడుతుంది, ఆశలను చిగురింపజేస్తుంది.

రక్తదానం అన్ని దానాల్లో గొప్పది, ఎందుకంటే ఇది నేరుగా ప్రాణాలను రక్షిస్తుంది. రోడ్డు ప్రమాదాల్లో గాయపడినవారు, ప్రసవ సమయంలో తీవ్ర రక్తస్రావం ఎదుర్కొనే మహిళలు, పెద్ద శస్త్రచికిత్సలు చేయించుకునే రోగులు, హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్నవారు, క్యాన్సర్, హిమోఫిలియా, మూత్రపిండ వ్యాధులు, సికిల్ సెల్ అనీమియా, థ్రోంబో సైటోపెనియా, తలసేమియా వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు, కీమోథెరపీ తీసుకునే రోగులువీరందరికీ రక్తం అత్యవసరం. ముఖ్యంగా సికిల్ సెల్ రోగులకు జీవితాంతం రక్త మార్పిడి అవసరం. మన దేశంలో ప్రతిరోజూ సుమారు 12,000 మంది నాణ్యమైన రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రతి రెండు సెకన్లకు ఒకరికి రక్తం కావాలి, రోజుకు 38,000 మందికి పైగా రక్తం అవసరం. జీవితకాలంలో ముగ్గురిలో ఒకరికి రక్తమార్పిడి అవసరమవుతుందని అంచనా. దేశంలో ఏటా 1.50 కోట్ల యూనిట్ల రక్తం కావాలి, కానీ 1.10 కోట్ల యూనిట్లు మాత్రమే సేకరణ అవుతున్నాయి. ఈ అంతరాన్ని తగ్గించాలంటే రక్తదాతల సంఖ్య పెరగాలి. కృత్రిమ రక్తం ఇంకా అందుబాటులో లేదు, ఒక రక్త సమూహం ఉన్నవారికి అదే సమూహం రక్తం మాత్రమే ఇవ్వాలి, లేకుంటే ప్రాణాపాయం కలుగుతుంది.

రక్తదానంపై అనేక అపోహలు వ్యాప్తిలో ఉన్నాయి. వీటిని తొలగించి సరైన అవగాహన కల్పించడం అవసరం. మానవ శరీరంలో 5–6 లీటర్ల రక్తం ఉంటుంది, ఇది శరీర బరువులో 7% ఉంటుంది. రక్తదానంలో కేవలం 350 మిల్లీలీటర్ల రక్తం సేకరిస్తారు, ఇది 15–20 నిమిషాల్లో పూర్తవుతుంది. రక్తదానం చేసిన గంటలోపు సాధారణ కార్యకలాపాలు చేయవచ్చు. ప్రతి 90 రోజులకు రక్తదానం చేయవచ్చు. రక్తంలో ప్లాస్మా 24–48 గంటల్లో, ఎర్ర రక్త కణాలు మూడు వారాల్లో, ప్లేట్‌లెట్స్, తెల్ల రక్త కణాలు నిమిషాల్లో పునరుత్పత్తి అవుతాయి. కాబట్టి, రక్తదానం వల్ల ఎలాంటి హాని ఉండదు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల ప్రకారం, 18–65 ఏళ్ల మధ్య వయస్సు, కనీసం 50 కిలోల బరువు, మంచి ఆరోగ్యం ఉన్నవారు రక్తదానం చేయవచ్చు. హిమోగ్లోబిన్ స్థాయి స్త్రీలకు 12 గ్రాములు, పురుషులకు 13 గ్రాముల కంటే తక్కువ ఉండకూడదు. దంత వైద్యం చేయించుకున్న వారు ఒక రోజు తర్వాత రక్తదానం చేయవచ్చు. పాలిచ్చే తల్లులు, మలేరియా, డెంగ్యూ, జికా వైరస్ ప్రాంతాలకు వెళ్లినవారు కొంత వ్యవధి తర్వాత రక్తదానం చేయాలి. హెచ్‌ఐవీ, హెపటైటిస్, సిఫిలిస్, టీబీ వంటి అంటు వ్యాధులు, డ్రగ్స్, స్టెరాయిడ్స్ వాడే వారు, ఆరు నెలలలోపు పచ్చబొట్టు వేయించుకున్నవారు రక్తదానానికి అనర్హులు.

రక్తాన్ని ఎక్కువ రోజులు నిల్వ చేయలేం, కాబట్టి దాన్ని ప్లాస్మా, ఎర్ర కణాలు, ప్లేట్‌లెట్స్‌గా విడగొట్టి నిల్వ చేస్తారు. మన దేశంలో కొన్ని రక్త సమూహాలు (ఓ–పాజిటివ్ 35%, ఎ–పాజిటివ్ 30%) సాధారణం, మరికొన్ని (ఎబి–నెగిటివ్ 1%, బి–నెగిటివ్ 2%) అరుదు. గోల్డెన్ బ్లడ్ ప్రపంచంలో అత్యంత అరుదు, 50 మంది కంటే తక్కువ వ్యక్తులకు, 9 మంది దాతలకు మాత్రమే ఉంది. బాంబే బ్లడ్ గ్రూప్ కూడా అరుదు. రక్తదాతల సంఖ్య తగ్గుతోంది, జనాభాలో 5% మంది మాత్రమే రక్తదానం చేస్తున్నారు. వృద్ధ జనాభా పెరుగుతుండటంతో రక్త కొరత భవిష్యత్తులో తీవ్రమయ్యే అవకాశం ఉంది.

రక్తదానం ఎదుటివారి ప్రాణాలను కాపాడడమే కాక, దాతకు ఆరోగ్య ప్రయోజనాలు అందిస్తుంది. కొత్త రక్త కణాలు ఉత్పత్తి అవడం వల్ల శక్తి పెరుగుతుంది, గుండె ఆరోగ్యం మెరుగవుతుంది, కాలేయం, ఊపిరితిత్తులు, ప్రేగుల క్యాన్సర్ ప్రమాదం తగ్గుతుంది. పైన పేర్కొన్నవన్నీ కాకుండా, ఎందరో ప్రాణాలను కాపాడిన మానసిక సంతృప్తి దాతకు లభిస్తుంది.

రక్తదానం చేయాలనుకుంటే, దగ్గరలోని రెడ్ క్రాస్ రక్తనిధి, ప్రభుత్వ ఆసుపత్రులు, రక్తదాన శిబిరాలను సందర్శించవచ్చు. యువత, విద్యార్థులు రక్తదానంలో చురుకుగా పాల్గొనాలి. సెలబ్రిటీలు, నాయకులు తమ అభిమానులను రక్తదానానికి ప్రోత్సహించాలి. బహుళ రక్తదాతలను సన్మానించడం, సామాజిక మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించడం, పాఠశాలల్లో రక్తదాన ప్రాముఖ్యతను చేర్చడం వంటివి అవసరం. రక్తదాన శిబిరాలను నిర్వహించి, అవసరమైనవారికి సురక్షిత, నాణ్యమైన రక్తం అందేలా చూడాలి. రక్తదానం ప్రాణదానంతో సమానం. ఇది ఒకరి జీవితాన్ని కాపాడడమే కాక, సమాజంలో సానుకూల మార్పు తెస్తుంది. అపోహలను వీడి, అవగాహనతో ముందుకొచ్చి, రక్తదానంలో పాల్గొని, ఇతరులకు స్ఫూర్తిగా నిలుద్దాం. అందరం కలిసి రక్త కొరతను అధిగమించి, ప్రతి అవసరమైన వ్యక్తికి సమయానికి రక్తం అందే సమాజాన్ని నిర్మిద్దాం. రక్తదానంయమానవత్వానికి మహత్తర ఆహ్వానం!



### ఇక్కడా విప్లవమే

శ్రీశ్రీ 'మహాప్రస్థాన'కవి
ప్రజా విప్లవమే కాదు!
సినీ గీతాల్లో కూడా
విప్లవం పండించాడు!

సినీ గేయ రచయిత గా
ప్రథమ జాతీయ అవార్డు
శ్రీశ్రీ కే సొంతం కదా!
తెలుగుకవివీరా!జోహార్!

కలకాదు జీవితం
విలువైనదన్నావు!
నిరాశా వాదుల కన్నీరు
తుడిచిన ఆశా గీతం!

నిన్ను నిన్నుగా ప్రేమించే
ప్రేమ ఔన్నత్యాన్ని ఎంతో
సరళంగా చెప్పిన నిస్వార్థ
ప్రేమామృత కలం నీది!

వాగ్దానం చిత్రంలో నీ
హరికథా కాలక్షేపం ఆ
సందర్భానికి యుక్తం!
ఒక కలికి తురాయి!

జాబిల్లి కళలను
వెండిదారాలు అల్లిన
నీఊహా చాంపేయమాల
నభూతో నభవిష్యతి!

మానవుడే మహనీయుడు
అంటూ సినీగీతంలో కూడా
మానవ శక్తిని మించిన శక్తి
లేదనే సందేశమిచ్చావు!

నీ కలల లో కవ్వించే
కమ్యూనిస్ట్ చెలిని
మా హృదయంలోకి
పంపిన చాతుర్యం నీది!

స్వాతంత్రం వచ్చిందని
సంబరపడొద్దన్నావు!
పదిహేనేళ్ళకే మమ్మల్ని
గట్టిగాహెచ్చరించావు!

నేడు అదే నిజమైంది!
మత ద్వేషాలతో దేశం
ఇప్పుడు మండిపోతోంది!
గొప్పభవిష్యత్ దృష్టి నీది!

మహాకవీ శ్రీ శ్రీ నువ్వొక
కవితా విపంచివి -నీ
విప్లవభావాలు రాగయుక్త
సినీగీతాలు!లాల్ సలామ్!
(సినీగేయ రచయితగా శ్రీశ్రీ)


**-తమ్మినేని అక్కిరాజు**
హైదరాబాద్

# శూన్యం

మనిషి జీవితంలో చివరికి మిగిలేది ఏమిటి? అనే ప్రశ్నకు సమాధానం 'శూన్యం'. శూన్యం అంటే ఏమీ లేదని అర్థం. మనిషి మరణానంతరం ఏం జరుగుతుందో ఎవరికీ ఏమీ తెలియదు. చివరకు మిగిలేది ఏమీ లేదని తెలిసినా, మనిషికి డబ్బు కోసం ఎందుకింత వెంపర్లాట? పోయేటప్పుడు తనతో ఎవరూ రారని తెలిసినా "నా వాళ్లు" అంటూ ఎందుకింత ఆరాటం? చితిమంటల కొలిమిలో తాను దహనమవుతున్నప్పుడు చుట్టూ ఏడుస్తున్న వారి రోదనలు కూడా వినిపించవని తెలిసిన మనిషికి ఎందుకింత గర్వం అనే ప్రశ్నలకు సమాధానం చెప్పడం కష్టం. మనిషి మరణానంతరం చివరికి మిగిలేది ఏమిటి అనే ప్రశ్నకు సమాధానం చెప్పడం కష్టమే కానీ 'శూన్యం' అని చెప్పడం మాత్రం సులభం. ఈ విషయం అర్థం కావాలంటే, ఫిజిక్స్ అరుణ్ కుమార్ రాసిన కవితా సంపుటి "శూన్యం" తప్పక చదవాల్సిందే.

ఫిజిక్స్ అరుణ్ కుమార్ రచించిన "శూన్యం" కవితా సంపుటిలో మొత్తం 58 కవితలు కొలువుదీరగా అందులోని ప్రతి కవిత సామాన్య పాఠకులకు అనురక్తి కలిగించే విధంగా వ్రాయబడ్డాయి. ప్రతి కవితను పరిశీలించగా, అందులో ఒక్కో కవితను ఆయన రాసిన తీరు, మృదుమధురమైన పదప్రయోగం వర్ణనాతీతం అనిపిస్తుంది. పాఠకులను మంత్రముగ్ధులను చేసే సైన్స్ పదాలతో కవితలు రాయడమంటే అది ఫిజిక్స్ అరుణ్ కుమార్ కు మాత్రమే సాధ్యం అనే భావన ఏర్పడుతుంది.

ఆయన వెలువరించిన "చరితకు నువ్వే ఓ ట్యాగ్ లైన్" కవిత ద్వారా నేటి యువతకు అమూల్యమైన సందేశాన్ని అందించారు. స్థాయీబేధం లేకుండా ఏ పోటీలో అయినా 'గెలుపు' మరియు 'ఓటమి' అనే రెండు పార్శ్వాలు ఉంటాయి. "గెలుపుతో పొంగి పోకు ఓటమితో కృంగిపోకు, రేపొకటుందని మరువకు" అనే నానుడిలా విజయం సాధించాలంటే అందుకు 'సాధన' ఎంతో అవసరం. లక్ష్యం చేరుకోవాలంటే నిరంతర తపస్సులా సాధన చేస్తే గానీ విజయం సాధించలేము. నిరంతర సాధన చేసిన వారికి మాత్రమే విజయం స్వాగతం పలుకుతుంది. సాధనకు పూనుకున్నప్పుడు ఎన్నో అవరోధాలు, ఆటంకాలు, దిగలాగే ప్రయత్నాలు ఎదురవుతాయి. "ఎన్ని ఆటంకాలు ఎదురైనా లక్ష్యం మీద స్పష్టత, ప్రయత్నంలో అకుంఠిత దీక్ష అనునిత్య సాధనే విజయానికి బాట వేస్తుందని, నీ గమ్యం చేరేవరకు ప్రయాణించు.. నువ్వే భవిష్యత్తు తరాలకు ఓ భానుడివి" అంటాడు రచయిత అరుణ్.




"నానమ్మ పెంచిన ప్రాణాలే" కవితను పరిశీలించగా, ప్రతి పాఠకుడు చిన్ననాటి మధుర స్మృతులను గుర్తు చేసుకునే విధంగా, తన బాల్యాన్ని మన కళ్ళ ముందు ఆవిష్కరించాడు.

"నా బాల్యపు స్మృతులను నా బ్రెయిన్ మెమోరీ కార్డులో వెతకగా అసూయ, కోపం, స్వార్థం లేని పసిప్రాయం ఎంత బాగుందో.." అంటాడు.. నిజానికి అరుణ్ చెప్పిన మాట అక్షర సత్యమే కదా!. కోపం, స్వార్థం లేని చిన్ననాటి జ్ఞాపకాలతో మైమరిచిపోనివారు ఎవరుంటారు. పసిప్రాయంలో చేసిన చిలిపి పనులు గుర్తుచేసుకొని నవ్వుకోని వారు ఎవరుంటారు, ఎవరికైనా బాల్యం గొప్పదే. అంతేకాదు చంటి పిల్లలు అన్నం తినేందుకు మారాం చేస్తే "చందమామ రావే, జాబిల్లి రావే" అంటూ అమ్మ చందమామను చూపించగానే కడుపు నిండా భోజనం చేసినట్లు, చందమామ పాట ఎంతమధురమో! "ఆకాశంలో నక్షత్రాలను చూపిస్తూ.. మా తాత చెప్పిన కథ కూడా అంత మధురంగా ఉందని అంటాడు అరుణ్.

"ప్రయివేటు టీచర్" కవితను పరిశీలించగా గురువు గొప్పతనం గురించి చాలామంది కవులు రాశారు కానీ గురువు ఆవేదనను అర్థం చేసుకొనేలా, అందరినీ ఆకట్టుకునేలా కవిత్వం రూపంలో రాసిన ఏకైక కవి ఫిజిక్స్ అరుణ్ కుమార్ అనే చెప్పాలి. గురువు గొప్పతనం గురించి మేధావులంతా గురువంటే దేశ నిర్మాణానికి గుండెకాయ అని.. జాతీయ జెండా మతసామరస్యానికి ప్రాణం పోసే తరువే గురువని పొగుడుతున్నప్పుడు గురువు పొందే ఆనందం మాటల్లో చెప్పలేనిది. అజ్ఞానంపై అక్షర సమరం చేస్తున్న గురువులను ప్రయివేటు టీచర్, ప్రభుత్వ టీచర్ అని రెండు పాయలుగా చీల్చడమే కాకుండా వారి జీతభత్యాలలో అత్యధిక వ్యత్యాసం ఉండటమనేది చాల బాధాకరమైన విషయాన్ని కవిత రూపంలో ఎంతో అద్భుతంగా పాఠకుడికి రసానందం కలిగే విధంగా మృదుమధురంగా "ప్రయివేటు టీచర్" కవితకు అక్షర రూపం కల్పించారు. అంతేకాకుండా కరోనా వైరస్ కాలంపై చేసిన సంతకపు దాడిలో ప్రయివేటు పంతులు బ్రతకడానికి బ్రతుకుపై గెలవడానికి కూరగాయలు అమ్ముతూ, రియల్ స్టేట్ ఎంప్లాయ్ గా ఇలా ఎన్నో పాత్రల చాటున ప్రయివేటు టీచర్ చాలీచాలని జీతంతో బతుకు పోరాటంలో పోరాడుతున్న తీరును ఎంతో చక్కగా వర్ణించారు. అయినా సరే విద్యార్థులకు మాత్రం ఆశయ పాఠాలు చెబుతూ మీరంతా కలాం గారిలా ఎదగండి అని వారి భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారని ప్రయివేటు టీచర్ కు జరుగుతున్న అన్యాయంపై కవిత్వంతో పోరాటం చేస్తున్న కవి అరుణ్ కుమార్. వీరి పోరాటం ఫలించి ప్రయివేటు టీచరులందరికి న్యాయం జరుగుతుందని ఆశిద్దాం.

"అమ్మ జాతీయ జెండాను ముద్దాడింది" కవిత సంపుటిని పరిశీలించగా దేశ రక్షణ కొరకు సైనికుడిగా వెళ్తూ తిరిగి వస్తానని చెప్పి వెళ్లిన కన్న కొడుకు కొన్నాళ్ల తరువాత ఓ మూటలో ఒక మాంసపు ముద్దై వస్తే వారి తల్లిదండ్రులు పడే ఆవేదన ని వర్ణించడం ఎవరికి సాధ్యపడదన్న విషయం మాత్రం నిజం. కానీ అరుణ్ రాసిన కవిత చదివితే తల్లి మనోవేదన పాఠకుడికి కొంతైనా అర్థం అవుతుంది. తిరిగి వస్తానని చెప్పి తల్లికి ఇచ్చిన మాట తప్పడమే కాకుండా తండ్రి దున్నే పొలంలో మట్టై మిగిలాడన్న వేదనలో కూడా ఆ తల్లి నా కొడుకు దేశం కోసం ప్రాణాలర్పించిన మరో భగత్ సింగ్ అంటూ రోదిస్తున్న ఆ తల్లి కళ్ళలో వెలుగునే చూస్తున్నారు జనం అంటాడు అరుణ్. దేశం కోసం వీరమరణం పొందిన జవాన్ ను కడసారి చూసేందుకు వచ్చిన జనాన్ని, వారు చేసే నినాదాలను చూస్తూ యావత్ దేశం కన్నతల్లి కన్నీటి వేదన చూసి గుండె చెరువవుతుంది. మట్టై మిగిలిన వీరుడు, ఓ మొక్కై మొలిచి ధీరుడిగా ఆ మొక్క దేశం కోసం ఓ యోధుడిలా ప్రకాశించమని, ప్రాణాలివ్వమని చెబుతుంది. అది అర్థం చేసుకున్న కన్నతల్లి మరోసారి జాతీయ జెండాను ముద్దాడింది అని ఈ కవిత సారాంశం. దేశ భద్రత కోసం బలైన సైనికుడా నీ త్యాగం మరువలేనిది. ప్రతి పాఠకుడు ఈ కవిత చదివిన తర్వాత సెల్యూట్ చేయాల్సిందే. అంత అద్భుతంగా వర్ణించాడు అరుణ్.

ఫిజిక్స్ అరుణ్ కుమార్ రాసిన 58 కవితల్లో ప్రతి కవిత దేనికది ప్రత్యేకమే. ప్రతి కవితను పాఠకుడు చివరిదాకా చదివి ఆనందించడంతో పాటు మధురానుభూతి చెందుతాడు. ప్రతి కవితలో చమత్కారమైన పద విన్యాసంతో పాఠకుడిని ఆకర్షించే నవరసాలు చొప్పించడం అరుణ్ కుమార్ రచనా నైపుణ్యానికి కలికితు రాయిగా నిలుస్తాయి. సమాజాభివృద్ధికి ఉపయోగపడే మరిన్ని కవితలు అరుణ్ కుమార్ కలం నుండి జాలువారాలని ఒక పాఠకుడిగా నా ప్రగాఢ ఆకాంక్ష.



**కోట దామోదర్**
మొబైల్: 9391480475

## సేవాలాల్ మహారాజ్ ఆలయంలో మహా చండీ హోమం



**నిజాంపేట్, జూన్ 15 (జనం సాక్షి) :** నిజాంపేట్ మండలంలోని బల్కంచెల్కతాండ గ్రామపంచాయతీ పరిధిలో శ్రీ విశ్వ పాలిని జ్వాలాముఖి శ్రీ సేవాలాల్ మారాజ్ మహా ఆలయంలో చండీ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి పాలాభిషేకం, మంగళ హారతి, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాల అందజేశారు. చండీ హోమంలో ప్రతి నెల రెండో శనివారం రోజున జరుగుతుంది దీని ప్రత్యేకత ప్రతి ఒక్కరు కూడా తాండ ప్రజలే కాకుండా ప్రతి ఒక్కరు పాల్గొనాలని భక్తులను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వాస్తు జ్యోతిష్య పండితులు బ్రహ్మశ్రీ చంద్రమౌళిశ్వర శర్మ, ఆలయ అర్చకులు మనోజ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఓటరుకు విలువనిస్తా..

- మౌలిక సదుపాయాలే అభివృద్ధికి ఆధారం
- వాటిని అందించడమే మా లక్ష్యం
- కొప్పుల నర్సింహ్మా రెడ్డి

**హయత్‌నగర్, జూన్ 15 (జనం సాక్షి) :** మన్సూరాబాద్ డివిజన్ హయత్ నగర్ ప్రాంతంలోని వివిధ కాలనీ లో సి సి రోడ్డు, భూగర్భ డ్రైనేజీ పనులు పవనగిరి కాలనీ ఫేస్ -2 లో సి.సి రోడ్డు వ్యయం 36.00 లక్షలు, పవనగిరి కాలనీ ఫేస్-1 లో సి.సి రోడ్డు వ్యయం 13.00 లక్షలు, ఆదిత్య నగర్ కాలనీ లో సి.సి రోడ్డు వ్యయం 23.00 లక్షలు, రాజరాజేశ్వరి కాలనీలో భూగర్భ డ్రైనేజీ వ్యయం 3.00 లక్షలతో కూడిన పనుల ను జిహెచ్‌ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి, కాలనీల సంక్షేమ సభ్యుల తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దిన దిన అభివృద్ధి చెందుతున్న కాలనీలకు కనీస మౌలిక సదుపాయాలను ఎలక్షన్‌లో ఇచ్చిన హామీల ప్రకారంగా ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నందుకు సంతోషంగా ఉందని వారు అన్నారు. జిహెచ్‌ఎంసి నుంచి వస్తున్న నిధులకు సంబంధించి స్వయంగా జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ చెప్పిన సమస్య వద్దకు వచ్చి సమస్య లను పర్యవేక్షించి తక్షణమే నిధులు మంజూరు చేస్తూ సహకారం అందిస్తున్నందుకు వారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. కాలనీ వాసులు జిహెచ్‌ఎంసి కౌన్సిల్లో అధికారు లతో ప్రత్యేక సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేసి మా కాలనీలు అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళు తున్నందుకు కాలనీ సంక్షేమ సభ్యులు కార్పొరేటర్ కి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. కాలనీల లో స్ట్రీట్ లైట్లు, ప్రధాన ప్రాంగణాల వద్ద హైమాస్ట్ లైట్లు, విద్యుత్ స్తంభాలు, సి.సి రోడ్డులు, భూగర్భ డ్రైనేజీ కొరకు అర్జీ పెట్టడం జరిగిందని త్వరలో దశల వారీగా కృషి చేస్తానని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు కృష్ణ గౌడ్,



మురళీధర్ రెడ్డి, సాయిలు గౌడ్, సిహెచ్ నరసింహ, కె నరసింహ, వేణుగోపాల్ రెడ్డి, సిహెచ్ జాన్, కుమార స్వామి, రమణ రెడ్డి, యమ్ వెంకటేష్, రామ్ గోపాల్, సందీప్, కాలనీవాసులు, బిజెపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్‌లో ఘనంగా కిషన్ రెడ్డి జన్మదిన వేడుకలు

- బిజెపి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి

**వికారాబాద్, జూన్ 15 (జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా కేంద్రంలోని మా శారద హాస్పిటల్ సమీపంలో, వికారాబాద్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఒక సాధారణ కార్యకర్తగా మొదలై దేశ రాజకీయాల్లో అత్యున్నత స్థాయికి ఎదిగిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి. ఏపదవి చేపట్టినా వాటికి వన్నె తీసుకొచేలా పని చేస్తున్నారని. ఎమ్మెల్యేగా, ఎంపీగా, కేంద్రమంత్రిగా ప్రజలకు సేవలందించిన కిషన్ రెడ్డి దేశ రాజకీయాల్లో తెలుగువారి ప్రతిభను చాటి చెప్పారన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి నిర్వర్తించడమే గాక ప్రస్తుత క్యాబినెట్‌లో కూడా సాంస్కృతిక, పర్యాటక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖా మంత్రిగా సేవలందిస్తున్నరని ఆయన జనందినం సందర్భంగా గుర్తుచేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు



సదానందరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ వడ్ల నందు, బిజెపి సీనియర్ నాయకులు సుధాకర్ ఆచారి, మోహన్ రెడ్డి, రాములు, వికారాబాద్ పట్టణ నూతన కమిటీ, వికారాబాద్ మండల అధ్యక్షులు శివరాజ్ గౌడ్, బిజెపి సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వృత్తిదారులకు పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిలు చెల్లించాలి

**బోడుప్పల్, జూన్ 15 (జనంసాక్షి) :** గత ప్రభుత్వం రాష్ట్రంలోని రజకులకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తే నేడు కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో ఉన్ సర్కారు గత పదిహేను నెలలుగా బకాయిలు చెల్లించడం లేదని అందుకే ఈ నెల 17 న నగరంలోని ఇందిరా పార్కు వద్ద ధర్నా నిర్వహిస్తన్నామి రజక వృత్తి దారుల సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం నాడు మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం చెంగిచెర్ల లో ధర్నాకు సంబంధించిన కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా రజక వృత్తి దారుల సంఘం మేడ్చల్ జిల్లా గౌరవ అధ్యక్షులు అంబే చక్రపాణి మాట్లాడుతూ కులవృత్తులను అర్థికంగా అందుకునేందుకు గాను గత ప్రభుత్వం రజక వృత్తి దారులకు ఉచిత విద్యుత్ అందించారని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గత పదిహేను నెలల నుండి విద్యుత్ చార్జీలు చెల్లించడం లేదని దాంతో విద్యుత్ అధికారులు వృత్తిదారులపై వత్తిడి తెస్తున్నారని కొన్ని చోట్ల బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. రజకుల సమస్యలపై ఈ నెల 17న ఇందిరా పార్క్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని ధర్నాకు రజకులు



అధిక సంఖ్యలో పాల్గొని తమ నిరసన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చెంగిచెర్ల అధ్యక్షుడు అంబే శ్రీనివాస్,చెంగిచెర్ల కార్యదర్శి, అంబే కృష్ణ,ఎ నరసింహ, యాదయ్య, మల్లేష్, చందర్, రమేష్, నవీన్ కుమార్, కోశాధికారి మహేష్,రాజు, రమేష్, లక్ష్మి ,పద్మ, స్నేహ, నాగరాణి ,గోకుల్ ,కవిత ,నాగమణి,పల్లవి, ప్రేమలత, తదితరులు పాల్గొన్నారు.

## ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరుపుకోవాలి



**వెల్దండ, జూన్ 15 (జనంసాక్షి) :** వచ్చే నెల 7న ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఈ రోజు వెల్దండ మండలం కేంద్రంలో విలేకరుల సమావేశం లో ఎంఆర్‌పీఎస్ మండల ఇంచార్జి గుడిగానిపల్లి రాజు మాదిగ గారు మాట్లాడు 30 యేండ్ల పోరాటం మాదిగ మరియు ఉపకులాల అఖంక్ష నెరవేరిన సందర్భంగా మన పోరాటానికి అన్ని వర్గాల ప్రజలు అండ దండలు అందించిన వారిని గుర్తించి వారిని గౌరవించుకోవాలని, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వ సహాయ సహకారాన్ని గుర్తించాలని, మన పోరాటంలో మాదిగ మరియు ఉపకులాలు వారి జీవిత త్యాగం, ప్రాణాల త్యాగం ఆవిర్భావ దినోత్సవ రోజున గౌరవించుకోవాలని అందుకు ఈ రోజు నుంచే ప్రతి మాదిగ పల్లెల్లో మన మాదిగ జాతిని చైతన్యం చేయాలని గుర్తు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో%వీ=ూా% మండల నాయకులు కొప్పు గెలువయ్య మాదిగ, చొక్కనపెల్లి పల్లి పెద్దయ్య మాదిగ, కొమ్ము లింగం మాదిగ, కృష్ణ మాదిగ,జోగు కిరణ్ మాదిగ, సత్యం మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే మోడీ లక్ష్యం

- బిజెపి అమ్మకు వందనం మండల ఇంచార్జ్ కర్రెడ్ల నరేందర్ రెడ్డి

**కేశంపేట, జూన్ 15 (జనం సాక్షి) :** దేశంలో ఉన్న నిరుపేదల సంక్షేమమే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ లక్ష్యమని అమ్మకు వందనం మండల ఇన్చార్జ్, సంతాపూర్ గ్రామ బిజెపి యువనేత కర్రెడ్ల నరేందర్ రెడ్డి అన్నారు. గ్రామంలో రేషన్ దుకాణంలో మూడు నెలల రేషన్ బియ్యాన్ని వినియోగదారులకు పంపిణీ చేసే కార్యక్రమంలో నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఉన్న అణగారిన వర్గాల ప్రజల అభివృద్ధి కోసం మోడీ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. వర్షాకాలం సమయంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా రేషన్ షాపుల్లో మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి అందించడం జరుగుతుందన్నారు. కేంద్ర



ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో నిరుపేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. భారతీయ జనతా పార్టీ దేశంలో అత్యుత్తమ పాలనా అందిస్తుందని నరేందర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, శ్రీను, దశరథ, శ్రీశైలం పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య



**వికారాబాద్, జూన్ 15 (జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం నాడు జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్యతో సమావేశం కావడం జరిగింది. ఈసందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లు అమలు చేశాకే తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీలపరంగా రిజర్వేషన్ ఇస్తామంటే బీసీలను మోసగించడమేనని అన్నారు, పార్టీలపరంగానే రిజర్వేషన్ ఇస్తామని చెప్పడం ఎన్నో రోజులుగా జరుగుతున్న తంతు సరికాదన్నారు, కాదని ఎన్నికలకు వెళితే బీసీ సమాజం ఒప్పుకునే ప్రసక్తే లేదన్నారు, ఈ కార్యక్రమంలో బీసీ ఫ్రంట్ చైర్మన్ గొరిగి మల్లేష్ యాదవ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి రవి యాదవ్, వికారాబాద్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సాయిలు, వికారాబాద్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హెల్త్ క్యాంపులు నిర్వహించడం అభినందనీయం



**రాజేంద్రనగర్, జూన్ 15 (జనం సాక్షి) :** వైద్యం ఖర్చుతో కూడుకున్న నేటి జీవితంలో ఉచిత హెల్త్ క్యాంపులు నిర్వహించడం హర్షించదగ్గ విషయమని మణికొండ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్ పేర్కొన్నారు. ఆదివారం అంజలి గార్డెన్స్ అసోసియేషన్ అధ్వర్యంలో ఏరెటు హాస్పిటల్స్ వాళ్ళు హెల్త్ క్యాంపు కార్యక్రమనికి ముఖ్య అతిధి గా ఆయన హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ నిరుపేదలు ఈ ఉచిత వైద్యం న సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు జితేందర్, మాజీ కౌన్సిలర్లు పురుషోత్తం, తాజుద్దీన్ ,హనుమంత్ కుమార్, రత్నవల్లి పాల్గొన్నారు.

## అమ్మవారికి బోనం సమర్పించిన మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి

**చిన్న శంకరంపేట, జూన్ 15 (జనం సాక్షి) :** మండలంలోని అంబాజీపేట వెంకట్రావుపల్లి రుద్రారం గ్రామాలలో పోచమ్మ తల్లి ఉత్సవాలలో మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి బోనం ఎత్తుకున్నారు అంబాజీపేట లో నిర్వహించిన ఉత్సవాలలో గ్రామస్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి అమ్మవారికి బోనం సమర్పించారు ప్రత్యేక పూజలు నిర్వహించారు ఇట్టి కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యులు పట్లూరి మాధవి రాజు మాజీ సర్పంచులు బి ఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# అక్రమ కేసులను రద్దు చేయాలి

- రాజేంద్రనగర్ డిసిపి కార్యాలయం ఎదుట ధర్నా, వినతి పత్రం అందజేత

**రాజేంద్రనగర్, జూన్ 15 (జనం సాక్షి) :** బక్రీద్ మరుసటి రోజున ఆవులను తరలిస్తున్న డీసీఎంలను అడ్డుకున్న భాజపా నాయకుల పై అక్రమ అరెస్టులు కేసులను రద్దు చేయాలని విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్, గోరక్ష, ఆర్ఎస్ఎస్, భాజపాల ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ డిసిపి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఏసిపి శ్రీనివాస్ ద్వారా డిసిపికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బక్రీద్ మరుసటి రోజు మైలార్దేవపల్లి డివిజన్ లక్ష్మిగూడ ప్రాంతంలో బక్రీద్ మరుసటి రోజైన ఆదివారం రాత్రి కళేబరాలను తరలిస్తున్న డీసీఎం లారీలను అడ్డుకున్న సంఘటన అత్తాపూర్ డివిజన్లోని పాండురంగ నగర్ లో ఆవులను వధించడానికి తీసుకెళ్తుండగా అడ్డుకున్న హిందు యువకుల అక్రమ అరెస్టులను ఎత్తివేసి కేసులను రద్దు చేయాలని పలు సెక్షన్లను మార్చాలని ఇకపై అక్రమ అరెస్టులను ఆపాలన్నారు. అలాగే అక్రమంగా చట్ట వ్యతిరేకంగా జంతు కళేబరాలను తరలిస్తున్నటువంటి డీసీఎం యజమానులపై, వాటి నిర్వాహకులపైన కేసులు పెట్టాలన్నారు. పోలీసులు ఒక వర్గంపై మాత్రమే కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు రమేష్ బాబు, గోరక్ష ప్రముక్ విశాల్



ప్రసాద్, విశాల్ సునాకర్, భానుమూర్తి, దీపక్ యాదవ్, ముకేష్ యాదవ్, సేన రాహుల్, శ్రీరామ్ యాదవ్, డీజే శ్రీనివాస్, బిజెపి జిల్లా అధ్యక్షులు పంతంగి రాజభూపాల్ గౌడ్, అంజన్ కుమార్ గౌడ్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, వై శ్రీధర్, ఎన్ మల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్, కొమురయ్య, భాగ్యనగర్ జిల్లా కార్యదర్శి నవీన్ యాదవ్, జోగి రవి, డి లక్ష్మీనారాయణ, ఎస్ విజయ్ కుమార్, అడికే రాజు,ఎన్ జగన్, ఎ. జనార్ధన్, హరికిషన్ జి, సోల్కర్ రెడ్డి, సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు ఎస్ వినయ్ రెడ్డి, సందీప్ ముదిరాజ్, సులిగే వెంకటేష్, ఎం.నాగేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలి

**రాజేంద్రనగర్, జూన్ 15 (జనం సాక్షి) :** ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రంగారెడ్డి జిల్లా భాజాపా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్, అసెంబ్లీ కన్వీనర్ ఈ మల్లేష్ యాదవ్‌లు పేర్కొన్నారు. ఆదివారం ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన తలి వందనం చెట్లు నాటే కార్యక్రమం ను రాజేంద్రనగర్ భాజపా డివిజన్ అధ్యక్షులు సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బుద్వేల్ గ్రామంలో తల్లి వందనంలో భాగంగా శ్రీ కృష్ణ దేవాలయం కృష్ణమ్మగుట్ట దగ్గర మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో వీరాశి వ్యాపారాలతో చెట్లను పూర్తిగా నరికి వేస్తూ న్నారని, మన పూర్వీకులు చెట్లు పెట్టడం వల్లనే మనం ఆరోగ్యంగా జీవిస్తున్నామని భావితరాలను దృష్టిలో ఉంచుకొని సకాలంలో వర్షాలు పడాలన్న ఆరోగ్య సమస్యలు రాకుండా ఆక్సిజన్ కావాలన్నా ప్రతి ఒక్కరు తన తల్లి పేరు మీద కనీసం ఒక మొక్క నాటాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కోరని సదానంద్, సత్యనారాయణ ముదిరాజ్, హరి కిషన్ జి,సోల్కర్ రెడ్డి,రాఘవేంద్ర చారి,శత్రజ్ఞ,బాలకృష్ణ,సురేందర్, వెంకటేష్, ప్రకాష్ నాయక్, యాదయ్య, విజయ్ యాదవ్ ,గోపాల్ ముదిరాజ్,సుధాకర్ రెడ్డి ,రాజశేఖర్ రెడ్డి ,మురళి, నాయకులు పాల్గొన్నారు.



### రాజేంద్రనగర్ డివిజన్‌లో..

మైలార్దేవ్పల్లి డివిజన్ అధ్యక్షుడు సూరెడ్డి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన నిర్వహించిన తల్లి వందనం కు ముఖ్యఅతిథిగా ఎస్సీ మోర్చా పార్లమెంట్ కన్వీనర్ జోగు రవి హాజరై మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆడికే రాజు, బొమ్మ రాజ్ నర్సింహా ,రావులు భాస్కర్ , నవత మురళీధర్ రెడ్డి, వల్లూరు శ్రీనివాస్, జి. శ్రవణ్ కుమార్, ఎం ప్రభాకర్, అడికే మహేందర్, బాల శ్రీను యాదవ్, గూడూరు అంజి, శివ శంకర్, పవన్, ఆడికే అభిలాష్ ,కొండల అంకిత్, శిషికాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
16 జూన్ 2025

# విష పురుగులు కాటేసే కాలం..

- అన్నదాతలు జర జాగ్రత్త..
- వానాకాలంలో పొంచి ఉన్న ప్రమాదం..
- విషపురుగులతో ప్రాణాంతకం..
- ముందు జాగ్రత్తలతోనే భద్రం..

**జడ్చర్ల, జూన్ 15 (జనం సాక్షి) :** వానకాలం మొదలవ్వగానే ఖాళీ స్థలాలన్నీ గడ్డి, మొక్కలతో చిత్తడిగా మారి.. నీటి మడుగులు పెరిగి కప్పలు కూడా బయటకు వస్తాయి. ఈ క్రమంలోనే ఆయా ప్రదేశాల్లో విష పురుగులు సంచరిస్తుంటాయి. ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా కాటేసి ప్రాణం మీదకి తెస్తాయి, అందుకే ముఖ్యంగా రైతులు, కూలీలు ఆటవీ ప్రాంతాలకు దగ్గరగా ఉండే వారు, నివాసాల సమీపంలో పొలాలు, పొదలు ఉన్న వారు జాగ్రత్తగా మెద గాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వర్షా కాలంలో ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో పాములు ఎక్కువగా సంచరిస్తుంటాయి. అజాగ్రత్తగా ఉంటే కాటు వేస్తాయి. ఇదే సీజన్ లో రైతులు, కూలీలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై పాము కాటుకు గురయ్యే ప్రమాదాలు అధికంగా ఉంటాయి. పాములు గుడ్లను పొదిగి పిల్లలు చేసే, కప్పలు కూడా బయటకు వచ్చే కాలం ఇదే కాబట్టి వాటిని వేటాడేందుకు పాములు సంచరిస్తుంటాయి. అటవీ ప్రాంతాలు, పొలంగట్లు, పొదల్లో ఎక్కువగా తిరు గాడుతుంటాయి. మన ప్రాంతంలో నాగు పాము, తాచుపాము, కట్ల పాము, రక్తపింజర తదితర విష పూరిత పాములు ఎక్కువగా ఉండగా, వాటి కాటుకు గురైన బాధితులకు వెంటనే వైద్యం అందకపోతే ఒక్కోసారి ప్రాణాలు పోయే ప్రమాదముంది.

పాము ఎప్పుడు కాటేస్తుందంటే:

పొలంగట్లు, కాల్వగట్లు, పశువుల పాకలు, గుబురు ప్రదేశాలు,



పొదలు, గడ్డి వాములు, పాడు బడ్డ ఇళ్లు, పేర్చిన కట్టెలు, పెంట దిబ్బల్లో విషపురు గులు ఎక్కువగా సంచరిస్తుంటాయి. ఆహారం కోసం రాత్రి సమయాల్లో బయటకు వచ్చి ఎలుకలు, బల్లులు, తొండలను పట్టుకొని తింటాయి. ఇలాంటి ప్రాణులు ఎక్కడ ఎక్కువగా సంచరిస్తాయో పాములు కూడా అక్కడే తిష్ట వేస్తాయి. పాములకు చెవులు ఉండనప్పటికీ వాటి శరీరం కింద భాగంలో ఉండే ప్రత్యేక పొలుసులు ద్వారా శబ్ద ప్రకంపనలను గ్రహిస్తాయి. వేడి రక్తం ప్రవహించే జంతువులు, మనుషులు సమీపిస్తే వెంటనే గుర్తించి కాటు వేస్తాయి. సాధారణంగా పంట పొలాల్లో కాల్వల్లో తిరిగే పాములు చాలా వరకు విషపూరితమైనవి కావు పాములకు ప్రాణభయం ఉన్నప్పుడు, ఏకాంతానికి భంగం వాటిల్లినప్పుడు, ఎవరైనా తొక్కినప్పుడు, వేటాడేటప్పుడు మాత్రమే కాటువేస్తాయి.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు :**

రాత్రి సమయంలో పొలాల్లో తిరిగే వాళ్లు అక్కడే నిద్రించే వారు వెంట టార్చిలైటు ఉంచుకోవాలి. ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రం చేసుకోవాలి. పెట్రోల్, కిరోసిన్, వెల్లుల్లి, వాసనలను పాములు భరించలేవు. పాములు ఎక్కువగా ఉండే చోట సమయానుకూలంగా వీటిని ఉపయోగించాలి. రాత్రి సమయంలో పొలాలు, గడ్డివాముల్లో రోజు తిరిగే రైతులు, కూలీలు మోకాళ్ల దాకా రబ్బరు బూట్లు ధరించడం మంచిది. గడ్డిలో పని చేసే వారు చేతికి రబ్బరు తొడుగులు తొడగాలి. ఇళ్లు, కార్యాలయాలు, పాఠశాలల వద్ద పొదలు లేకుండా చూసుకోవాలి.

**పాము కాటు లక్షణాలు :**

పాము కాటు వేసిన ప్రదేశంలో రెండు పోరాల గాయం స్పష్టంగా కనిపించి నొప్పి తీవ్రంగా ఉంటుంది. నొప్పి క్రమంగా పైకి వ్యాపిస్తూ తిమ్మిరిగా అనిపిస్తుంది. పాక్షిక పక్షవాతం కారణంగా నాలుక మందమైనట్లు, గొంతు కండరాలు బిగుసుకున్నట్లు అనిపిస్తాయి. కళ్ళు మగతగా శరీరం మత్తుగా ఉండి స్పృహ కోల్పోతారు.

**ప్రథమ చికిత్స ఇలా :**

పాముకాటుకు గురైన వ్యక్తి ఆందోళన చెందకుండా ఉండాలి. పక్కన ఎవరైన ఉంటే బాధితులకు ధైర్యం చెప్పేందుకు ప్రయత్నించాలి. కాటు వేసిన పైభాగంలో వెంటనే తాడు, గుడ్డ పీలికలతో కొంత శరీరాన్ని రక్తం ఆడకుండా బిగించి కట్టివేయాలి. కాటు వేసిన శరీర భాగంలో పదునైన బ్లేడుతో గాయం చేసి రక్తం కార నివ్వాలి, పాము కాటుకు గురైన వ్యక్తిని నడిపించొద్దు, పరుగుపెట్టించొద్దు, పసర్లు, నాటు మందులు, మాత్రలు అని కాలయాపన చేయకుండా తక్షణమే దగ్గరలోని వైద్య శాలకు తీసుకెళ్లాలి. పాముకాటు బారినపడిన వారికి ప్రభుత్వ దవాఖానాల్లో చికిత్స అందుబాటులో ఉంటుంది. వారికి కావాల్సిన యాంటీ స్నేక్ వీనం ఇంజక్షన్లు అందుబాటులో ఉంటాయి. వెంటనే ప్రథమ చికిత్స అందించి గాయాన్ని బట్టి రెండు సార్లు స్నేక్ వీనం డోస్ తీసుకుంటే ఎలాంటి ప్రమాదం ఉండదు.

## 21న యోగా దినోత్సవాన్ని విజయవంతం చేద్దాం



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, జూన్ 15 (జనం సాక్షి) :** జూన్ 21న జరిగేఅంతర్జాతీయ యోగా దినోత్సవం ను విజయవంతం చేయాలని నారాయణపేట పతంజలి యోగ సమితి, ఆయుష్ డిపార్ట్మెంట్, సేవా భారతి ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో సభ్యులు కోరారు. యోగా దినోత్సవాన్ని ఉమ్మడిగా నిర్వహించాలని జిల్లా వైద్య అధికారి డాక్టర్ జయచంద్ర మోహన్ డాక్టర్ మదన్ మోహన్ రెడ్డి,సేవా భారతి సురేష్ పతంజలి యోగ సమితి కార్యక్రమ వివరాలను తెలియజేశారు. ఈ నెల 20వ తేదీన పాఠశాల కళాశాల విద్యార్థులకునేటి సమాజానికి యోగ ఆవశ్యకత అనే అంశం పైన వ్యాసరచన పోటీ,పట్టణంలో పురవీధుల గుండా యోగ ఆవశ్యకతను తెలియపరుస్తూ పట్టణంలోని విద్యార్థులు పుర ప్రజలు అందరి సహకారంతో యోగవాక్నిర్వహించాలని తీర్మానించారు. 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం అభినందన్ ఫంక్షన్ హాల్ హైదరాబాదు రోడ్డు నారాయణపేట లో నిర్వహించాలని నిర్ణయించా రు.పట్టణ ప్రజలు పెద్ద మొత్తంలో పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో భారత్ స్వాభిమాన్ జిల్లా అధ్యక్షులు రాజేంద్ర లహోటి, శివకు మార్ ల్యాబ్, డాక్టర్ కేతన్ రఘు, నరసింహులు, మల్లికార్జున్, శ్రీనివాస్, చంద్రశేఖర్, దేవానంద్ చారి, రమేష్ రఘు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## కరాటే బెల్టులు, ప్రశంసాపత్రాలు అందజేత



**వెల్దండ, జూన్ 15 (జనంసాక్షి) :** పుట్టిన ఊరుకు సేవ చేయడం అదృష్టంగా భావించాలని వెల్దండ మాజీ ఎంపీపీ పుట్టా రాంరెడ్డి అన్నారు. ఆదివారం వెల్దండ మండల పరిధిలోని కొట్ర గ్రామంలో కరాటే మాస్టర్ నీరటి కుమార్ పర్యవేక్షణలో కరాటే లో 52 మంది శిక్షణ పొందిన విద్యార్థులకు బెల్టుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన మాజీ ఎంపీపీ పుట్టా రాంరెడ్డి విద్యార్థులకు బెల్టులని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. ఆత్మ రక్షణ కోసం కరాటే ఎంతో అవసరం అని అన్నారు కుమార్ మాస్టర్ తన సొంత ఖర్చులతో పురిటి గడ్డ ఋణం తీర్చుకునే దిశగా ఉచితంగా కరాటే నేర్పించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాలస్వామి, మాజీ ఎంపీటీసీ రాములు, మార్షల్ ఆర్ట్స్ కరాటే గౌరవ అధ్యక్షుడు నాగరాజు గౌడ్, బిఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకులు కానుగుల జోగయ్య, గండికోట రాజు, గ్రామస్తులు ఆంజనేయులు,కర్ణాకర్ రావు,రాజు చారి, కృష్ణ, అశోక్,మల్లేష్, శ్రీను విద్యార్థులు పాల్గొన్నారు.

# నేడు రైతు నేస్తం



**మెదక్, జూన్ 15 (జనం సాక్షి) :** రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా ఈ నెల 16వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియం నుంచి వివిధ జిల్లాల రైతులతో ముఖాముఖి మాట్లాడనున్నారు. సోమవారం మధ్యాహ్నం 03 గంటలకు జరగనున్న ఈ ముఖాముఖి కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా గల రైతు వేదికల్లో ప్రత్యక్ష ప్రసారమవుతుంది. ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదివారం క్షేత్రస్థాయిలో హవేలి ఘనపూర్ మండలం రైతు వేదికలో ఏర్పాట్లను పరిశీలించారు. రైతు నేస్తం కార్యక్రమానికి పటిష్ట ఏర్పాటు చేసినట్లు తెలిపారు జిల్లాలో 36 రైతు వేదికలలో కొత్తగా ప్రారంభం అవ్వనున్న దృశ్య శ్రవణ మాధ్యమాలతో పాటుగా.. ఇంతకముందే ప్రారంభమైనటువంటి దృశ్య శ్రవణ మాధ్యమాలు గల21 రైతు వేదికలతో కలిపి మొత్తంగా 57 రైతు వేదికల నందు సీఎం రైతులతో ముచ్చటించనున్నారు. అని వివరించారు.

## మంత్రి శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిసిన జడ్చర్ల నాయకులు



**జడ్చర్ల, జూన్ 15 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడలు, యువజన సర్వీసులు, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని ఆదివారం హైదరాబాద్ ఆయన నివాసంలో జడ్చర్ల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర మంత్రిగా నూతనంగా బాధ్యతలు చేపట్టడంతో మర్యాదపూర్వకంగా మంత్రి శ్రీహరిని కలిసినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఫోరం ఫర్ బెటర్ జడ్చర్ల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ది బాలకృష్ణ, జడ్చర్ల మాజీ సర్పంచ్ బుక్క వెంకటేశం, పోల రవీందర్, బండమీది భరత్ పాల్గొన్నారు.

# మున్సిపాలిటీని కైవసం చేసుకోవాలి

- రఘురామయ్య గౌడ్



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, జూన్ 15 (జనం సాక్షి) :** వచ్చే ఎన్నికల్లో నారాయణపేట మున్సిపాలిటీలో బిజెపి జెండా ఎగురవేసి కైవసం చేసుకోవాలని అందుకోసం బిజెపి నూతన కార్యవర్గం పటిష్టం గా పని చేయాలని బిజెప్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి రఘు రామయ్య గౌడ్ జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ నందు నామాజీ పిలుపు నిచ్చారు.ఆదివారం భారతీయ జనతా పార్టీ నారాయణపేట పట్టణ అధ్యక్షులు పోషల్ వినోద్ పట్టణ కమిటీని 11గురు సభ్యులు, 40 మంది కార్యవర్గసభ్యులతో జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి రఘురామయ్య గౌడ్, లీగల్ సెల్ కన్వీనర్ నందు నామాజీ సమక్షంలో ప్రకటించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పాలక వర్గం వైఫల్యాలను,రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని అన్నారు.పట్టణాల అభివృద్ధి కేంద్ర ప్రభుత్వం నిధులతోనే జరుగుతున్నాయని అన్నారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళి ప్రజలకు చేరువ కావాలని కోరారు.

**పట్టణ బిజెపి కార్యవర్గం..**

నారాయణపేట పట్టణ బిజెపి కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శులుగా వడ్డె దత్తు, నక్క సత్యనారాయణ ఉపాధ్యక్షులుగా పరిగి శ్రీనివాసరెడ్డి, సిద్ది విశాలాక్షి వెంకట్ రాములు, హనుమంతరావు చామకూర, చలపతి యాదవ్‌లను, కార్యదర్శులుగా బాబు మేస్త్రి, జయశ్రీ విజయ నవలె, మొగులప్ప యాదవ్, కే. రాఘవేంద్ర పళ్ళ, కోశాధికారిగా కల్పన రఘురామయ్య గౌడ్‌లను ప్రకటించారు. ముఖ్య కమిటీ సభ్యులుగా ఉమాకాంత్, మాలే మల్లేష్, పోలమోల్ల అంజి, నీలి రవి, కురువ శీను, భీమ్ రాజ్, ఉషన్న యాదవ్,అన్వేష్, ఆకుల సత్యనారాయణ, సతీష్ సింగర్ బేస్,రాట్నం శీను, చంద్రశేఖర్ పళ్ళ తదితరులను ఎన్నుకున్నారు.

# సంస్థాగత ప్రసవాలు పెంచేందుకు కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**కొల్చారం, జూన్ 15 (జనం సాక్షి) :** జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో సంస్థాగత ప్రసవాలను పెంచేందుకు వైద్యాధికారులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. ఆదివారం మెదక్ జిల్లా కొల్చారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మికంగా పరిశీలించారు. దవాఖానలో సిబ్బంది స్టాక్ రిజిస్టర్, మందులు నిల్వల రిజిస్టర్, ఓ.పి రిజిస్టర్ను పరిశీలించి. రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో సంస్థాగత, సాధారణ ప్రసవాలు , ఆరోగ్య మహిళా కార్యక్రమం,గురించి ఆరా తీశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖచ్చితంగా డెలివరీల సంఖ్యను పెంచాలన్నారు. రిస్క్ ఉన్న కేసులను జిల్లా ఆసుపత్రి, ఏరియా ఆసుపత్రి లకు పంపాలని చెప్పారు. ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా గుర్తించిన అనుమానిత క్యాన్సర్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వారిని జిల్లా ఆసుపత్రి కి రిఫరల్ చేస్తూ ఖచ్చితంగా పరీక్షలు చేసుకునేలా మానిటర్ చేయాలన్నారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమం తప్పనిసరిగా క్షేత్ర స్థాయిలో చేపట్టాలన్నారు. జ్వర బాధితులకు టెస్ట్ ల సంఖ్యను పెంచాలన్నారు. డెంగ్యూ , మలేరియా, టైఫాయిడ్ కేసుల ను పూర్తిగా అరికట్టేలా ప్లాన్ చేసుకోవాలన్నారు. హై రిస్క్ ప్రాంతాల పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు డ్రైడేను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు ప్రధానంగా నీటి నిల్వ లేకుండా జాగ్రత్త పడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో మదన్మోహన్, సిబ్బంది ప్రవీణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బొల్లారంలో రూ.3.5 కోట్లతో అధునాతన పోలీస్ స్టేషన్

- ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే మల్టీ జోన్-2 ఐజి



**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 15 (జనం సాక్షి) :** రూ.3.5 కోట్ల తో సంగారెడ్డి జిల్లా ఐడిఏ బొల్లారం పోలీసు స్టేషన్ నూతన భవనానికి మెదక్ ఎంపీ రఘునందన్ రావు, పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మల్టీజోన్-2 ఐజి వి.సత్యనారాయణ, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పటాన్చెరు డిఎస్పి ప్రభాకర్‌లు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెటిరో ల్యాబరేటరి సంస్థ డైరెక్టర్ మోహన రెడ్డి రూ. 3.5 కోట్ల వ్యయంతో కార్పొరేట్ కార్యాలయాన్ని తలపించే విధంగా, అధునాతన హంగులతో నూతన పోలీస్ స్టేషన్ భవనాన్ని నిర్మించనున్నట్లు తెలియజేశారు. ఈ నూతన పోలీసు స్టేషన్ భవనం అవుట్ రింగ్ రోడ్డు కు అతి సమీపంలో ఉండటం వలన స్టేషన్ పరిదిలో గల అన్నీ గ్రామాలకు సులువుగా చేరుకోవడానికి అనుకూలంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో హెటిరో ల్యాబరేటరి డైరెక్టర్ మోహన రెడ్డి, బొల్లారం యస్.హెచ్.ఓ రవీందర్ రెడ్డి, సబ్-డివిజన్ ఇన్స్పెక్టర్స్, హెటిరో ల్యాబరేటరి యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

## ఫర్టిలైజర్ షాపులను ఆకస్మిక తనిఖీ

- నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తాం
- రైతులు విత్తనాలు కొనేముందు రసీదులు తప్పనిసరిగా తీసుకోవాలి
- ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



**అచ్చంపేట, జూన్ 15 (జనం సాక్షి) :** పట్టణంలో ఫర్టిలైజర్ షాపులో విత్తనాలను తనిఖీ చేసిన అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ స్టాక్ నిర్వహణ రికార్డులను, ఎరువుల బస్తాల లాట్ నెంబర్లు, సోర్స్ సర్టిఫికేట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ..వ్యాపారులు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు విక్రయిస్తే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులు ప్రభుత్వం ఆమోదం పొందిన షాపుల్లోనే విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు సమయలో రశీదు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే వ్యాపారుల లైసెన్సులు సీజ్ చేస్తామని పేర్కొన్నారు. గ్రామాల్లో రైతుల వద్దకు వెళ్లి నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై గట్టి నిఘా ఉంచామన్నారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే రైతులు, ప్రజలు స్థానిక పోలీసస్టేషన్‌లో, వ్యవసాయ అధికారి కార్యాలయంలో సమాచారం అందించాలన్నారు. సమాచారం తెలియజేసిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్ మాజీ ఎంపీపీ రామనాథం, దర్గా కమిటీ అధ్యక్షులు రఫీ కోఆప్షన్ ఖాదర్ పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు తథ్యం

- చల్లా వంశీచందర్ రెడ్డి

**వెల్దండ, జూన్ 15 (జనంసాక్షి) :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలందరూ గ్రామాలలో గెలుపే లక్ష్యంగా కలిసి కట్టుగా పనిచేసి గెలుపొందాలని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు,మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్ రెడ్డి రెడ్డి ఆదివారం ఆయన నివాసంలో సుధీర్ఘంగా కాంగ్రెస్ పార్టీ క్రియాశీల పాత్ర పోషితున్నా నాయకులతో సమావేశమైన సందర్భంగా ఆయన తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో జరుగుతున్న ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ,అభివృద్ధి పథకాలను గ్రామీణ ప్రాంతాలలో ప్రజల్లోకి తీసుకెళ్ళి కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతానికి కృషి దిశగా ప్రతి ఒక్కరూ పనిచేసి సత్ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా



పనిచేసే నిఖార్సైన ఏ కార్యకర్తను వదులుకోకుండా ప్రభుత్వంలో,పార్టీలలో సముచిత స్థానం దక్కుతుందని ఆయన దిశానిర్దేశం చేశారు. రాబోయే ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా బూత్ స్థాయి నుండి మండల స్థాయిలో హొదాలను మించి కార్యకర్తగా భావించి ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఆయన సూచించారు.కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి నేతృత్వంలో గ్రామ,గ్రామాన ఘనంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. మండలంలో రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి,సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆయన అరా తీశారు. ప్రతిపక్ష బీఆర్ఎస్,బిజెపి పార్టీలు అనాలోచిత,విష ప్రచారం చేస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై విషం కక్కుతున్న విధానాలను ప్రజా వేదికలో,ప్రజల్లోతిప్పికొట్టాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి తక్కళ్ళపల్లి శేఖర్,మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు ముదిగొండ రమేష్,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎర్ర శ్రీను ముదిరాజ్,మండల యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

# ప్రజల బంగారు భవిష్యత్తు కోసం అహర్నిశలు కృషి

- అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు
- విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత
- 419 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ చేసిన మంత్రి
- రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్





**మంచిర్యాల ప్రతినిధి జూన్ 15 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రజలకు బంగారు భవిష్యత్తు అందించేందుకు ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ అన్నారు. ఆదివారం నాడు మంచిర్యాల జిల్లాలోని మందమర్రి మండలం సండ్రన్ పల్లి గ్రామంలోని కెఆర్ గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, మందమర్రి మండల తహసిల్దార్ సతీష్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో సంవత్సరానికి 3 వేల 500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. సొంత ఇంటి స్థలం కలిగి ఉండి అర్హత కలిగిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పథకం క్రింద 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించడంతో పాటు ఉచితంగా ఇసుకను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో నాలుగు సంవత్సరాలలో 15 వేల ఇండ్లు అర్హులైన లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు అర్హులైన నిరుపేదలకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు అందించడం జరుగుతుందని తెలిపారు. ఇంటి స్థలం కలిగి ఉండి ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ది పొందే లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం 600 చదరపు గజముల లోపల ఇల్లు నిర్మించుకోవాలని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలోని సోమనపల్లిలో 200 కోట్ల రూపాయల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. విద్యారంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం 50 వేల ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయడం జరిగిందని తెలిపారు. సంబంధిత అధికారులు తమ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నూతన డైట్ మెనూ ప్రకారం విద్యార్థులకు సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం అందించడంతో పాటు విద్యార్థుల కొరకు సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. వ్యవసాయరంగ అభివృద్ధిలో భాగంగా గతంతో పోలిస్తే 70 శాతం అధికంగా పంట ఉత్పత్తి జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో ఇసుక మాఫియాను అరికట్టేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రత్యేక ఇసుక రీచ్ లను ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం వినియోగదారులకు అందించడం జరుగుతుందని, ఇసుక అక్రమ రవాణా నిరోధించడం జరుగుతుందని తెలిపారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల పరిధిలోని పన్నులను 100 శాతం వసూలు చేసే విధంగా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని, తద్వారా ప్రజా సంక్షేమంలో భాగంగా 6 గ్యారంటీ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు వీలు కలుగుతుందని తెలిపారు.

అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ స్టాఫ్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ప్రతి నియోజకవర్గానికి కేటాయించిన 3 వేల 500 ఇందిరమ్మ ఇండ్లను అర్హత గల నిరుపేద లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తలపెట్టిన భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టంలో భాగంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సంబంధిత సమస్యలపై దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల నుండి 2 వేల 500 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలలో చేరడం సంతోషంగా ఉందని తెలిపారు. విద్యా రంగానికి ప్రాధాన్యతనిస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సౌకర్యార్థం తాగునీరు, విద్యుత్, ఇతర అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యా బోధన అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలలో చదివేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని కస్తూరిబా గాంధీ విద్యాలయాలు అభివృద్ధిలో భాగంగా 2 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, రెసిడెన్షియల్ పాఠశాలల అభివృద్ధికి ఎస్టిపిపి, సిఎస్ఆర్ కింద 6.1 కోట్ల రూపాయలు, అమ్మ పాఠశాల కొరకు 10 కోట్ల రూపాయలతో పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వ వైద్యశాలలను అభివృద్ధి చేయడంలో భాగంగా భీమారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చెన్నూర్ లో బస్తీ దవాఖానా లతో పాటు ఆరోగ్య ఉప కేంద్రాల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రైజింగ్ తెలంగాణ 2047 కార్యక్రమంలో భాగంగా ప్రస్తుతం విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు వర్క్ ఫోర్స్ అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. మందమర్రి మండల కేంద్రంలో ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలతో పాటు అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేసి అధునాతన వృత్తి విద్య కోర్సులను అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి అర్హత గల అభ్యర్థులకు శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.అనంతరం ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా 419 మంది లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారు. రైతు భీమా పథకం క్రింద 6 మంది లబ్ధిదారుల కుటుంబాలకు చెక్కులు అందజేశారు. మండలంలోని సారంగపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొరకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మందమర్రి మండల పరిషత్ అభివృద్ధి అధికారి, సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు .



# నకిలీ విత్తనాలతో నష్టం జరిగితే...

**బెల్లంపల్లి, జూన్ 15, (జనంసాక్షి) :** నాణ్యమైన విత్తనం రైతు హక్కు. ప్రతి పంట సీజన్లో నకిలీ విత్తనాలతో రైతులు మోసపోతూనే ఉన్నారు. విత్తన నాణ్యతలో లోపం వలన కొనుగోలు చేసిన విత్తనం మొలకెత్తకనో, ఆశించిన దిగుబడి రాకనో ఏటా వేలమంది రైతులు నష్టపోతున్నారు. విత్తనాలకు సంబంధించి చట్టాలు ఏమి ఉన్నాయి? నష్ట పరిహారం పొందే మార్గాలు ఉన్నాయా? రైతులు ఏమి చెయ్యాలి? ఈ కథనంలో తెలుసుకుందాం.

అభివృద్ధి చేసిన విత్తనాలు, మొలకల చట్టం 1951, విత్తనాల చట్టం 1966, కొత్త వంగడాల రక్షణ %ಡ% రైతు హక్కుల చట్టం 2001, పత్తి విత్తనాల చట్టం 2007ప్రకారం నాణ్యత లేని విత్తనాలతో నష్టం జరిగితే నష్టపరిహారం పొందే మార్గాలున్నాయి.

వినియోగదారుల చట్టం క్రింద జిల్లా వినియోగదారుల ఫోరమ్ లో కేసు వెయ్యవచ్చు. సివిల్ కోర్టులో కేసు దాఖలు చెయ్యవచ్చు. పత్తి విత్తనాల చట్టం క్రింద రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆశ్రయించవచ్చు. రిజిస్టర్ అయినా కొత్త వంగడాలలో నాణ్యతా లోపం అయితే రైతు హక్కుల చట్టం క్రింద కేంద్ర ప్రభుత్వాన్ని ఆశ్రయించవచ్చు. విత్తనాల కోసం చెల్లించిన ధర, సాగు ఖర్చు, తగ్గిన దిగుబడి విలువ, కలిగిన మానసిక క్షోభకు పరిహారం పొందవచ్చు.

**నష్టపరిహారం పొందాలంటే ..**

విత్తనాలు కొన్నపుడు రసీదు తప్పక తీసుకోవాలి. విత్తనాలు ఉంచిన డబ్బా / సంచి దాచి ఉంచాలి. విత్తనాల గురించి సమాచారం తెలుపుతు ఇచ్చిన కాగితాలను దాచి ఉంచాలి. వీలైతే కొన్ని విత్తనాలను కూడా భద్రపరచాలి. పంట నష్టం జరిగిన వెంటనే వ్యవసాయ అధికారికి, సంబంధిత డీలర్ /కంపెనీ ప్రతినిధికి తెలియజేయాలి. నష్ట పరిహారం కోసం కేసు వెయ్యాలి / దరఖాస్తు పెట్టాలి.



# రేపు భూపాలపల్లికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాక..

- సబ్ స్టేషన్ ల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు..
- భారీ బైక్ ర్యాలీతో స్వాగతం పలుకనున్న నేతలు..
- కార్యక్రమాలను విజయవంతం చేయాలి : ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు..

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి నియోజకవర్గానికి ఈ నెల 17 న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క రానున్నారని, పర్యటనను విజయవంతం చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు. ఆదివారం భూపాలపల్లి మంజూరునగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మంగళవారం రోజున ఉదయం పది గంటలకు నియోజకవర్గంలోని గోరికొత్తపల్లి మండలం చెన్నాపూర్ గ్రామ శివారులో రూ.2కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం మంజూరునగర్ 8 ఇంక్లైన్ రోడ్డులో చర్చి ఎదురుగా ఉన్నటువంటి మైదానంలో మంజూరునగర్(భూపాలపల్లి), ధర్మరావుపేట(గణపురం మండలం), నవాబుపేట(చిట్యాల మండలం) గ్రామాల్లో నూతనంగా నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం గణపురం మండలం చెల్పూర్ గ్రామంలోని జెన్కో లో సింగరేణి, జెన్కో అధికారులతో వేరువేరుగా నిర్వహించే సమీక్షా సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. అంతకుముందు భూపాలపల్లి నియోజకవర్గంలో ఉపముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా మోరంచపల్లి గ్రామం నుండి మంజూరునగర్ లోని సభావేదిక వరకు పెద్ద ఎత్తున ద్విచక్ర వాహనాల ర్యాలీ ఉంటుందని, ఈ ర్యాలీలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

**మంజూరునగర్ లోని సభాస్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే..**

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం అనంతరం మంజూరునగర్ లోని సభా ప్రాంగాణాన్ని సింగరేణి, జెన్కో, పోలీసు, ఇతర శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పరిశీలించారు. ఈ కార్యక్రమాలలో సింగరేణి జిఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి, విద్యుత్ శాఖ డిఈ పాపిరెడ్డి, సీఐ నరేష్ కుమార్, ఎస్సై సాంబమూర్తి, కాంగ్రెస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్, ఆర్టీఏ మెంబర్ సుంకరి రామచంద్రయ్య, ఎన్ఎస్ఆర్ అధినేత నాయినేని సంపత్ రావు, జిల్లా నాయకులు అప్పం కిషన్, మాజీ కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, ముంజాల రవీందర్ , శిరుప అనిల్, కాంగ్రెస్ నాయకులు తోట రంజిత్, రజనీకాంత్ , వెంకన్న, రవీందర్ నాయకులు పాల్గొన్నారు.



# ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మృతి

**తొర్రూరు ,జూన్ 15 (జనం సాక్షి) :** రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన తొర్రూరు పట్టణ కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. శనివారం రాత్రి సర్వి రమేష్ (42) అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై బస్టాండ్ కు వెళ్లి తిరిగి తన ఇంటికి,అన్నారం రోడ్డులో వెళ్తున్న సమయంలో, ఎదురుగా వస్తున్న జఫర్గడ్ మండలానికి చెందిన జువారి బన్నీ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంతో ఢీ కొనడంతో రమేష్ తలకు తీవ్ర గాయమవడంతో చెవిలో నుండి రక్తస్రావం జరిగింది. అతన్ని స్థానికులు తొలుత వరంగల్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో, హైదరాబాదులోని యశోద ఆసుపత్రికి తరలించగా,చికిత్స పొందుతు రమేష్ ఆదివారం ఉదయం 11:45నిముషాలకు మృతి చెందాడు. మృతుడి అన్న సర్వి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడమైనది అని తొర్రూరు ఎస్సై గొల్లమూడి ఉపేందర్ తెలియజేయడం జరిగింది.

# కిక్ బాక్సింగ్‌లో చిచ్చర పిడుగులు



**భీమదేవరపల్లి, జూన్ 15(జనం సాక్షి) :** మండలంలోని ముల్కనూరు గ్రామానికి చెందిన గురు మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు హనుమకొండ జిల్లాలో కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. అందులో అండర్–8 విభాగంలో కనగండ్ల దర్ష్ హార్ట్ స్టైల్ కట్టాస్ లో ప్రథమ బహుమతి అందుకున్నాడు. అండర్ –9 లో బాలికల నర్సింగ్ రోజు బవజ్ఞ హార్ట్ స్టయిల్ కట్టసులో, బాలల విభాగంలో అర్జున్, అండర్ 14లో రక్షిత వీరంత ప్రథమ బహుమతి అందుకున్నారు.తమ చిన్నారులు చిన్ననాటి నుంచి ఇలాంటి స్వయం రక్షణ కలిగిన విద్యను నేర్చుకోవడంతో పాటు పతకాలు సాధించడం ఏంతో సంతోషంగా ఉందని వారి తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.తమ పిల్లలు రానున్న రోజుల్లో దేశానికి మంచి గుర్తింపు తెచ్చే విధంగా తయారవుతారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో కోచ్ సిరిగిరి సాంబశివ ఉన్నారు.

# టైగర్ ఫారెస్ట్ కన్జర్వేషన్ రిజర్వ్ జీవో 49ను రద్దు చేయాలి

- జీవో పరిధిలో 4 లక్షల ఎకరాలు
- జీవోపై కేంద్ర ప్రభుత్వానికి సమాచారం లేదు
- కాంగ్రెస్ నాయకులను నిలదీయండి
- 16 వ తేదీ నుండి జీవో వ్యతిరేక దినోత్సవ కార్యక్రమాలు
- గిరిజన మంత్రి సీతక్క జిల్లా కు అన్యాయం చేశారు
- సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు



**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో జూన్ 15 ( జనం సాక్షి) :** టైగర్ ఫారెస్ట్ రిజర్వ్ జీవో నంబర్ 49 విడుదల చేసి రాష్ట్ర ప్రభుత్వం కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రజలకు తీవ్ర అన్యాయం చేసిందని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు ఆరోపించారు. ఆదివారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని తన నివాసంలో జరిగిన మీడియా సమావేశంలో వివరించారు.ఈ జీవో వల్ల జిల్లాలో గిరిజనులకు కనీసం బ్రతకడానికి మనుగడ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే టైగర్ ఫారెస్ట్ రిజర్వ్ జీవో పేరిట జిల్లాలోని అనేక మండలాలకు ముఖ్యంగా అడవి ప్రాంతంలో రోడ్డు వేయడానికి అవరోధంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని 339 గ్రామాల్లో సదస్సులు నిర్వహించి, ఈ జీవను విడుదల చేసినట్లు అందులో పేరు కోవడం శుద్ధ అబద్ధమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి, గాని, జిల్లాలోని ఎమ్మెల్యేలకు గానీ, ముఖ్యంగా పార్లమెంట్ సభ్యుల గాని ఎలాంటి సమాచారం ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా జిఓ విడుదల చేసిందని , ఈ జీవను జిల్లాలోని ముఖ్యంగా ఆదివాసి సంఘాలు, అన్ని పార్టీల నాయకులు, ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. ఈనెల 16వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో గల తహసిల్దార్లకు బిజెపి శ్రేణులు వినతిపత్రాలు అందించి, ధర్నాలు , జీవోపత్రాల దహనాలు చేయాలని ఎమ్మెల్యే హరీష్ బాబు పిలుపునిచ్చారు. సిర్పూర్ నియోజకవర్గంలోని చింతల మన పెల్లి, బెజ్జూర్, పెంచికల్పేట్, దహగాం, కాగజ్ నగర్, సిర్పూర్టి మండలాల్లో గల గ్రామాలకు రోడ్ల నిర్మాణం నిలిచిపోతుందని అన్నారు. టిఆర్ఎస్ గవర్నమెంట్ అధికారం చేపట్టాక అటవీ అధికారుల ఆగడాలు పెచ్చుమిరాయని, ఈ జీవో విడుదల వల్ల ఇక జిల్లాలో ప్రజల మనుగడ ఏమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఇన్చార్జ్ మంత్రిగా పనిచేసిన సీతక్క జిల్లాకు ఎలాంటి అభివృద్ధి చేయలేదని, అన్నారు. జీవో పై జిల్లాలోని అన్ని మండలాల్లో, గ్రామాల్లో కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులను, నాయకులను ఎక్కడికి అక్కడ నిలదీయాలని ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు కోరారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం, కాగజ్ నగర్ పట్టణ అధ్యక్షులు శివకుమార్, నాయకులు కొప్పుల శంకర్, అశోక్, గణపతి, తదితరులు పాల్గొన్నారు.

# పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే..

- కార్పోరేట్ శక్తుల కోసం బిజెపి పనిచేస్తుంది..
- మావోయిస్టులను అంతం చేస్తామనడం అవివేకం..
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** దేశవ్యాప్తంగా పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సిపిఐ భూపాలపల్లి 18 వ పట్టణ మహాసభ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మహాసభ ప్రాంగణంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం సుభాష్ కాలనీలోని సింగరేణి ఫంక్షన్ హాల్ లో జరిగిన మహాసభకు సిపిఐ పట్టణ కార్యదర్శి సొతుకు ప్రవీణ్ అధ్యక్షత వహించగా రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనేక వాగ్దానాలు చేసి పేదల సంక్షేమాన్ని విస్మరించి కార్పోరేట్ శక్తుల కోసం బిజెపి పనిచేస్తుందన్నారు.

మావోయిస్టులను అంతం చేస్తామనడం అవివేకమని, ప్రభుత్వ పరంగా చట్టాలు ఉన్నాయని, వాటి ఆధారంగా ముందుకు వెళ్లాలి కానీ, ఒక ఉగ్రవాదుల్లా అంతం చేస్తామనడం సరికాదన్నారు. మావోయిస్టులను లేకుండా చేసేందుకే కేంద్ర ప్రభుత్వం కగార్ ఆపరేషన్ చేపట్టిందని, మావోయిస్టులతో చర్చలు జరిపి సమస్య పరిష్కారం చేయాలన్నారు. మరోవైపు కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసే విధంగా కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని, సింగరేణి సంస్థలను ప్రైవేటు పరం చేసి నిర్వీర్యం చేయడం కోసం కేంద్రం కుట్ర చేస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను వారికి దారాధత్తం చేస్తున్నదని విమర్శించారు. కార్పొరేట్ శక్తులైన అంబానీ, ఆదానీలకు వంతపాడుతూ పేదల సంక్షేమాన్ని విస్మరించారని అన్నారు. కార్పొరేట్ శక్తులకు వేలకోట్ల రూపాయల రాయితీ కల్పించి పేదల పై మాత్రం పెనుభారాలు మోపుతున్నారని అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేతిలో ప్రధాని మోడీ పావుగా మారాడాని, అమెరికాలో మన విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నా మోడీ మాట్లాడడం లేదని అన్నారు. గత పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరించిందని, విసుగుచెందిన ప్రజలు కాంగ్రెస్ కు అధికారం ఇచ్చారని అన్నారు. కాళేశ్వరం పేరుతో లక్ష కోట్ల ప్రజాధనాన్ని వృధా చేశారని, కాళేశ్వరం వల్ల ఉమ్మడి వరంగల్, భూపాలపల్లి జిల్లాలకు ఒక్క ఎకరానికి నీరు అందలేదని అన్నారు. ఎప్పటికైనా ప్రజా సమస్యలపై నిరంతరం ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేనని, భవిష్యత్తులో ప్రజల పక్షాన మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

**భూపాలపల్లి మున్సిపాలిటీపై ఎర్రజెండా ఎగరేద్దాం : సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్..**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో భూపాలపల్లి మున్సిపాలిటీ పై ఎర్రజెండాను ఎగరవేద్దామని సిపిఐ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ అన్నారు. చట్టసభలలో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం ఉంటేనే పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. నూతన కమిటీ నిర్ణయాలను అమలు చేసే దిశగా పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా భూపాలపల్లి పట్టణంలోని సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్వహించాలని మహాసభలో తీర్మానించారు. మీరు చేయబోయే ప్రతి పోరాటంలో రాష్ట్ర, జిల్లా పార్టీ సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు. ఈ మహా సభల్లో సిపిఐ కౌన్సిల్ సభ్యులు గురుజపెల్లి సుధాకర్ రెడ్డి, జి శ్రీనివాస్, మాతంగి రామ్ చందర్, కొరిమి సుగుణ, మాజీ కౌన్సిలర్ నూకల భూలక్ష్మి చంద్రమౌళి, ఆసిఫ్ పాషా, తాళ్ల పోషం నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్ తో పాటు 250 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
16 జూన్ 2025

# యువత క్రీడల్లో నైపుణ్యతను మెరుగుపరుచుకోవాలి

- భారత మాజీ కెప్టెన్ అజారోద్దీన్
- తాండూరులో క్రికెట్ క్రీడా మైదానం ఏర్పాటుకు కృషి
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, జూన్ 15 (జనంసాక్షి) :** యువత క్రీడల్లో నైపుణ్యతను మెరుగు పరుచుకోవాలని భారత మాజీ కెప్టెన్ అజారోద్దీన్ పేర్కొన్నారు. పట్టణానికి చెందిన వ్యాపార వేత్త, జీఎంకే బిల్డర్స్ అధినేత ముజీబ్ ఖాన్ ఆధ్వర్యంలో విలియమూన్ గ్రౌండ్లో ఏర్పాటు చేసిన ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్) క్రికెట్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. గత నెల 28న పట్టణంలోని విలియమూన్ మైదానంలో ప్రీమియర్ లీగ్ సీజన్-1 రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసిన టోర్నమెంట్ ముగింపు సమావేశానికి భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, మాజీ ఎంపీ అజారోద్దీన్, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డితో కలిసి హాజరయ్యారు. సుమారు 18 రోజులుగా 40 జట్లతో జరిగిన పోటీలలో ఆదివారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్ లో ఆల్బూర్ఖాన్ తాండూరు జట్టు, జీఎంకే జట్టులు పోటీలో పోటీ పడగా 83 పరుగులతో ఆల్బూర్ఖాన్ జట్టు విజయం సాధించింది. జీఎంకే జట్టు రన్నర్ గా నిలిచింది. ఈ పోటీలో విజేత జట్టుకు ట్రోఫీతో రూ. 50వేల నగదు, రన్నర్ జట్టుకు ట్రోఫీతో పాటు రూ. 25 వేల నగదును అజారోద్దీన్, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా అజారోద్దీన్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో డబ్ల్యూపీఎల్ క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యువత పోటీలు పడి ఫైనల్ కు చేరుకోవడం, ట్రోఫీ, నగదును గెలుచుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తాండూరులో క్రికెట్ క్రీడకారుల కోసం మంచి క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని కోరారు. యువత క్రీడల్లో నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలన్నారు. గ్రామీణం, పట్టణం, జిల్లా, రాష్ట్రం, జాతీయం, అంతర్జాతీయ స్థాయిలలో రాణించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ క్రీడాభివృద్ధికి తమ వంతు తోడ్పాటు అందస్తామన్నారు. తాండూరులో క్రికెట్ క్రీడా మైదానం ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. ఇప్పటికే మంజూ రైనా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లో క్రీడలకు ప్రాధాన్యమిచ్చే విధంగా దృష్టిసారిస్తున్నామన్నారు. తాండూరులో డబ్ల్యూపీఎల్ టోర్నమెంట్ ను విజయవంతంగా పూర్తి చేసినవారందరికి అభినందనలు తెలిపారు. క్రీడల్లో గెలుపు ఓటములను సహజంగా తీసుకోవాలని సూచించారు. అంతకు ముందు భారత మాజీ కెప్టెన్ అజారోద్దీన్ తాండూరు రాకతో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి స్థానిక నాయకుల తో కలిసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ్ల బాల్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, అబ్దుల్ రవూఫ్, మాజీ డీపీసీ సభ్యులు పట్లోళ్ల నర్సింలు, సర్దార్ ఖాన్, టోర్నమెంట్ నిర్వహకులు, రాజకీయ నేతలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## మల్కాపూర్‌లో ప్రారంభమైన గ్రామ దేవతల ఉత్సవాలు



**తూప్రాన్, జూన్ 15 (జనం సాక్షి) :** ఆదర్శ గ్రామమైన మల్కాపూర్ గ్రామంలో గ్రామ దేవతల ఉత్సవాలు ఆదివారం రోజు ఘనంగా ప్రారంభమయ్యాయి పురోహితులు సంవత్సరంలో ప్రత్యేక పూజలు చేశారు సాయంత్రం గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. ఈ నెల 15 నుండి 18 వరకు గ్రామదేవతల జాతర కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు చెప్పారు. ఆదివారం ఉదయం బొడ్రాయికి జలాభిషేకం, మధ్యాహ్నం ముత్యాలమ్మ, రేణుక మాత, నల్ల పోచమ్మ, కనకదుర్గమ్మలకు బోనాల సమర్పించే కార్యక్రమం ఘనంగా జరిగింది. సోమవారం గ్రామ నడిబొడ్డున ఊరడమ్మ పండగ, మంగళవారం మహంకాళి అమ్మ పండుగ, బుధవారం దుర్గమ్మ పండగ, గావు రంగాలతో జాతర ఉత్సవాలు ముగుస్తాయి. కార్యక్రమంలో గ్రామ తాజా మాజీ సర్పంచ్ మహదేవీ నవీన్ , తాజా మాజీ ఉపసర్పంచ్ ఆంజనేయులు గౌడ్ ,గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు, మహిళలు, పాల్గొన్నారు.

## 135 గ్రామాలలో జెండా ఆవిష్కరణ వేడుకలు



**హయత్‌నగర్, జూన్ 15 (జనం సాక్షి) :** మన ఆలోచన సాధన సమితి (మాస్) వ్యవస్థాపకులు నర్సింగ్ రావు పిలుపు మేరకు తెలంగాణ వ్యాప్తంగా 37 నియోజకవర్గాల లోని, 135 గ్రామాలలో ఒకే రోజు జెండాలు ఆవిష్కరించారు. బీసీ కులాల్లో చైతన్యం, సఖ్యత, కోసం గత నెల రోజులుగా గ్రామ బాట కార్యక్రమాన్ని చేపడుతూ గ్రామాల లో ఉన్న బీసీలను (కులవృత్తుల చేసుకునే కులాలను) వారి మధ్య సఖ్యతను, రాజకీయ చైతన్యాన్ని నింపుతూ గ్రామ బాట కార్యక్రమం కొనసాగిస్తూన్నాము. జూన్ 15 వ తేదీన ఒకే రోజు 135 గ్రామాలలో, వేడుకలు మన ఆలోచన సాధన సమితి రాష్ట్ర కమిటీ సభ్యులతో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న వివిధ గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీలు, నియోజకవర్గ కేంద్రాలలో, జెండాలను ఆవిష్కరించడం జరిగింది. ఈ వేడుక లలో మాస్ వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు, గౌరవ అధ్యక్షులు గడ్డం నరసింహ గౌడ్, దొంత ఆనందం నేత, పూస నరసింహ బెస్త, రాష్ట్ర కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఐడిఎల్ 5కె, 10కె రన్‌ను నిర్వహించిన అశోక వన్‌మాల్



**ఖైరతాబాద్, జూన్ 15 (జనం సాక్షి) :** అశోక డెవలపర్స్, బిల్డర్స్ లిమిటెడ్ యొక్క ప్రతిష్టాత్మక వెంచర్, అశోక వన్ మాల్ ఆదివారం తమ క్రీడా భాగస్వామి డెకాథ్లాన్‌తో కలిసి ఐడిఎల్ 5కె, 10కె రన్‌ను మాల్ ప్రాంగణం వద్ద నిర్వహించినట్లు అశోక డెవలపర్స్ అండ్ బిల్డర్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.జైదీప్ రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ రన్నర్లు సమీపంలోని సరస్సు పక్కనే ఉన్న రోడ్డుపై పరుగులు పెట్టి తిరిగి మాల్ కు చేరుకోవటంతో ఈ రన్ ముగిసిందన్నారు . అశోక వన్ మాల్ ఐడిఎల్ 5కె, 10కె రన్‌లో అన్ని రకాల అనుభవ స్థాయి కలిగిన రన్నర్లకు తగిన అవకాశాలను కల్పించడానికి బహుళ విభాగాలలో పోటీలు జరిగాయి. పోటీ జరిగిన విభాగాలలో అమెచ్యూర్ రన్నర్లు, అనుభవజ్ఞులైన అథ్లెట్లు, కార్పొరేట్ జట్లు మరియు ఫిట్‌నెస్ ప్రేమికులు ఉన్నారన్నారు. అందరికీ ఆరోగ్యం, శ్రేయస్సును ప్రోత్సహించాలనే కార్యక్రమం యొక్క నిబద్ధతను పునరుద్ఘాటించింది. ఆహ్లాదకరమైన మార్గం మరియు తెల్లవారుజామున ఈ రన్ ప్రారంభం కావటంతో, ఈ కార్యక్రమం తోటి రన్నర్‌లతో స్నేహం చేస్తూనే తమ పరిమితులను అధిగమిం చట్టానికి అనువైన వాతావరణాన్ని సృష్టించింద న్నారు. 5కె రన్‌లో వరుసగా పురుషుల, మహిళల విభాగాలలో వరుసగా 1వ స్థానం సాధించినందు కు మొహమ్మద్ షరీఫ్, అంజలి డెకాథ్లాన్ షూలను అందుకున్నారు. మనోజ్, సౌజన్య తమ తమ విభాగాలలో 2వ స్థానం సాధించినందుకు డెకాథ్లాన్ టీ-షర్టులను అందుకున్నారు. పరుగులో పాల్గొన్న వారందరికీ రిఫ్రెష్‌మెంట్‌లు కూడా అందించారు.

## ఇందిరా పార్క్ ధర్నాను జయప్రదం చేయండి



**కుత్బుల్లాపూర్, జూన్ 15 (జనం సాక్షి) :** ఈ నెల 17వ తేదీన ఇందిరా పార్కులో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ పార్టీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, జాతీయ సమితి సభ్యులు యూసుఫ్ పిలుపునిచ్చారు. ఆదివారం షాపూర్ నగర్ ఏఐటీయూసీ కార్యాలయంలో కార్యాలయంలో గోడ ప్రతులను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మావోయిస్టు ఏరి వేస్తాం అని చెప్పడం మనిషి జీవించే హక్కును కాలరాయడమేనని పేర్కొన్నారు. మావోయిస్టులు చర్చలకు సిద్ధమని ప్రకటించిన ప్రభుత్వం ముందుకు రాకపోవడం ఎంతవరకు సమంజసంమని వారు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి లక్ష్మణ్, సిపిఐ ఎంఎల్ నాయకులు అనురాధ, శివ బాబు, ప్రవీణ్, సిపిఎం నాయకులు అంజయ్య, సత్యం, స్వాతి, నరసింహారెడ్డి, వంశీ, జంబు, తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో నేను నా లల్లి షూటింగ్



**చేవెళ్ల, జూన్ 15 (జనంసాక్షి) :** పవన్ తేజ ఫిలిమ్స్ బ్యానర్‌పై శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న నేను నా లల్లి అనే సినిమా ప్రెస్ మీట్ లో డైరెక్ట్ అండ్ ప్రొడ్యూసర్ ఎన్ఎన్ఆర్ చౌదరి మాట్లాడుతూ...రెండు షెడ్యూల్ పూర్తి చేసుకుని మూడవ షెడ్యూల్ 22 వరకు సినిమా పూర్తిగా అవుతుంది అని చెప్పారు ఈ సినిమా కుటుంబ కథ నేపథ్యంలో సాగే అన్ని వర్గాల ప్రజలను సినిమా ఆకట్టుకుంటుందని తెలిపారు. సినిమాలో ఐదు పాటలు ఉన్నాయన్నారు. సినిమా షూటింగ్ మొత్తం హైదరాబాద్ సరిసర ప్రాంతాలలో మొయినాబాద్, పరిగి, వికారాబాద్ నిర్వహించడం జరిగిందన్నారు. అయితే మొదటి షెడ్యూల్ శ్రీకాకుళంలో చేసుకొని, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ శరవేగంగా జరుపుకొని పూర్తిచేసుకునేందుకు సిద్ధంగా ఉందన్నారు. టాకీ పార్ట్ పూర్తి చేసుకుని ఒక ఫైట్, ఒక సాంగ్ 22 వరకు పూర్తి అవుతుందని డైరెక్టర్ చెప్పారు. అదేవిధంగా హీరోయిన్ సింగర్ మనో మేనకోడలు తస్లీమ్ హీరోయిన్, హీరోగా ఎన్ఎన్ఆర్ చౌదరి, ఆర్టిస్టులు పద్మ జయంతి, హేమ సుందర్, షియాజ్ షిండే, డిఓపి శ్రీనివాసచారి, సహాయ దర్శకుడు మెండం శ్రీధర్, వల్లూరి సాంబశివరావు, మేకప్ ఆర్ట్ డైరెక్టర్ నాని, పండు, కొరియోగ్రాఫర్ కపిల్ మాస్టర్, మ్యూజిక్ ఎం ఎల్ రాజా తదితర సాంకేతిక నిపుణులతో రూపుదిద్దుకుంటున్న ఈ మూవీ పేరు నేను నా లల్లి తెలిపారు.

## ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం



**కేశంపేట, జూన్ 15 (జనం సాక్షి) :** మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన కల్లు జంగయ్య నూతనంగా ఇంటి నిర్మాణాన్ని చేపడుతున్నాడు. జంగయ్యది పేద కుటుంబం కావడంతో గ్రామ బీజేపీ యువ నాయకుడు పాలాది శ్రీనివాస్ తన వంతు సహాయంగా ఇంటి నిర్మాణం కోసం 10 సిమెంటు బస్తాలను అందజేశారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు తట్టేపల్లి నరసింహ, పుట్నాల శ్రీను, దానగళ్ల మహేష్ పాల్గొన్నారు.

## ఆస్తి విషయంలో మహిళా హత్య

**అమీన్‌పూర్, జూన్ 15 (జనం సాక్షి) :** అత్త కోడలు ఇచ్చిన ఆస్తివిషయంలో కుటుంబ తగాదాలు నెలకొని మహిళను హత్య చేసిన సంఘటన అమీన్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అమీన్పూర్ ఇన్స్పెక్టర్ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రం చైత్ర జిల్లా సక్నోలి గ్రామానికి చెందిన ఉమేష్ కుమార్ సింగ్ అమీన్పూర్ పట్టణ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో భార్య ముగ్గురు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. భార్య ఆబాదేవి (38) బీరంగులలోని హోటల్లో పనిచేస్తుంది. అబదేవి అత్త కళావతి దేవి అనారోగ్యంతో ఉన్నప్పుడు ఆమెకి బాబా దేవి సేవలు చేసింది. అందుకుగాను కళావతి పాట్నాలో ఉన్న ప్లాట్‌ని ఆభాదేవికి రాసిచ్చింది. కళావతికి ఉమేష్ కుమార్ సింగ్‌తో పాటు మరో ఇద్దరు కుమారులు ఉన్నారు. కళావతి మృతి చెందిన తర్వాత ఫ్లాట్ విషయంలో కుటుంబ సభ్యులు గొడవలు పడ్డారు. ఆ ఫ్లాట్ ని తన పేరు పైకి చేయాలని భర్త ఉమేష్ సింగ్ భార్య ఆబాదేవిని వేధించేవాడు. అబ్బా దేవి పెద్ద కుమారుడు అంకిత్ కుమార్ తల్లితో గొడవ పడడంతో మందలించింది. దాంతో అంకిత్ కుమార్ గత కొంతకాలంగా స్నేహితుల వద్ద ఉంటున్నాడు. ఉమేష్ కుమార్ ఉద్యోగరీత్యా తరచూ బయట ఉండడంతో భార్యపై అనుమానం పెంచుకున్నాడు ఆస్తి విషయంలో గొడవలు జరుగుతూ ఉండడంతో తన సోదరుడు రమేష్ కుమార్ సింగ్ కుమారుడు అంకిత్ కుమార్ లతో ఫ్లాట్ విషయంలో చర్చించారు. ఆపా దేవిని హత్య చేసి ఆస్తిని తీసుకోవాలని పన్నాగం చేశారు. ఉద్యోగరీత్యా బయట ఉన్న ఉమేష్ కుమార్ సింగ్ కుమారుడు సోదరుడికి విషయం చెప్పి శుక్రవారం ఇంటికి పంపాడు. రమాదేవి బట్టలు సర్దుకుని బీహార్ వెళ్ళిపోతుందని గమనించిన అంకిత్ కుమార్, రమేష్ కుమార్ సింగ్ కట్టెలతో ఆపాదిని విచక్షణ రహితంగా కొట్టారు. అనంతరం స్థానికుల సహకారంతో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. రోడ్డు ప్రమాదం జరిగిందని చెప్పి ఆసుపత్రిలో చేర్పించి అక్కడి నుంచి తప్పించుకుని వెళ్ళిపోయారు. అక్కడ చికిత్స పొందుతూ బాబా దేవి మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేత



**దోమ, జూన్ 15 (జనం సాక్షి) :** దోమ మండలం దాదాపూర్ గ్రామంలోని రైతు వేదికలో దోమ మండలంలోని పలు గ్రామాలకు చెందిన 249 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ లను స్థానిక నాయకులు,అధికారులతో కలిసి పరిగి ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి అందజేశారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాలను తీసుకున్న లబ్ధిదారులు (మహిళలు) ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వానికి,ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు చాపల వెంకటయ్య, చాపల లక్ష్మయ్య, రాకొండ గ్రామ కమిటీ అధ్యక్షులు కొత్త చంద్రయ్య, మజ్జిగ వెంకటయ్య, చాపల శ్రీనివాస్, పిల్లి మురళి కృష్ణ, బండి వెంకటయ్య, పిల్లి వెంకటయ్య, మజ్జిగ నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

## విశ్వకర్మ భగవాన్ విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే




**కుత్బుల్లాపూర్, జూన్ 15 (జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం సూరారం డివిజన్ పరిధిలోని విశ్వకర్మ కాలనీలో ఏర్పాటుచేసిన విరాట్ విశ్వకర్మ భగవాన్ విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమానికి డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణతో కలిసి ఎమ్మెల్యే కేపీ వివేకానంద ముఖ్యఅతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సృష్టికి మూలం విరాట్ విశ్వకర్మ అని అన్నారు. ప్రాచీన శిల్పకలలకు ఆధ్యుడనీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, విశ్వకర్మ కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సదానందం, పోచమ్మ దేవాలయం చైర్మన్ ఎస్ జీవన్ రెడ్డి, శ్రీ విరాట్ విశ్వబ్రాహ్మణ సేవ సంఘం అధ్యక్షులు పి కృష్ణమాచారి, కార్యనిర్వాహక అధ్యక్షులు కమ్మరి లక్ష్మణాచారి, సమ్మిరెడ్డి, వాసు గుప్తా, పెంటాచారి, సోమాచారి, రామాచారి, ఫాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు కనకాచారి, కస్తూరి బాలరాజ్, అడ్వకేట్ కమలాకర్, ఏవి శేషాచారి, తెలంగాణ సాయి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 2287 కేసుల రాజీ

- రూ.1 కోటి, 43 లక్షలు సైబర్ బాధితులకు అందజేత
- క్రైమ్ రీఫండ్‌లో సంగారెడ్డి జిల్లాకు ఐదవ స్థానం
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 15 (జనం సాక్షి) :** జాతీయ మెగా లోక్-అదాలత్‌లో 2287 కేసులు రాజీ చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జాతీయ మెగా లోక్ అదాల ద్వారా 22 87 కేసులను రాజి చేయడం జరిగిందన్నారు.జాతీయ మెగా లోక్-అదాలత్ లో భాగంగా సైబర్ క్రైమ్ రీఫండ్ లో జిల్లాకు ఐదవ స్థానం లభించిందన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో కోల్పోయిన రూ. 1.43 కోట్ల రూపాయలను తిరిగి సైబర్ బాధితులకు అందజేశామని తెలిపారు. గత నెల రోజుల నుండి జరిగిన జాతీయ మెగా లోక్-అదాలత్ లో భాగంగా, జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన, రాజీ పడటానికి అవకాశం ఉన్నటువంటి చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న 502 - ఐ.పి.సి., 206 - సైబర్ క్రైమ్, ఇ-పెట్టి -300, డిడి కేసులు - 1279 మొత్తం 2287 కేసులలో ఇరు వర్గాలను రాజీ కుదిరించడం జరిగిందన్నారు. సైబర్ క్రైమ్ రీఫండ్ నందు రాష్ట్ర స్థాయిలో జిల్లాకు ఐదవ స్థానం, కమిషనరేట్లు మినహా జిల్లాతో పోలిస్తే సంగారెడ్డి జిల్లాకు మొదటి స్థానం రావడం జరిగిందన్నారు. జిల్లాను రాష్ట్ర స్థాయిలో అగ్రగామిగా ఉంచడంలో కృషి చేసిన అధికారులు, సైబర్ క్రైమ్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. క్షణికావేశంలో చేసే తప్పులను సరిదిద్దుకోవాడానికి లోక్-అదాలత్ అనేది ఒక మంచి అవకాశం అని, అనవసర గొడవలకు పోయి జీవితాలను ఇబ్బందులపాలు చేసుకోకూడదని అన్నారు. రాజీ మార్గమే రాజా మార్గం అని, రాజీ కుదుర్చుకోవడానికి అవకాశం ఉన్న అన్ని కేసులల్లో ఇరు వర్గాలు రాజీపడవచ్చు అన్నారు. ముఖ్యంగా సైబర్ బాధితులకు సత్వర న్యాయం చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ ఆద్వర్యంలో ప్రతి జిల్లాలో డి4సిని ఏర్పాటు చేసి డియస్పి స్థాయి అధికారులచే పర్యాయవేక్షించడం జరుగుతుందన్నారు. జిల్లా ప్రజలెవరైనా సైబర్ మోసాలకు గురి అయినట్లయితే వెంటనే 1930 కి కాల్ చేసి గాని, ఎన్ సి ఆర్‌పి పోర్టల్‌లో గాని లాగిన్ అయి దరఖాస్తు చేయవచ్చు అన్నారు. ఈ సందర్భంగా జాతీయ మెగా లోక్-అదాలత్ ను విజయవంతం చేసిన అధికారులు డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ రమేష్, డి4 సి - ఇన్స్పెక్టర్ రవి, ఐటి ఇన్స్పెక్టర్ కిరణ్, ఎస్ఐ సత్యనారాయణ, అధికారులను, కోర్ట్ డ్యూటీ, సైబర్ సెల్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.




## టెక్ దిగ్గజంలో తొలగింపులు



కంప్యూటర్లను తయారు చేసే ప్రముఖ టెక్నాలజీ కంపెనీ ఇంటెల్ పెద్ద సంఖ్యలో ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమైంది. తమ ఫ్యాక్టరీల్లో పని చేసే ఉద్యోగుల సంఖ్యను గణనీయంగా తగ్గించుకునేందుకు ప్రణాళిక వేసింది.వచ్చే జూలై మధ్యలో తొలగింపుల ప్రక్రియ ప్రారంభమై నెలాకరు కల్లా పూర్తికానుంది. కొత్త సీఈవో లిప్ బు టాన్ వచ్చాక ఇది తొలి, భారీ ఉద్యోగాల కోత కానుంది.ఉద్యోగుల తొలగింపు విషయాన్ని ఇంటెల్ నేరుగా ప్రకటించనప్పటికీ ఈమేరకు కంపెనీ ఉద్యోగులకు ఇంటర్నల్ మెమోల ద్వారా తెలియజేసినట్లు పలు అంతర్జాతీయ వార్త పత్రికల్లో కథనాలు వచ్చాయి. కంపెనీ తన అంతర్గత తయారీ విభాగమైన ఇంటెల్ ఫౌండ్రీలో కార్యకలాపాలను క్రమబద్ధీకరించుకుని, మరింత చురుకైన సంస్థగా మారాలని లక్ష్యంగా పెట్టుకుందని, అందులో భాగంగానే ఉద్యోగ కోతలు చేపడుతోందని పేర్కొన్నాయి. కంపెనీ చేపడుతున్న ప్రస్తుత తొలగింపుల్లో ఎంత మందిపై ప్రభావం పడుతుందనే విషయం వెల్లడికాలేదు. సీనియర్ నాయకత్వం నిర్దేశించిన ఆర్థిక లక్ష్యాలను చేరుకునే వరకు, తొలగింపులను అమలు చేయడంలో వ్యాపార యూనిట్లకు విచక్షణ ఉంటుందని సంబంధిత వర్గాలు సూచిస్తున్నాయి. పర్సనల్ కంప్యూటర్లు, ల్యాప్ టాప్ మార్కెట్లో డిమాండ్ పడిపోవడం, అమ్మకాలు క్షీణించడం, మరోవైపు ఎన్‌విడియా, ఏఎండీ వంటి ప్రత్యర్థుల నుంచి గట్టి పోటీ నేపథ్యంలో ముఖ్యంగా ఏఐ ఫోకస్డ్ హార్డ్ వేర్ లో ఉద్యోగ పునర్నిర్మాణంపై ఇంటెల్ దృష్టి పెట్టినట్లుగా తెలుస్తోంది.

## ఫ్లాట్ల కొనుగోలుకు ఉండాలో ప్రణాళిక..

కొంతమంది పెట్టుబడిదారులకు రియల్ ఎస్టేట్ ఒక ప్రాధాన్యత గల పెట్టుబడి ఎంపిక. ఆస్తిని కొనుగోలు చేయడమనేది వారు చేసే అతిపెద్ద, అత్యంత ఖరీదైన పెట్టుబడులలో ఒకటి.స్థిరాస్తిని పెట్టుబడి ఎంపికగా పరిగణించే పెట్టుబడిదారులు ప్లాట్‌ను కొనుగోలు చేయడం లేదా ఫ్లాట్ ను కొనుగోలు చేయడం మధ్య నిర్ణయం తీసుకునేటప్పుడు కాస్త ఆలోచనలో పడతారు. మీరు స్థిరాస్తిని మొదటిసారి కొనుగోలు చేసేటప్పుడు..ప్లాట్, ఫ్లాట్ మధ్య నిర్ణయం తీసుకోవడానికి కాస్త ఇబ్బంది పడుతుండడం సహజమే. మీ నిర్ణయం తీసుకునే ముందు వీటిపై సులభమైన ఫైనాన్సింగ్, అధిక రాబడి, పన్ను ప్రయోజనాలు మొదలైన ముఖ్యమైన అంశాలను పరిగణనలోకి తీసుకోవడంలో ఈ కథనం మీకు సహాయపడుతుంది. రెండింటిలో ఏది మంచి పెట్టుబడి..లాభ, నష్టాలు ఏవిధంగా ఉన్నాయనే అంశాలను ఇక్కడ తెలుసుకుందాం.



**జనంసాక్షి:**వివిధ కారణాలను బట్టి..ప్లాట్ ఫ్లాట్ రెండూ కాలక్రమేణా విలువ పెరిగే ఆస్తులే. రోడ్లు, మెరుగైన రవాణా సౌకర్యాలు లేదా మెట్రో లైన్ వంటి ఏదైనా కొత్త కనెక్టివిటీ వల్ల ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. ఇది ఎక్కువ మంది నివాసితులను ఆకర్షించి, ఆ ప్రాంతంలో ఉన్న ఆస్తులకు డిమాండ్‌ను పెంచుతుంది. పెట్టుబడి నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఫ్లాట్‌ల కంటే ప్లాట్‌లు త్వరగా ధర పెరుగుతాయి. ముఖ్యమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి దగ్గరగా ఉండడం, మార్కెట్ స్థిరత్వం అన్నీ విలువ పెరుగుదలను ప్రభావితం చేస్తాయి. పరిస్థితులు చాలా కాలం పాటు స్థిరంగా ఉన్నప్పుడు భూమి మరింత విలువైనదిగా మారుతుంది. కాబట్టి, మీరు సృజనాత్మకంగా ఉండి, మీ శైలికి సరిపోయే ఇంటిని భవిష్యత్తులో కావాలని కోరుకుంటే ప్లాట్‌ను కొనుగోలు చేయడం మంచి ఆలోచన. దీర్ఘకాలంలో మీ పెట్టుబడి విలువ బాగా పెరగాలంటే ప్లాట్ కొనుగోలు తెలివైన పని. ఒక విధంగా చెప్పాలంటే మీరు త్వరగా నివాసిత స్థలం ఏర్పరచుకోవాలంటే ఫ్లాట్‌ను కొనుగోలు చేయడం కూడా మంచి ఆలోచనే. పెట్టుబడి ఉండి, వెంటనే నివాసిత స్థలం కావాలనుకునేవారు ప్లాట్‌ల కంటే %ఖీశ్రీన్ఖ్%లను ఇష్టపడతారు. అంతేకాకుండా, మీరు అపార్ట్‌మెంట్ కొనుగోలు చేసినప్పుడు, మీరు దానిని పూర్తిగా తయారయిన ఇల్లుగా అద్దెకు ఇవ్వాలనుకుంటే ఇంటీరియర్ ఫర్నిషింగ్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులను కొనుగోలు చేయడం లాంటివి చేస్తే సరిపోతుంది. మీరు అద్దె ఆదాయాన్ని త్వరగా సంపాదించాలనుకుంటే ఫ్లాట్‌ను కొనుగోలు చేయడం గొప్ప ఎంపిక. వీటిలో మీరు కమ్యూనిటీ లివింగ్‌ను ఆస్వాదించొచ్చు.రుణం, పన్ను ప్రయోజనాలు:మీరు రుణం పొందాలని చూస్తున్నట్లయితే, అపార్ట్‌మెంట్‌కు సులభంగా రుణం లభిస్తుంది. దాని ధరలో 80-90% వరకు రుణం తీసుకోవచ్చు. వడ్డీ రేట్లు సాధారణంగా ప్లాట్ రుణాల కంటే తక్కువగానే ఉంటాయి. అంతేకాకుండా, దానిని తిరిగి చెల్లించడానికి మీకు 20-30 సంవత్సరాల వరకు సమయం లభిస్తుంది. మీరు అపార్ట్‌మెంట్ కొనుగోలు చేసినప్పుడు అసలు, వడ్డీ, స్టాంప్ డ్యూటీ వంటి ఇతర ఖర్చులతో సహా రుణంపై పన్ను మినహాయింపులను పొందవచ్చు. మీరు గృహ రుణంతో ఫ్లాట్ కొనుగోలు చేసి ప్రతి నెలా వడ్డీ చెల్లిస్తే, రూ. 2 లక్షల వరకు పన్ను మినహాయింపునకు అర్హత పొందుతారు. అదనంగా, అసలు చెల్లింపుపై రూ.1.50 లక్షల వరకు మినహాయింపు లభిస్తుంది. ప్లాట్ కు నిర్మాణం పూర్తయిన తర్వాత మాత్రమే పన్ను మినహాయింపులు వర్తిస్తాయి.సులభంగా అనిపిస్తుంది కానీ, ప్లాట్ కొనడం కూడా చాలా పనితో కూడుకున్నదే. చాలా లీగల్ వ్యవహారాలను పర్యవేక్షించాల్సి వస్తుంది. ముఖ్యంగా ఇల్లు కట్టడానికి ప్లాట్ కొన్నట్లయితే, ఆర్కిటెక్ట్‌లు, మేస్త్రీలు, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు వంటి మానవ వనరులను నియమించుకోవాలి. మీరు పనిలో, ప్రక్రియకు సంబంధించిన ప్రతి దశలోనూ చురుకుగా పాల్గొనాలి. వివిధ నిర్మాణ ప్రక్రియల గురించి మీకు తెలియకపోతే, వాటి గురించి తెలుసుకోవాలి. కాబట్టి, ప్లాట్ కొనడం, ఆపై ఇల్లు కట్టడానికి చాలా సమయంతో పాటు శ్రమను, శక్తిని వెచ్చించవలసి ఉంటుంది. ప్లాట్లు, అపార్ట్‌మెంట్‌లు మీ రియల్ ఎస్టేట్ పోర్ట్‌ఫోలియోలో భాగంగా ఉన్నప్పటికీ, వీటిపై అప్రిసియేషన్(రేటు) మారుతూ ఉంటుంది. సాధారణంగా, అపార్ట్‌మెంట్‌లతో పోలిస్తే ప్లాట్ల సరఫరా పరిమితంగా ఉన్నందున, ప్లాట్‌లపై అప్రిసియేషన్ రేటు లేదా పెట్టుబడిపై రాబడి సాధారణంగా దీర్ఘకాలానికి అపార్ట్‌మెంట్‌ల కంటే ఎక్కువగా ఉంటుందని నిపుణుల అభిప్రాయం.మీరు ఒక ప్లాట్‌లో పెట్టుబడి పెట్టాలా లేదా అపార్ట్‌మెంట్ కొనాలా అనే నిర్ణయం తీసుకునేటప్పుడు వాటి లాభ, నష్టాలను తెలుసుకోవడానికి ఈ కింది పట్టికను పరిశీలించండి.

## స్పైస్‌జెట్ లాభాలు మూడింతలు

ముంబై: చౌక ధరల విమానయాన సంస్థ స్పైస్‌జెట్ గత ఆర్థిక సంవత్సరం (2024-25) మార్చి త్రైమాసికంలో రూ.325 కోట్ల స్టాండెలోన్ నికర లాభాన్ని ప్రకటించింది.అంతకు ముందు సంవత్సరం (2023-24) క్యూ4లో ప్రకటించిన రూ.119 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది మూడు రెట్లు అధికం. నిర్వహణ ఆదాయం మాత్రం రూ.1,719 నుంచి రూ.1,446 కోట్లకు తగ్గింది. "మార్చి క్వార్టర్‌లో రికార్డు స్థాయి నికర లాభాన్ని ఆర్జించగలిగాము. ప్రమోటర్ గ్రూప్ క్యూ4లో రూ.294 కోట్లు సహా మొత్తం రూ.500 కోట్లు మూలధనాన్ని సమకూర్చింది.ఇది కంపెనీ దీర్ఘకాలిక దృష్టి, సామర్థ్యంపై నమ్మకాన్ని సూచిస్తుంది" అని స్పైస్‌జెట్ తెలిపింది. కంపెనీ పూర్తి ఆర్థిక సంవత్సరానికిగానూ గత ఏడేళ్లలో తొలిసారి రూ.59 కోట్ల లాభాన్ని ప్రటించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.409 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. తాజాగా నిర్వహణ ఆదాయం 25% క్షీణించి రూ.7,050 కోట్ల నుంచి రూ.5,284 కోట్లకు దిగివచ్చింది. ఆర్థిక ఫలితాల ప్రకటన సందర్భంగా అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదంపై స్పైస్‌జెట్ చైర్మన్ అజయ్ సింగ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో వైమానిక పరిశ్రమ వారికి బాసటగా ఉంటుందన్నారు.



### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 4.80 | ₹ 4.82 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| | |
|---|---|
| ₹ 90,750 (22 క్యారెట్లు) | ₹ 99,000 (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 1,11,000

## ఎస్‌బీఐలో హోమ్‌లోన్లు..



దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన రుణ రేట్లను 50 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ఆర్బీఐ రెపో రేటును తగ్గించిన నేపథ్యంలో ఎస్‌బీఐ కూడా రుణ రేట్లను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ రేట్ల కోత జూన్ 15 నుంచి అమలులోకి వస్తుందని, ప్రస్తుత రెపో లింక్డ్ రుణాలు, కొత్త రుణగ్రహీతలకు వర్తిస్తుందని ఎస్‌బీఐ పేర్కొంది.వారం రోజుల క్రితం ఆర్బీఐ రెపో రేటును 50 బేసిస్ పాయింట్లు తగ్గించిన సంగతి తెలిసిందే. రిజర్వ్ బ్యాంక్ పాలసీ రెపో రేటులో సగం శాతం తగ్గింపునకు అనుగుణంగా ఎస్‌బీఐ ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటు (ఈబీఎల్ఆర్), గృహ రుణ రేటును 50 బేసిస్ పాయింట్లు తగ్గించినట్లు తెలిపింది. ఈ తగ్గింపు తర్వాత ఈబీఎల్ఆర్ 8.65 శాతం నుంచి 8.15 శాతానికి తగ్గింది.రెండవ అతిపెద్ద ప్రభుత్వ రంగ రుణదాత బ్యాంక్ ఆఫ్ బరోడా, మూడవ అతిపెద్ద ప్రభుత్వ బ్యాంక్ పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, యుకో బ్యాంక్ వంటివి ఇప్పటికే రుణ రేట్లను తగ్గించాయి. ఎందుకంటే రెపో రేటుతో లింక్ అయిన లేదా ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లింక్డ్ రుణాలుగా పిలిచే, ఫ్లోటింగ్ రేట్లలో ఉన్న రుణాలకు రిజర్వ్ బ్యాంక్ రెపో రేటు తగ్గించిన వెంటనే కాకపోయినా, వచ్చే నెల మొదటి రోజు నాటికి రెపో తగ్గింపును ప్రస్తుత రుణగ్రహీతలకు బదిలీ చేయాల్సి ఉంటుంది.

## ఏడిపించే ఏడు ఆర్థిక సమస్యలు

ఆర్థిక స్వాతంత్ర్యం చాలా మంది యువకుల కల. కానీ సమర్థమైన డబ్బు నిర్వహణ అలవాట్లు కొరవడడంతో సంపాదన మొదలుపెట్టిన ప్రాథమిక దశలోనే యువతకు ఆర్థిక కష్టాలు తప్పడంలేదు.అయితే సరైన ప్రణాళికతో ఈ ఇబ్బందులను గట్టెకవచ్చని నిపుణులు చెబుతున్నారు. సురక్షితమైన, సంపన్నమైన భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చని సూచిస్తున్నారు. యువత సాధారణంగా ఎలా ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుపోతున్నారో.. దాని నుంచి ఎలా బయటపడవచ్చో కింది ఏడు సమస్యలు-పరిష్కారాల ద్వారా తెలుసుకుందాం.ఆర్థిక అక్షరాస్యత లేకపోవడం:చాలా మంది యువతకు బడ్జెట్, రుణ నిర్వహణ, పెట్టుబడి వంటి ముఖ్యమైన ఆర్థిక నైపుణ్యాలు ఉండవు. అవకాశం ఉన్నా వాటిని నేర్చుకోవాలనే స్పృహ ఉండదు. పాఠశాలలు, కళాశాలల్లోనూ నిజ జీవితంలోని ఆర్థిక పరమైన సమస్యలపై అరుదుగా బోధిస్తారు. దానికితోడు యువత స్థిరమైన ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడానికి సిద్ధంగా ఉండకపోవడం కూడా సమస్యలకు కారణం అవుతుంది.పరిష్కారం: టెక్నాలజీ పెరుగుతున్న తరుణంలో వివిధ మాధ్యమాల ద్వారా ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించుకోవాలి. రిచ్ డాడ్ పూర్ డాడ్, ది రిచెస్ట్ మ్యాన్ ఇన్ బాబిలోన్, ఆలోచించండి ఐశ్వర్యవంతులు కండి... వంటి చాలా పుస్తకాలు మార్కెట్‌లో ఉన్నాయి. వాటిలో మంచి పుస్తకాన్ని ఎంచుకొని ప్రాథమికంగా అందులోని అంశాలను నేర్చుకోవాలి.అధిక వ్యయం, జీవనశైలి ద్రవ్యోల్బణం సామాజిక మాధ్యమాలతో లాభాలున్నట్లే నష్టాలున్నాయి. యువత ప్రధానంగా ప్రస్తుతం అనుసరిస్తున్న సోషల్ మీడియా అకౌంట్‌ల్లో తోటివారిలాగా తమ లైఫ్‌స్టైల్‌ను



మార్చుకోవాలనే ఉద్దేశంతో ఆర్థిక స్థోమత లేకపోయినా అప్పుచేసి బట్టలు, ఫోన్లు, ఇతర గ్యాడ్జెట్లు.. వంటివి కొనుగోలు చేస్తున్నారు. తోటివారి నుంచి ఏర్పడే పరోక్ష ఒత్తిడి ద్వారా శక్తికి మించి ఖర్చు చేయడానికి సోషల్ మీడియా అవకాశం కల్పిస్తుంది.
ఉదా: రూ.30,000 సంపాదించే వ్యక్తి సోషల్‌మీడియా ప్రభావం ద్వారా రూ.25,000 ఖర్చు చేసే అవకాశం ఉంది. దాంతో పొదుపునకు పరిమిత అవకాశం ఉంటుంది.పరిష్కారం: 50/30/20 నియమాన్ని అనుసరించాలి. అంటే అవసరాలకు 50%, కోరికలకు 30%, పొదుపునకు 20% ఖర్చులతో బడ్జెట్ రూపొందించుకోవాలి. 3. నియంత్రించలేని రుణం, క్రెడిట్ కార్డు దుర్వినియోగం:క్రెడిట్ కార్డులు ఆర్థిక సౌలభ్యాన్ని అందిస్తాయి. కానీ వాటి దుర్వినియోగం అధిక వడ్డీలకు కారణం అవుతుంది. సులభంగా ఉన్నట్లు కనిపించే 'బై నౌ, పే లేటర్ (బీఎన్‌పీఎల్)' పథకాలు యువతను ఖర్చుల వైపు లాగేస్తున్నాయి. నెలల తరబడి చెల్లించని రూ.50,000 క్రెడిట్ కార్డు బిల్లు అధిక వడ్డీ కారణంగా రూ.70,000 అయ్యేందుకు అవకాశం ఉంటుంది.
పరిష్కారం: ప్రణాళికాబద్ధమైన ఖర్చులకు మాత్రమే క్రెడిట్ కార్డులను ఉపయోగించాలి. వడ్డీ ఛార్జీల నుంచి తప్పించుకోవడానికి ప్రతి నెలా బిల్లులను పూర్తిగా చెల్లించాలి. అత్యవసరమైతే తప్ప బీఎన్‌పీఎల్‌కు దూరంగా ఉండాలి.4. పొదుపు చేయకపోవడం:అత్యవసర నిధి లేకుండా యువకులు వైద్య బిల్లులు, ఉద్యోగం కోల్పోవడం లేదా అత్యవసర ప్రయాణం వంటి ఊహించని ఖర్చులతో ఇబ్బంది పడుతున్నారు. వాటిని పూడ్చేందుకు చాలా మంది అప్పులు చేయడం లేదా ఖరీదైన రుణాలు తీసుకోవడం చేస్తుంటారు.
పరిష్కారం: కనీసం 3-6 నెలల సరిపడా ఖర్చులను ప్రత్యేక అత్యవసర నిధిగా ఏర్పాటు చేసుకోవాలి. అవసరం లేని కొనుగోళ్ల కోసం అప్పుల్లో మునిగిపోవద్దు. ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజీ లేకపోవడం:చాలా మంది యువత మ్యూచువల్ ఫండ్స్, స్టాక్స్, రియల్ ఎస్టేట్ వంటి సంపదను పెంచే అవకాశాల్లో పెట్టుబడి పెట్టడానికి బదులు డబ్బును పొదుపు ఖాతాలు, ఇతర సాధనాల్లో ఉంచుతారు. ఆలస్యంగా పెట్టుబడి పెట్టడం వల్ల కాలక్రమేణా కాంపౌండింగ్ ప్రయోజనాలు తగ్గుతాయి.పరిష్కారం: దీర్ఘకాలిక వృద్ధి కోసం మ్యూచువల్ ఫండ్స్‌లో సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) ప్రారంభించాలి. స్టాక్స్, ఈటీఎఫ్‌లు, ఫిక్స్డ్ డిపాజిట్లలో పెట్టుబడులను వైవిధ్యపరచాలి. పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు రిస్క్, రిటర్న్‌లపై స్పష్టత ఉండాలి. స్కామ్‌ల బారిన పడడం:వేగంగా డబ్బు సంపాదించాలనే ఆశతో యువ పెట్టుబడిదారులు తరచుగా పోంజీ పథకాలు(మోసపూరిత స్కీమ్‌లు), క్రిప్టో స్కామ్‌లు, నకిలీ స్టాక్ చిట్కాలకు మొగ్గుచూపుతారు. సరైన పరిశోధన లేకుండా కష్టపడి సంపాదించిన పొదుపును కోల్పోతున్నారు.
పరిష్కారం: పెట్టుబడి పెట్టేముందు ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌లను సరిచూసుకోవాలి. ఆథరైజ్డ్ ఆర్థిక నిపుణుల సలహాలు పాటించి సొంతంగా నిర్ణయం తీసుకోవాలి.పన్ను ప్రణాళికలు విస్మరించడం:చాలా మంది ఈఎల్ఎస్ఎస్, పీపీఎఫ్, ఎన్‌పీఎస్ వంటి పన్ను ఆదా పథకాలను ఉపయోగించకపోవడం వల్ల అధిక పన్ను చెల్లించాల్సి వస్తుంది. దీనివల్ల ఆదాయం తగ్గుతుంది.పరిష్కారం: పొదుపు, పెట్టుబడులకు పన్ను మినహాయింపులు ఎలా పనిచేస్తాయో తెలుసుకోవాలి. పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయాన్ని తగ్గించడానికి సెక్షన్ 80 సీ ఆప్షన్లను ఉపయోగించాలి. పన్నులను కచ్చితంగా సమయానికి దాఖలు చేయాలి.

## ఆధార్‌తో లింక్ లేకపోతే పాన్‌కార్డుపై ఫైనే..

- రూ. 10 వేలు జరిమానా..
- రెండు పాన్ కార్డులున్నా తప్పే..



పాన్ కార్డు, ఆధార్ లేకుండా నేటి కాలంలో ఆర్థికపరమైన ఏ పనినీ పూర్తి చేయడం సాధ్యం కాదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని పాన్, ఆధార్ అనుసంధానాన్ని తప్పనిసరి చేసింది ప్రభుత్వం.అయితే ఇప్పటికీ చాలా మంది తమ పాన్ కార్డును ఆధార్ తో లింక్ చేసుకోలేదు. అలాంటి వారి పాన్ కార్డులు ఇనాక్టియావ్‌గా మారాయి. అయినప్పటికీ కొందరు ఆర్థిక లావాదేవీల్లో ఇనాక్టివ్ పాన్ కార్డులను అలాగే ఉపయోగిస్తున్నారు.ఇలాంటి వారు ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 272బి కింద కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ సెక్షన్ కింద ఒక్కో లావాదేవీపై రూ.10,000 వరకు జరిమానా విధించవచ్చు. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఎవరైనా ఆర్థిక లావాదేవీల్లో ముఖ్యంగా అధిక విలువ కలిగిన లావాదేవీలలో ఇనాక్టివ్ పాన్ ఉపయోగిస్తే ప్రతి సందర్భంలో ప్రత్యేక జరిమానా విధించవచ్చని ఆదాయపు పన్ను శాఖ చెబుతోంది. బ్యాంకు ఖాతా తెరవడం లేదా నిర్వహించడం, షేర్లు లేదా మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టడం, ఆస్తిని కొనుగోలు చేయడం, రుణం కోసం దరఖాస్తు చేయడం, ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేయడం వంటి లావాదేవీలు ఇందులో ఉన్నాయి.ఒక వ్యక్తి రెండు పాన్ కార్డులు కలిగి ఉండటం చట్టరీత్యా నేరం. ఇలాంటి వారు రెండింటిలో ఒక పాన్ కార్డును సరెండర్ చేయాలి. అలా చేయకుండా పట్టుబడితే ప్రభుత్వానికి వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. కొన్ని కారణాల వల్ల కొంతమందికి రెండు పాన్ కార్డులు ఉండవచ్చు. ఉదాహరణకు పాన్ కార్డు వివరాల్లో తప్పులున్నప్పుడు, పెళ్లి తర్వాత ఇంటి పేరు మార్పు కోసం కొత్త పాన్ కార్డు తీసుకొని ఉండవచ్చు. ఇలా రెండు పాన్ కార్డులు కలిగి ఉంటే ఎలాంటి జరిమానా విధించకుండా వదిలేస్తారు. అదే ఉద్దేశపూర్వకంగా రెండు పాన్‌కార్డులు పెట్టుకుంటే మాత్రం కఠిన చర్యలు తప్పవు. కాబట్టి ఎవరి దగ్గరైనా రెండు పాన్ కార్డులు ఉంటే వెంటనే సరెండర్ చేయడం మంచిది.

ఆస్ట్రేలియా పోలీసుల కర్కశం..

## భారత సంతతి వ్యక్తి మృతి

తెలిసిందే. ఈ క్రమంలో తీవ్ర గాయాలపాలైన గౌరవ్.. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు స్థానిక మీడియా వెల్లడించింది.అడిలైడ్‌లో ఉండే గౌరవ్ కుండి, అమృత్‌పాల్ కౌర్ దంపతుల మధ్య ఇటీవల చిన్న వాగ్వాదం చోటుచేసుకుంది. అది గమనించిన పెట్రోలింగ్ పోలీసులు.. గృహ హింసగా భావించారు. అనంతరం ఇంట్లోకి వచ్చి గౌరవ్‌ను అదుపులోకి తీసుకొనేందుకు ప్రయత్నించారు. అయితే, తమ మధ్య ఎలాంటి గొడవ లేదని, కేవలం చిన్న వాగ్వాదమేనని అతడి భార్య అమృత్‌పాల్ వారించినప్పటికీ పోలీసులు వినిపించుకోలేదు. తాను ఎలాంటి నేరం చేయ లేదని గౌరవ్ ఎంత వేడుకున్నా కనికరించలేదు. అతడిని బలవంతంగా నేలపై పడేసి అరెస్టు చేసేందుకు యత్నించారు. ఈ ఘటనను అమృత్‌పాల్ తన కెమెరాలో చిత్రీకరించడంతో పోలీసుల కర్కశత్వం బయట పడింది.అయితే, కిందపడిన తన భర్త మెడను ఓ పోలీసు అధికారి మోకాలితో గట్టిగా అదిమి పట్టాడని, అరెస్టు సమయంలో తల నేలకు, పోలీసు వాహనానికి బలంగా తాకడంతో గౌరవ్ అక్కడే స్పృహ కోల్పోయాడని అమృత్‌పాల్ ఆరోపించారు.

## మళ్లీ చేతులు విప్రో వాటాలు



ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా ఐటీ దిగ్గజం విప్రో ప్రమోటర్ల వాటాలో 1.72 శాతం చేతులు మారింది. స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజాలు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ సమాచారం ప్రకారం 1.72 శాతం వాటాకు సమానమైన 18.05 కోట్ల ఈక్విటీ షేర్లను అజీమ్ ప్రేమ్‌జీ ట్రస్ట్ విక్రయించింది. వీటిని షేరుకి రూ. 259 సగటు ధరలో ప్రమోటర్ గ్రూప్‌నకు చెందిన ప్రజీమ్ ట్రేడర్స్, జాష్ ట్రేడర్స్ కొనుగోలు చేశాయి.డీల్ విలువ రూ. 4,675 కోట్లుకాగా.. సోమవారం(9న) సైతం అజీమ్ ప్రేమ్‌జీ ట్రస్ట్ 1.93 శాతం వాటాకు సమానమైన 20.23 కోట్ల షేర్లను విక్రయించిన సంగతి తెలిసిందే. వీటిని షేరుకి రూ. 250 సగటు ధరలో ప్రేమ్‌జీ ఇన్వెస్ట్‌కు చెందిన ప్రజీమ్ ట్రేడింగ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ, హర్షమ్ ట్రేడర్స్ అండ్ ప్రజీమ్ ట్రేడర్స్ కొనుగోలు చేశాయి. డీల్ విలువ రూ. 5,057 కోట్లుకాగా.. గతేడాది నవంబర్‌లో ప్రజీమ్ ట్రేడింగ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ ద్వారా ప్రేమ్‌జీ ఇన్వెస్ట్ 1.6 శాతం వాటాకు సమానమైన 8.49 కోట్ల విప్రో షేర్లను కొనుగోలు చేసింది. ఇందుకు రూ. 4,757 కోట్లు వెచ్చించింది. అయితే వీటిని ప్రజీమ్, జాష్ ట్రేడర్స్ వీటిని విక్రయించడం గమనార్హం!

ఎయిర్ ఇండియా డ్రీమ్‌లైనర్‌తో

## సంబంధాన్ని ఖండించిన టర్కీ

అంకారా: గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో కూలిపోయిన ఎయిర్ ఇండియా బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ నిర్వహణతో తమకు సంబంధం లేదని టర్కీ స్పష్టం చేసింది. టర్కీకి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ కమ్యూనికేషన్స్ సెంటర్ ఫర్ కౌంటర్ డిస్‌ఇన్ఫర్మేషన్ దీనిపై స్పందిస్తూ, బోయింగ్ 787-8 ప్యాసింజర్ ఎయిర్‌క్రాఫ్ట్ నిర్వహణను టర్కిష్ టెక్నిక్ నిర్వహించిందనే వాదనను ఖండించింది.అహ్మదాబాద్‌లో కుప్పకూలిన విమానాన్ని టర్కిష్ టెక్నిక్ నిర్వహించిందనే వాదన తుర్కియే-భారత్ సంబంధాలను దెబ్బతీసేలా ఉందని , ఇది ప్రజల అభిప్రాయాన్ని తప్పుదారి పట్టించేందుకు ఉద్దేశించిన తప్పుడు సమాచారమని టర్కీ యంత్రాంగం 'ఎక్స్'లో పేర్కొంది. అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం బీజే మెడికల్ కాలేజీ హాస్టల్ కాంప్లెక్స్ ఆవరణలోకి కూలిపోయింది.'2024-25 ఏడాదికి సంబంధించి ఎయిర్ ఇండియా, టర్కిష్ టెక్నిక్ మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం బీ777-రకం వైడ్-బాడీ విమానాలకు ప్రత్యేకంగా టర్కీలో నిర్వహణ సేవలు అందిస్తారు. అయితే ప్రమాదానికి గురైన బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ ఈ ఒప్పందం పరిధిలోకి రాదు. నేటి వరకూ టర్కిష్ టెక్నిక్ ఈ రకమైన ఏ ఎయిర్ ఇండియా విమానానికి నిర్వహణ సేవలు అందించలేదు' అని టర్కీ అధికారులు పేర్కొన్నారు. దీనిపై మరిన్ని ఊహాగానాలను వ్యాపించకుండా ఉండేందుకే ఈ ప్రకటన చేస్తున్నట్లు తెలిపారు.

## ఇజ్రాయెల్ ప్రధాని కుమారుడి పెళ్లి వాయిదా!

నెతన్యాహు కీలక నిర్ణయం..

**జనంసాక్షి:**దాడులు, ప్రతిదాడులతో ఇజ్రాయెల్-ఇరాన్‌ల మధ్య భీకర యుద్ధం సాగుతోంది. పలువురు ఇరాన్ సైనిక సారథులు, అణు స్థావరాలు, సైనిక స్థావరాలు, అణు శాస్త్రవేత్తలు, సైనిక ముఖ్యులను సమాధి చేసిన ఇజ్రా యెల్..ప్రళయ భీకరంగా విరుచుకుపడుతోంది. మరోవైపు, సైన్యాధికారులను కోల్పోయి.. స్థావరాలను కోల్పోయి ఆయుధపరంగా, శాస్త్రవేత్తలను కోల్పోయి విజ్ఞానపరంగా ఎంతో నష్టాన్ని చవిచూసిన ఇరాన్ కూడా ప్రతికార దాడులకు దిగుతోంది. వందల కోద్దీ డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులను ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్ సిటీమీదకు ఎక్కుపెడుతోంది.ఈ క్రమంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. తన కుమారుడి వివాహ వేడుకను వాయిదా వేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. నెతన్యాహు కుమారుడు అవ్నర్ నెతన్యాహు, అమిత్ యార్దేనీకి త్వరలోనే విహహం జరగనుంది. ఈ మెగా వేడుకను నిర్వహించేందుకు నెతన్యాహు కుటుంబం రెడీ అయ్యింది.అయితే, పశ్చిమాసియాలో చోటు చేసుకున్న యుద్ధ పరిస్థితుల మధ్య నెతన్యాహు తన కుమారుడి పెళ్లి వాయిదా వేసినట్లు తెలుస్తోంది. కాగా, గాజాపై ఇజ్రాయెల్ దాడుల సమయంలో కూడా నెతన్యాహు కుమారుడి పెళ్లి అంశం వివాదాస్పదంగా మారిన సంగతి తెలిసిందే.

# ఘనంగా ఉప ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు

- డిప్యూటీ సీఎంకు శుభాకాంక్షలు తెలిపిన పలువురు మంత్రులు
- శుభాకాంక్షలు చెప్పిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు
- జన సందోహమైన ప్రజాభవన్
- భారీగా తరలివచ్చిన ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు
- ఉస్మానియా విద్యార్థుల ఆధ్వర్యంలో భారీ కేక్ కటింగ్




**హైదరాబాద్, (జనంసాక్షి) :** ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జన్మదినం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రజాభవన్ చేరుకుని ఉప ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకంక్షలు తెలిపారు. కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు భారీగా ప్రజాభవన్ కు చేరుకున్నారు. ఉప ముఖ్యమంత్రికి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, సీతక్క, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు ప్రజాభవన్ చేరుకుని ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రముఖ సినీనటుడు మురళీ మోహన్ సైతం ప్రజాభవన్ చేరుకుని ఉప ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో అభిమానులు కేక్ కటింగ్‌లు చేయడం, ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు పంచి పెట్టడం, రక్తదానాలు చేయడం జరిగింది. ఆదివారం ఉదయం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ఆలయాల నుంచి వచ్చిన వేద పండితులు, అర్చకులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ప్రత్యేకంగా ఆశీర్వాదాలు అందించారు. ప్రజాభవన్ లో వెలిసిన అమ్మవారికి ఉప ముఖ్యమంత్రి దంపతులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా, సుఖ సంతోషాలతో, ఆరోగ్య, ఐశ్వర్యాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకులు లోకేష్ యాదవ్ తదితరులు ప్రత్యేకంగా ఉప ముఖ్యమంత్రి చిత్రపటంతో రూపొందించిన భారీ కేక్ ను భట్టి విక్రమార్కతో కట్ చేయించారు. అనంతరం అక్కడనుంచి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసేందుకు ఎల్బీ నగర్ నియోజకవర్గం లోని కొత్తపేటలోని విక్టోరియా మెమోరియల్ పాఠశాలకు వెళ్లారు. అక్కడే విద్యార్థులతో కలిసి ఉప ముఖ్యమంత్రి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతోపాటు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎంపీ మధు మాష్కీ గౌడ్, ఇతర స్థానిక నేతలు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జన్మదిన సందర్భంగా ఖమ్మం జిల్లా, మధిర నియోజకవర్గంలోని అన్ని ఆలయాల్లో అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు ఆయన గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు, అర్చనలు పెత్త ఎత్తున నిర్వహించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు అహరహరం శ్రమిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఆయు, ఆరోగ్యాలతో జీవించాలని కార్యకర్తలు భగవంతుడిని ప్రార్థించడం విశేషం.

తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో ఉప ముఖ్యమంత్రిగా, ఆర్థిక, విద్యుత్ శాఖలను సర్వసమర్థవంతంగా నిర్వహిస్తున్నారని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సహా పలువురు కొనియాడారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంమే కాక, సామాజిక తెలంగాణ కోసం ఉప ముఖ్యంత్రి పాటుపడుతున్నారని వారు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. బడుగు బలహీన వర్గాలు, సబ్బండ వర్గాల పురోగతి కోసం అనునిత్యం ముఖ్యమంత్రితో చర్చిస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశ పెడుతూ యువతకు స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తున్నారని అన్నారు.




# ముప్పైయేండ్ల నెరవేరనున్న కల

### వేములవాడలో రోడ్ల విస్తరణకు శ్రీకారం

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూన్ 15 (జనంసాక్షి) :** వేములవాడ మూలవాగు నుండి రాజన్న ఆలయం వరకు రహదారి విస్తరణకు ఆదివారం ముహూర్తం ఖరారు చేశారు.ముందుగా మున్సిపల్,రాజన్న ఆలయానికి సంబంధించిన దుకాణాలను కూల్చి వేశారు. భూ నిర్వసితులకు రూ 47 కోట్లు మంజూరు కాగా 250 మంది భూ నిర్వాసితులకు గాను 50 మంది చెక్కులు తీసుకు న్నారు. ఇండ్లు,దుకాణాలు ఖాళీ చేయాలని గత15 రోజుల క్రితమే అధికారులు నోటీసులు జారీ చేశారు. అధికారులు నోటీసులు జారీ చేసిన గడువు ముగియగానే ముందుగా మున్సిపల్, ఆలయ దుకాణాలు కూల్చి వేశారు.మిగతా ఇండ్లు,దుకాణాలు ఖాళీ చేయ లేదు. మున్సిపల్ సిబ్బంది దుకాణాలు ఖాళీ చేయాలని దుకాణదారులకు సమాచారం చేరవేశారు. దుకాణాలు ఖాళీ చేయని వారిపై అధికారులు ఏలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

ఆర్అండ్‌బి, ఇంజనీరింగ్, రెవెన్యూ, వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమావేశం నిర్వహించినట్లు సమాచారం. కూల్చివేత కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అన్వేష్,జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారి అన్సారీ, టిపివో అవినాష్,ఏఈ నరసింహ స్వామి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# స్నేహితుడు మంత్రి కావడం సంతోషంగా ఉంది




- రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

**గోదావరిఖని, జనంసాక్షి :** తెలంగాణ రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సీనియర్ నాయకులు, సింగరేణి ప్రాంత బిడ్డ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తొలిసారి రామగుండంకు విచ్చేసిన సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్‌సింగ్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కార్యకర్తలతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంఎస్ రాజ్‌ఠాకూర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వికలాంగులు, వృద్ధుల సంక్షేమ, ట్రాన్స్ జెండర్ల సాధికారత శాఖ మంత్రిగా రామగుండం నియోజకవర్గానికి రావడం సంతోషకరంగా భావిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో రామగుండం నియోజకవర్గం ప్రత్యేక స్థానం దక్కించుకోవాలన్నారు. మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ప్రాధాన్యతకు నిదర్శనం అని పేర్కొన్నారు.మంత్రివర్యులు మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గం తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధికి, అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరిస్తానని, మౌలిక వసతులు మెరుగుదల, యువతకు ఉపాధి అవకాశాలు, విద్యా, ఆరోగ్య రంగంలో సరైన ప్రణాళిక అమలుతో ముందుకు పోతామని,ముఖ్యమంత్రి దార్శనికంలో అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధ్యక్షులు, అంతర్గాం మండలం, పాలకుర్తి మండల సీనియర్, వివిధ విభాగాల అధ్యక్షులు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లా సంక్షేమ శాఖలో పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

### ఆరు పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం పరిధిలో వివిధ పోస్టులకు ఆదివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం పరిధిలో మొత్తం 16 పోస్టులకు ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసి, దరఖాస్తులు ఆహ్వానించారు. మొత్తం పోస్టులకు గాను 904 దరఖాస్తులు వచ్చాయి.ఈ సందర్భంగా ఆదివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఆరు రకాల పోస్టులు డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్, ప్రొటెక్షన్ ఆఫీసర్లు 2 లీగల్ ఆఫీసర్, కౌన్సిలర్, సోషల్ వర్కర్ కోసం ఇంటర్వ్యూలు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా నిర్వహించారు. విద్యార్హత,పని అనుభవం తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు.మిగతా 10 రకాల పోస్టులకు సోమ, మంగళవారాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీ రాజం తెలిపారు.



# కోట్‌పల్లి ప్రాజెక్టులో పర్యాటకుల సందడి

**ధారూరు, జూన్ 15 :** ధారూరు మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టులో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం వారంతపు సెలవు కావడంతో ధారూరు మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టుకు పర్యాటకులు భారీగా తరలివచ్చారు. ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేసేందుకు పర్యాటకులు ఆసక్తి చూపారు. మండల నలుమూలల నుంచే కాకుండా జిల్లా చుట్టుప్రక్కల ప్రాంతాల వారు, వేరే ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చి బోటింగ్ చేశారు. ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేస్తూ సరదాగా గడిపారు. సెలవు దినం కావడంతో కుటుంబ సమేతంగా తరలివచ్చి కోట్ పల్లి ప్రాజెక్టు నీటిలో సరదాగా గడిపారు. బోటింగ్ అనంతరం ప్రాజెక్టు అందాలను తిలకించారు. సాయంకాలం పర్యాటకులు తమ తమ గమ్యాలకు తిరిగి వెళ్లారు.

# డిజిఎం (పర్సనల్)గా బాధ్యతలు చేపట్టిన అరవిందరావు



**యైటింక్లయిన్ కాలనీ జూన్ 15 (జనంసాక్షి):** శ్రీరాంపూర్ ఏరియాలో డీజీఎం (పర్సనల్) గా విధులు నిర్వహించి ఆర్జీ-2 ఏరియా పర్సనల్ విభాగం డిజిఎం (పర్సనల్) అండ్ అధికార ప్రతినిధిగా పుప్పాల అరవింద రావు భాధ్యతలు స్వీకరించారు. ఆనంతరం డీజీఎంని పర్సనల్ విభాగం ఉద్యోగులు ఘనంగా శాలువాలతో సన్మానించి జ్ఞాపిక అందజేసి స్వాగతం పలికారు. ఆయన ముందుగా సిబ్బందిని పరిచయం చేసుకొని ఏరియాలో ఉన్న విషయాలు, ఉద్యోగుల సంక్షేమము, క్వార్టర్లు తదితర విషయాలు తెలుసుకొని ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమములో డివైపిఎంలు వంశీధర్, సిబ్బంది చిప్ప సత్యనారాయణ, నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సంజీవ్, రాజగోపాల్ రెడ్డి, మౌనిక, మమతా, సమత, దేవేందర్, సతీష్, దేవరెడ్డి పాల్గొన్నారు.






# విద్యుత్ ప్రమాదంలో గాయపడిన వారిని పరామర్శ

**కోరుట్ల బ్యూరో జూన్15 (జనం సాక్షి):** మృత దేహాలను సందర్శించిన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి .జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ కోరుట్ల పట్టణ మెట్పల్లి రోడ్డులో గల బాలాజీ వినాయక విగ్రహాల తయారీ కేంద్రంలో ఆదివారం విద్యుత్ ప్రమాదం సంభవించింది భారీ వినాయక విగ్రహాలను ఒక చోటి నుండి మరో చోటికి తరలిస్తుండగా 33 కెవి విద్యుత్ వైర్లు తాగడంతో ప్రమాదం సంభవించింది ఇట్టి ప్రమాదంలో 9 మంది గాయపడగా వారిని హుటా హుటిన కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అందులో నలుగురి పరిస్థితి విషమంగా ఉండడంతో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా ఇద్దరు మృతి చెందారు మరో ఇద్దరి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు ఇట్టి మృతదేహాలను గాయపడిన వారిని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు మాజీమంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ తో కలిసి మృతదేహాలను సందర్శించి అనంతరం గాయపడిన వారిని పరామర్శించారు మృతుల కుటుంబాలకు 5 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రభుత్వం ద్వారా ప్రకటించారు.

# పేదల భూములు గుంజుకోవడం తగదు

**మొయినాబాద్:** దశాబ్ద కాలం నుంచి భూమిని సాగు చేసుకుని బతుకుతున్న బడుగు బలహీన వర్గాల ప్రజల భూములను రేవంత్ రెడ్డి సర్కార్ అక్రమంగా గుంజుకోవడం అన్యాయమని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం అన్నారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఎనికెపల్లి గ్రామ రెవెన్యూలోని 180 సర్వే నెంబర్‌లో గల 100 ఎకరాల భూమిని 50 మంది బడుగు బలహీన వర్గాల పేదలు సాగు చేసుకుంటున్న భూమిని సర్కార్ అక్రమంగా గుంజుకోవడాన్ని నిరసిస్తూ ఆదివారం ఆయన భూ బాధితులను కలిశారు. భూములకు సంబంధించిన వివరాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1954 నుంచి రైతులు భూమిని సాగు చేసుకుంటూ భూమిశిస్తూ కడుతూ వచ్చారని గుర్తు చేశారు.

# దివ్యాంగుల సమస్యలు పరిష్కరించండి

- రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు వినతీపత్రం..
- వికాలాంగుల నెట్‌వర్క్ అసెంబ్లీ ఇంచార్జీ పైడిపల్లి శ్రీనివాస్‌గౌడ్



**గోదావరిఖని, జనంసాక్షి :** రామగుండం అసెంబ్లీ నియోజకవర్గం లో దివ్యాంగులు చాలా దుర్భర జీవితం గడుపుతున్నారని వారిని రాష్ట్ర ప్రభుత్వం పక్షాన తమరు చొరవ తీసుకొని దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వికలాంగుల నెట్ వర్క్ రామగుండం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి పైడిపల్లి శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గోదావరిఖనికి మొదటిసారిగా మంత్రి హోదాలో వచ్చిన సందర్భంగా ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా ఈ ప్రాంతంలో ప్రతి పబ్లిక్ ప్రైవేట్ సెక్టారులో..ప్రభుత్వ శాఖలలో 5 శాతం ఉద్యోగాలు ఖచ్చితంగా భర్తీ చేసేలా చర్య తీసుకోవాలని ఆయన కోరారు.అదేవిధంగా అర్హత గల ప్రతి దివ్యాంగుల కుటుంబాని కి అంత్యోదయ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం జి.వో. పాస్ చేసిందని కాని అది ఎక్కడ అమలు కావడం లేదని ఆయన పేర్కొన్నారు.

దీనిపైన చర్య తీసుకొని తక్షణమే దివ్యాంగుల కుటుంబాలకు అంత్యోదయ కార్డులు ఇప్పించగలరని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా రాజీవ్ యువ వికాసం..ఇందిరమ్మ ఇండ్లలో ప్రభుత్వం ఇచ్చే 5శాతం రిజర్వేషన్ గాక సానుభూతి ఆలోచించి ఇంక ఎక్కువ మందికి లభించే లబ్ది జరిగేలా చర్య తీసుకోగలరని..ప్రతి పబ్లిక్ ప్రైవేట్ ప్రభుత్వ శాఖల్లో ఖచ్చితంగా దివ్యాంగుల కు సంబంధించిన కార్యాలయాలు క్రింది ఫ్లోర్లోనే ఉండేలా..వాటికి రాంపులు ఉండేలా ప్రభుత్వ శాఖలను ఆదేశించగలరని ఆయన మంత్రికి ఇచ్చిన వినతి పత్రంలో కోరారు.అదేవిధంగా సదరన్ సర్టిఫికెట్ కలిగియుండి, అర్హత ఉన్న ప్రతి దివ్యాంగుడికి కొత్త పెన్షన్స్ మంజూరు చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా స్థానిక సంస్థల ఎన్నికలలో దివ్యాంగులకు తమిళనాడు రాష్ట్రంలో లాగ 5శాతం రిజర్వేషన్ కల్పించి వికలాంగులకు న్యాయం చేయగలరని ఆయన విజ్ఞప్తి చేశారు.



# సురేష్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి

- 40 మంది దాడి చేస్తే.. ఆరుగురిపై కేసులా..
- మోర్తాడ్ ఎస్ఐ తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

**ఆర్మూర్ జూన్ 15 (జనంసాక్షి):** ఆర్మూర్ పట్టణంలోని శ్రీరామ హాస్పిటల్‌లో మోర్తాడ్ మండల కేంద్రానికి చెందిన ఒక వర్గం వారు దాడి చేసి తీవ్రంగా గాయాల పాలైన రొయ్యల సురేష్ ను ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఆదివారం పరామర్శించారు.దాడి జరిగిన ఘటనను బాధితుడుని,వారి కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం మోర్తాడ్ ఎస్సైతో చరవాణిలో మాట్లాడారు.ఒక వర్గం వారు 40 మంది దాడి చేస్తే, కేవలం ఆరుగురిపై నామమాత్రపు కేసులు పెట్టడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. సురేష్‌కు మద్దతుగా గ్రామస్తులు ర్యాలీ తీస్తామంటే కేసులు పెడతానని బెదిరించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు.హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా పోలీసులు ప్రవర్తిస్తున్నారని మండి పడ్డారు,ఈ ఘటనపై డిజిపికి ఫిర్యాదు చేస్తానని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి హెచ్చరించారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడో విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం



**గంభీరావుపేట జూన్ 15 (జనం సాక్షి):** మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలంగాణ ఉన్నత విద్యా మండలి ద్వారా డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాలు కల్పించే దోస్త్ , డిగ్రీ ఆన్లైన్ సర్వీస్ తెలంగాణ మూడవ విడత అడ్మిషన్ల ప్రక్రియ 13 జూన్ నుండి ప్రారంభమై ఒదని, అలాగే రెండో విడతలు అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఆన్లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకోవాలని ప్రిన్సిపాల్, విజయలక్ష్మి తెలిపారు. దోస్త్ నమోదు ప్రక్రియలో విద్యార్థు లకు ఏమైనా సాంకేతిక ఇబ్బందులు కలిగితే కళాశాలకు వచ్చి హెల్ప్ లైన్ సెంటర్లో పరిష్కారం పొందగలరని, కళాశాలలో దోస్త్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉచితంగా చేయబడుతు ందని తెలిపారు. డిగ్రీ కళాశాలలో సీట్ల భర్తీ కొరకు మూడవ విడతలో భాగంగా జూన్ 13వ తేదీ నుండి రిజిస్ట్రేషన్ ప్రారంభమైందని,చివరి తేదీ ఈ నెల 19న నిర్ధారించడం జరిగిందని, అలాగే ఈనెల 30వ తేదీ నుండి మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభ మవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మరియు నాన్ టీచింగ్ బృందం పాల్గొన్నారు.

# సింగరేణిలో మొట్టమొదటిసారిగా మహిళా రెస్క్యూ సభ్యులకు శిక్షణ

- ఆర్జీ-2 రెస్క్యూ స్టేషన్‌లో ప్రారంభమైన చారిత్రాత్మక కార్యక్రమం
- సింగరేణి రెస్క్యూ జీఎం కాంరెడ్డి శ్రీనివాస్ రెడ్డి



**యైటింక్లయిన్ కాలనీ జూన్ 15 (జనంసాక్షి):** సింగరేణి ఆర్జీ - 2 ఏరియా: సింగరేణి సంస్థ మహిళా ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంపొందించేందుకు చారిత్రాత్మకమైన ముందడుగు వేసింది. సంస్థ చరిత్రలో మొట్టమొదటిసారిగా ఆర్జీ-2 ఏరియా రెస్క్యూ స్టేషన్‌లో సింగరేణిలో పని చేస్తున్న మహిళా అండర్ మేనేజర్ ఉద్యోగులకు ఇనిషియల్ రెస్క్యూ శిక్షణ ఘనంగా ప్రారంభమైంది. ఈ శిక్షణకు ఆర్జీ 1, 2, శ్రీరాం పూర్, భూపాలపల్లి, కొత్తగూడెం ఏరియాలలో పని చేస్తున్న 13 మంది మేనేజ్మెంట్ ట్రైనీ (మైనింగ్) మహిళా అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రెస్క్యూ జీఎం కాంరెడ్డి శ్రీనివాస రెడ్డి, ఆర్జీ రీజియన్ జీఎం (సేఫ్టీ) సుంకర మధుసూదన్, రెస్క్యూ సూపరింటెండెంట్ రాజేందర్ రెడ్డి, డీజీఎం క్వాలిటీ ఆర్జీ-3 బి.సత్యనారాయణలు హాజరై శిక్షణార్థులకు ప్రేరణనిచ్చారు. సింగరేణి సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం ఈ శిక్షణకు అనుమతులు ఇచ్చి, శిక్షణ ద్వారా మహిళా ఉద్యోగులు అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో స్పందించే నైపుణ్యం కలిగి ఉండేందుకు ఈ శిక్షణ ఎంతగానో దోహదం చేస్తుందని రెస్క్యూ జీఎం పేర్కొన్నారు. మహిళల వినియోగ సామర్థ్యం అభివృద్ధికి, ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఆనంతరం జీఎం (సేఫ్టీ) ఆర్జీ రీజియన్ ఎస్. మధుసూదన్ మాట్లాడుతూ.. సంస్థలో మహిళా ఉద్యోగులు పెరుగుతున్న దృష్ట్యా, మహిళా ఉద్యోగుల నైపుణ్యాలను రెస్క్యూ విభాగంలో వినియోగించడం ఈ శిక్షణ ద్వారా ఎమర్జెన్సీ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోగలిగే నైపుణ్యం పొందతారని అన్నారు. మహిళ ఉద్యోగులకు 14 రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని రెస్క్యూ సూపరింటెండెంట్ రాజేందర్ రెడ్డి తెలిపారు. ఈ శిక్షణలో వారికి మైనింగ్ థియరీ, గ్యాసెస్, గ్యాస్ డిటెక్టర్స్, ఫస్ట్ ఎయిడ్, రెస్క్యూ రికవరీ, ఫైర్ ఫైటింగ్, ఫైర్ ఎక్సిస్టెన్స్ స్పెషలైజెడ్ ఎక్విప్మెంట్స్ తదితర విషయాల పైన శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ తిరుపతి, ట్రైనర్స్ కిషన్ రావు, సాజిద్ అలీ, వేణు, సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



**పెద్దపల్లి, జూన్ 15 (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని (ఆర్ఆర్) గార్డెన్స్‌లో ఆదివారం రోజున తెలంగాణ స్టేట్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐజేయు అనుబంధం) పెద్దపల్లి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడో మహాసభ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పెద్దపల్లి శాసనసభ్యులు. చింతకుంట విజయరమణారావు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి జర్నలిస్ట్ సోదరులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఒకే బంతికి మూడు రనౌట్లు మిస్!

- తమిళనాడు ప్రీమియర్ లీగ్‌లో అశ్విన్ టీమ్ ఫీల్డింగ్ ఫియాస్కో..

క్రికెట్‌లో గెలుపు కోసం బ్యాటింగ్, బౌలింగ్‌తో పాటు ఫీల్డింగ్ కూడా కీలక పాత్ర పోషిస్తుంది. అద్భుతమైన క్యాచ్‌లు, రనౌట్లు, రిటర్న్ క్యాచ్‌లతో ఫీల్డింగ్ మ్యాచ్‌ల ఫలితాలను మార్చేస్తుంది. అంతర్జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఫీల్డింగ్ ప్రమాణాలు గణనీయంగా పెరిగాయి. అయితే, తమిళనాడు ప్రీమియర్ లీగ్ మాత్రం దారుణమైన ఫీల్డింగ్‌తో వార్తల్లో నిలిచింది. రవిచంద్రన్ అశ్విన్ సారథ్యంలోని దిండిగల్ డ్రాగన్స్ జట్టు ఫీల్డర్లు ఒకే బంతికి మూడుసార్లు రనౌట్ అవకాశాలను చేజార్చుకుని అందరినీ ఆశ్చర్యపరిచారు. తమిళనాడు ప్రీమియర్ లీగ్ తక్కువ సమయంలోనే బాగా పాపులర్ అయింది. స్థానిక టాలెంట్‌ను ప్రోత్సహించడం, టీమిండియాకు ఆటగాళ్లను సిద్ధం చేయడం ఈ టోర్నమెంట్ లక్ష్యం. అశ్విన్‌తో పాటు ఇతర భారత స్టార్ ఆటగాళ్లు పాల్గొనడంతో ఈ లీగ్‌కు మంచి క్రేజ్ వచ్చింది. అయితే, సియాచెమ్ మధురై పాంథర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో దిండిగల్ డ్రాగన్స్ ఫీల్డర్లు చేసిన ఫీల్డింగ్ గందరగోళం అందరినీ నివ్వెరపరిచింది.

**ఒకే బంతికి మూడు ఓవర్‌త్రోలు!**

మధురై పాంథర్స్ ఇన్నింగ్స్ 20వ ఓవర్‌లో ఈ హాస్యాస్పద ఘటన చోటుచేసుకుంది. బ్యాటర్ కొట్టిన బంతి కవర్ ఫీల్డర్ దగ్గరకు వెళ్లగా, అక్కడ ఫీల్డింగ్ చేస్తున్న అశ్విన్ బంతిని నాన్-స్ట్రయికర్ ఎండ్ వైపు విసిరాడు. కానీ బౌలర్, బ్యాకప్ ఫీల్డర్ ఎవరూ బంతిని అందుకోలేకపోయారు. దీంతో బ్యాటర్లు అదనంగా ఒక పరుగు తీశారు. ఆ తర్వాత బంతిని అందుకున్న మరో ఫీల్డర్ డైరెక్ట్ త్రో చేయడానికి ప్రయత్నించాడు, కానీ ఈసారి కూడా బంతిని ఎవరూ పట్టుకోలేదు, మరో ఓవర్‌త్రో జరిగింది. ఫలితంగా బ్యాటర్లు మరో పరుగు తీశారు. ఇలా ఒకే బంతికి మూడు రనౌట్ అవకాశాలు వృథా కావడం అందరినీ నవ్వించింది. ఈ ఘటన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నెటిజన్లు ఈ ఫీల్డింగ్‌ను చూసి, "ఇది ప్రొఫెషనల్ క్రికెట్‌లా లేదు, వెళ్లి గల్లీ క్రికెట్ ఆడుకోండి" అంటూ ఫన్నీ కామెంట్లు చేశారు. ఈ ఘటన టిఎన్‌పిఎల్‌లో ఫీల్డింగ్ ప్రమాణాలపై చర్చకు దారితీసింది.

## సర్ఫరాజ్ దెబ్బకు

# సెలెక్టర్లకు సవాల్



## సర్ఫరాజ్ ఖాన్ మెరుపు సెంచరీ..

ఇంగ్లండ్ పర్యటనకు ముందు జరిగిన ఇంట్రా స్క్వాడ్ సన్నాహక మ్యాచ్‌లో భారత జట్టు ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఒక్క వికెట్ కూడా తీయలేక దారుణంగా విఫలమయ్యాడు. అయితే, టాప్ ఆర్డర్ బ్యాటర్లు మాత్రం రాణించారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్ అర్ధసెంచరీలతో ఫామ్‌లో ఉన్నారని చాటారు. ఇండియా ఏ తరఫున ఆడిన సర్ఫరాజ్ ఖాన్ విధ్వంసక సెంచరీతో అదరగొట్టాడు. ఇంగ్లండ్ పర్యటనకు ఎంపిక కాకపోవడంతో కసితో ఆడినట్లు కనిపించిన సర్ఫరాజ్, 76 బంతుల్లో 15 ఫోర్లు, 2 సిక్సర్లతో సెంచరీ పూర్తి చేశాడు. దీంతో ఇండియా ఏ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 2 వికెట్ల నష్టానికి 299 పరుగులు చేసింది, అయితే ప్రధాన జట్టు స్కోరు కంటే 160 పరుగుల వెనుకబడి ఉంది.

బెకెన్‌హమ్‌లోని కౌంటీ క్రికెట్ మైదానంలో జరిగిన ఈ ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్‌లో శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని సీనియర్ జట్టుతో ఇండియా ఏ తలపడింది. సర్ఫరాజ్ ఖాన్ 101 పరుగులతో జట్టును బలమైన స్థితిలో నిలిపాడు. ఇంగ్లండ్ పిచ్‌లపై ఆడలేడన్న సందేహాలను తన మెరుపు బ్యాటింగ్‌తో పటాపంచలు చేసిన సర్ఫరాజ్, సెలెక్టర్లకు సవాల్ విసిరాడు. గతేడాది స్వదేశంలో ఇంగ్లండ్‌పై అరంగేట్రం చేసిన ఈ రంజీ స్టార్, బెంగళూరులో న్యూజిలాండ్‌పై 150 పరుగులతో చెలరేగిన విషయం తెలిసిందే. ప్రధాన పేసర్లలో బుమ్రాకు ఒక్క వికెట్ కూడా దక్కలేదు. మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ తలో రెండు వికెట్లు తీసినప్పటికీ, భారీగా పరుగులు సమర్పించుకున్నారు. నితీశ్ కుమార్ అభిమన్యు ఈశ్వరన్ (39)ను పెవిలియన్‌కు పంపాడు.

# గిల్‌పై నమ్మకం లేదా?

కొత్త కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తన కెరీర్‌లో అతిపెద్ద సవాల్‌కు సిద్ధమవుతున్నాడు. ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్ అతడి తొలి కెప్టెన్సీ అసైన్‌మెంట్. బ్యాటర్‌గా రాణిస్తూనే, సారథిగా జట్టుపై తనదైన ముద్ర వేయాలని గిల్ భావిస్తున్నాడు. నెట్స్‌లో తీవ్ర సాధన చేస్తూ, టీమ్ మేనేజ్‌మెంట్‌తో కలిసి వ్యూహాలు రచిస్తున్నాడు. అయితే, హెడ్ కోచ్ గంభీర్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగర్కర్ నుంచి గిల్‌కు పూర్తి మద్దతు లేనట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గిల్ మాట్లాడుతూ, "గంభీర్, అగర్కర్‌తో నా కెప్టెన్సీ గురించి చర్చించాను. లీడర్‌గా నేను చేయగలిగినది చేయాలని సూచించారు. నా కెప్టెన్సీపై వారికి అంచనాలు లేవని చెప్పారు. నేను చేయలేనిది చేయాలని వారు భావించడం లేదు. అందుకే నాపై ఒత్తిడి, అంచనాలు లేవు. అయినప్పటికీ, కెప్టెన్‌గా నాకు నా స్వంత అంచనాలున్నాయి" అని పేర్కొన్నాడు.

గిల్ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గంభీర్, అగర్కర్‌కు గిల్ సామర్థ్యంపై నమ్మకం లేదా అని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. కెప్టెన్‌పై అంచనాలు లేకపోవడం, గెలుపోటముల బాధ్యత ఎవరిదని నిలదీస్తున్నారు. నమ్మకం లేకపోతే సారథ్యం ఎందుకు అప్పగించారని కామెంట్లు చేస్తున్నారు.



# శ్రీలంక మాజీ కెప్టెన్

## మాథ్యూస్ రిటైర్మెంట్ ప్రకటన

శ్రీలంక మాజీ కెప్టెన్, ఆల్‌రౌండర్ ఏంజెలో మాథ్యూస్ టెస్ట్ క్రికెట్‌కు త్వరలో వీడ్కోలు పలకనున్నాడు. బంగ్లాదేశ్‌తో జరిగే తొలి టెస్ట్ అతడి చివరి మ్యాచ్ కానుంది. రిటైర్మెంట్ ప్రకటించిన మాథ్యూస్, తన కెరియర్‌లోని ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. కెప్టెన్సీ సమయంలో తీవ్ర ఒత్తిడి కారణంగా తన జుట్టు ఎక్కువగా ఊడిపోయిందని, జట్టును నడిపించడం సవాల్‌తో కూడిన ప్రయాణమని చెప్పాడు. "దేశానికి ఆడటం ఒక రకం, కెప్టెన్సీ మరో రకం. అదనపు బాధ్యతలు, అందరి దృష్టి మన పైనే ఉంటుంది. గెలిచినా, ఓడినా మనం ఏం చెబుతామని కోట్లాది మంది ఎదురుచూస్తారు. అయినా, ఆ సవాళ్లను ఆస్వాదించాను" అని మాథ్యూస్ తెలిపాడు.

2013లో 25 ఏళ్ల వయసులో టెస్ట్ కెప్టెన్‌గా నియమితుడైన మాథ్యూస్, శ్రీలంక చరిత్రలో అత్యంత పిన్నవయస్కుడైన సారథిగా రికార్డు సృష్టించాడు. అతడి నాయకత్వంలో శ్రీలంక 2014లో ఇంగ్లండ్‌లో టెస్ట్ సిరీస్ గెలిచింది. వన్డే, టీ20 ఫార్మాట్లలో కూడా కెప్టెన్‌గా సేవలందించిన అతడు, 2017లో జింబాబ్వే చేతిలో వన్డే సిరీస్ ఓటమి తర్వాత కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడు. జూన్ 17న గాలేలో జరిగే మ్యాచ్ అతడి 119వ టెస్ట్ కానుంది, ఇందులో 34 మ్యాచ్‌లకు సారథిగా వ్యవహరించాడు. టెస్టుల్లో 8,167 రన్స్‌తో శ్రీలంక తరఫున మూడో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా మాథ్యూస్ నిలిచాడు. 16 సెంచరీలు, 200 నాటౌట్ అతడి అత్యధిక స్కోరు. బౌలింగ్‌లో 33 వికెట్లు తీసిన ఈ వెటరన్ ఆల్‌రౌండర్ శ్రీలంక క్రికెట్‌లో లెజెండ్‌గా మిగిలిపోనున్నాడు.

# టీమిండియాకు ఆరో ఓటమి!



యూరప్‌లో జరుగుతున్న హాకీ ప్రో లీగ్‌లో భారత పురుషుల హాకీ జట్టు ఆరో ఓటమిని చవిచూసింది. నెదర్లాండ్స్, అర్జెంటీనా చేతిలో ఓడిన టీమిండియా, ఆస్ట్రేలియాతో జరిగిన వరుసగా రెండో మ్యాచ్‌లోనూ 2-3 స్కోరుతో పరాజయం పాలైంది. శనివారం జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ సేన విజయం సాధించే అవకాశాన్ని కోల్పోయింది. మ్యాచ్ ఆరంభంలో డిఫెండర్ సంజయ్ రానా 3వ నిమిషంలో పెనాల్టీ కార్నర్ ద్వారా గోల్ చేసి భారత్‌కు ఆధిక్యం అందించాడు. అయితే, ఆస్ట్రేలియా ఆటగాళ్లు టిమ్ బ్రాండ్ (4వ నిమిషం), బ్లేక్ గోవర్స్ (5వ నిమిషం) గోల్స్‌తో ఆధిక్యం తీసుకున్నారు. 36వ నిమిషంలో దిల్‌ప్రీత్ సింగ్ గోల్ చేసి స్కోరును 2-2తో సమం చేశాడు. అయితే, అదే నిమిషంలో ఆస్ట్రేలియా ఆటగాడు కూపర్ బర్న్స్ గోల్‌తో జట్టును 3-2తో ముందంజలో నిలిపాడు. 27వ నిమిషంలో లభించిన రెండు పెనాల్టీ కార్నర్లను హర్మన్‌ప్రీత్ బృందం సద్వినియోగం చేసుకోలేకపోయింది. 400వ మ్యాచ్ ఆడిన మాజీ కెప్టెన్ మన్‌ప్రీత్ సింగ్ నిరాశపరిచాడు. మ్యాచ్ ముగిసే 10 నిమిషాల ముందు ఆస్ట్రేలియా సాధించిన రెండు పెనాల్టీ కార్నర్లను గోల్ కీపర్ పాఠక్ అడ్డుకున్నప్పటికీ, ఒక పాయింట్ తేడాతో భారత్ ఓటమిపాలైంది. వరుసగా ఆరు ఓటములతో కుంగిపోయిన టీమిండియా జూన్ 21న బెల్జియంతో తలపడనుంది.

# ఆసీస్ ఓటమిపై జాన్సన్ ఆగ్రహం



ప్రతిష్ఠాత్మక వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌లో ఆస్ట్రేలియా దక్షిణాఫ్రికా చేతిలో ఐదు వికెట్ల తేడాతో ఓటమి చవిచూసింది. వరుసగా రెండోసారి డబ్ల్యూటీసీ టైటిల్‌ను సాధించాలన్న ఆసీస్ ఆశలు భగ్నమయ్యాయి. ఈ ఓటమిపై ఆస్ట్రేలియా మాజీ పేసర్ మిచెల్ జాన్సన్ తీవ్ర విమర్శలు చేశాడు. జట్టు ప్రయోజనాల కంటే ఐపీఎల్‌కు ఆటగాళ్లు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని ఆరోపించాడు. మిచెల్ స్టార్క్, హేజిల్‌వుడ్, పాట్ కమిన్స్, నాథన్ లైయన్‌లతో కూడిన ఆసీస్ బౌలింగ్ 'బిగ్ ఫోర్' ఘోరంగా విఫలమైందని జాన్సన్ విమర్శించాడు. ముఖ్యంగా హేజిల్‌వుడ్‌పై తీవ్ర స్థాయిలో మండిపడ్డాడు. "హేజిల్‌వుడ్ ఫిట్‌నెస్‌పై ఇటీవల ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అతడు జాతీయ జట్టు కంటే ఐపీఎల్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాడు. వాయిదా పడిన ఐపీఎల్ పునఃప్రారంభమైనప్పుడు తిరిగి ఆడటానికి వెళ్లిన అతడి నిర్ణయం నన్ను ఆశ్చర్యపరిచింది. నాథన్ లైయన్ కూడా వికెట్లు తీయడంలో విఫలమయ్యాడు" అని జాన్సన్ వ్యాఖ్యానించాడు. ఈ విజయంతో దక్షిణాఫ్రికా 27 ఏళ్ల తర్వాత తొలిసారి ఐసీసీ టైటిల్‌ను సొంతం చేసుకుంది.



# గిల్ ఎక్కడ మెరుగవ్వాలి?

## సౌరవ్ గంగూలీ సూచనలు

ఇంగ్లండ్‌తో జరగనున్న ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌కు టీమ్ ఇండియా సన్నద్ధమవుతోంది. సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అయిన నేపథ్యంలో, కొత్త కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సారథ్యంలో ఈ సిరీస్‌పై ఆసక్తి నెలకొంది. ఈ సందర్భంలో మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ గిల్ సామర్థ్యాలపై విశ్వాసం వ్యక్తం చేస్తూ, కొన్ని కీలక సూచనలు చేశాడు.

గంగూలీ తన కెప్టెన్సీ హయాంలో అనేక మంది యువ ఆటగాళ్లను ప్రోత్సహించిన విషయం తెలిసిందే. గిల్ టెస్టుల్లో రాణిస్తాడని నమ్మకం వ్యక్తం చేసిన దాదా, అతడు సాంకేతికంగా మెరుగవ్వాలని సూచించాడు. "గిల్ టాప్ ఆర్డర్ బ్యాటర్‌గా రాణిస్తాడు. అయితే, విరాట్, రోహిత్, రహానె లేని టీమ్ ఇండియాలో పరిస్థితులు మారాయి. ఇంగ్లండ్‌లో స్వింగ్, సీమ్ ఉండే పిచ్‌లపై ఎక్కువ పరుగులు సాధించాలి. కొత్త బంతితో ఆడటం కష్టమే. 100/2 లేదా 20/4 వంటి పరిస్థితుల్లో బ్యాటింగ్ సవాల్‌గా ఉంటుంది. సరైన డిఫెన్స్, ఆఫ్ స్టంప్ ఆవల పడే బంతులను వదిలేయడం నేర్చుకో వాలి" అని గంగూలీ సలహా ఇచ్చాడు. ఇంగ్లండ్ పిచ్‌లపై ఫ్రంట్ ఫుట్ అప్రోచ్‌ను మెరుగు పరచుకోవాలని, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా పిచ్‌లకు పనిచేసే బ్యాక్ ఫుట్ ఆటతీరు ఇక్కడ వర్కవుట్ కాదని వివరించాడు. ఈ సిరీస్ జూన్ 20 నుంచి లీడ్స్‌లో ప్రారంభం కానుంది.

## ఐదేళ్లలో 6 ఐసీసీ టోర్నమెంట్లు..

# మూడు భారత్‌లోనే!

ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) క్రికెట్ అభిమానుల కోసం ఎప్పటికప్పుడు బిజీ షెడ్యూల్‌ను రూపొందిస్తోంది. భారీ టోర్నమెంట్లతో అభిమానులకు వినోదాన్ని అందిస్తూ, ఐసీసీ ఈవెంట్ల సంఖ్య గతంలో కంటే గణనీయంగా పెరిగింది. దాదాపు ప్రతి ఏటా ఏదో ఒక ఐసీసీ టోర్నమెంట్ జరుగుతోంది. గత రెండేళ్లలో వన్డే వరల్డ్ కప్-2023, టీ20 ప్రపంచ కప్-2024, చాంపియన్స్ ట్రోఫీ-2025, వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్-2025 నిర్వహించిన ఐసీసీ, రాబోయే ఐదేళ్లలో ఆరు మేజర్ టోర్నమెంట్లను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. 2026లో టీ20 ప్రపంచ కప్ భారత్, శ్రీలంక సంయుక్త ఆతిథ్యంలో జరగనుంది. ఈ ఏడాది జరిగే ఏకైక ఐసీసీ టోర్నమెంట్ ఇదే. 2027లో రెండు ఐసీసీ ఈవెంట్లు ఉంటాయి. వన్డే వరల్డ్ కప్-2027ను సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా నిర్వహిస్తాయి. అదే ఏడాది వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్ ఇంగ్లండ్‌లోని లార్డ్స్ వేదికగా జరుగుతుంది. 2028లో టీ20 ప్రపంచ కప్‌ను ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ సంయుక్తంగా నిర్వహిస్తాయి. 2029లో భారత్ వేదికగా చాంపియన్స్ ట్రోఫీ జరగనుంది, అదే ఏడాది ఆరంభంలో వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్ కూడా ఉంటుంది. 2030లో టీ20 ప్రపంచ కప్‌కు ఇంగ్లండ్, ఐర్లాండ్, స్కాట్లాండ్ సంయుక్త ఆతిథ్యం ఇవ్వనున్నాయి. 2031లో వన్డే వరల్డ్ కప్‌ను భారత్, బంగ్లాదేశ్ సంయుక్తంగా నిర్వహిస్తాయి.



# దొడ్డి కొమురయ్య చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి

- దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన మాజీ జెడ్పీ చైర్మన్ తూల ఉమా



**ముస్తాబాద్ జూన్ 15 జనంసాక్షి :** తెలంగాణ తొలి పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్పించాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా చైర్పర్సన్ స్థూల ఉమా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ముస్తాబాద్ మండలం గూడెం గ్రామంలో ఆదివారం కురుమ సామాజిక వర్గం వారు నిర్మించిన తెలంగాణ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య విగ్రహాన్ని స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కురుమ సామాజిక వర్గంతో పాటు వెనుకబడిన అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు సాగాలని విద్యా రాజకీయ సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందు నిలవాలన్నారు కురుమ సామాజిక వర్గం పిల్లలు చదువులతో పాటు రాజకీయ రాజకీయాల్లో సామాజిక కార్యక్రమాల్లో రాణించాల ని సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని గ్రామంలో ఏర్పాటు చేయడం పట్ల కురుమ సామాజిక వర్గ సభ్యులను అభినందించారు ఆయన స్ఫూర్తితో ఆయన ఆశ ఆశయాలను నేటి యువత ఆచరించాలని సమాజంలో ఉన్నతంగా ఎదగాలని కోరారు దొడ్డి కొమురయ్య పోరాట యోధుని విగ్రహాన్ని ప్రభుత్వము ట్యాంకు బండిపై ఏర్పాటు చేసి ఆయన వేడుకలు అధికారికంగా నిర్వహించాలన్నారు తెలంగాణ పోరాట యోధుల చరిత్రను ఆయన విగ్రహాలను తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేయడం వల్లే నేటి సమాజం వారిని గుర్తిస్తుందని వారి వేడుకలను నిర్వహిస్తుందని తెలిపారు ఆయన విగ్రహాన్ని ట్యాంక్ బండి పై ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు ఆయన చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చి ముందు తరాలకు ఆయన చరిత్రను తెలిసేలా ప్రభుత్వం వేడుకలు జరపాలని కోరారు ఈ కార్యక్రమంలో శస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి నాయకులు కల్వకుంట్ల గోపాలరావు చక్రధర్ రెడ్డి కొమ్ము బాలయ్య బైక్ నవీన్ సామాజిక కార్యకర్త చిట్నేని వెంకటేశ్వరరావు చిట్యాల సిఐ దగ్గు మల్లేష్ కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఏనుగు కనకయ్య సంఘ నాయకులు దగ్గు చంద్రయ్య బదిలీ శ్రీనివాస్ నవీన్ బాలయ్య కిషన్ చందుర్తి బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మేకల ఎల్లయ్య అంజన్ రావు చాడా శ్రీనివాస్ గౌడ్ కొమ్ము బాలయ్య కోళ్ల పరిసరాలు మల్లేశం బైక్ నవీన్ వివిధ పార్టీల నాయకులు కురుమ సంఘం సభ్యులు పాల్గొన్నారు

# అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



**గంభీరావుపేట జూన్ 15 (జనం సాక్షి):** మండల కేంద్రంలో అప్పుల బాధతో రైతు వ్యవసాయ పొలంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు, అతని భార్య ఫిర్యాదు మేరకు, దుద్దెడు పద్మ భర్త శంకర్ గ్రామం గంభీరావుపేట.. నా భర్త శంకరు వ్యవసాయం చేసుకుంటూ జీవించేవాడు. నాకు ముగ్గురు కుమారులు.. ఒక కుమారుడికి ఇటీవలే పెళ్లి అయింది.. పెళ్లికి కొంత అప్పు కూడా అయిింది. దీనికి తోడు వరి పంట బాగా పండలేదు.. నా భర్త పట్టుకున్న మామిడి తోట నష్టం వచ్చింది. నా భర్తకు ఆరోగ్యం కూడా సహకరించడం లేదు. ఎప్పటికీ ఇదే తలుచుకుంటూ ఉండేవాడు. నిన్న అనగా శనివారం సాయంత్రం ఇంటి నుండి వెళ్ళాడు.. ఈరోజు ఉదయం వ్యవసాయ పొలం వద్ద ఉరి వేసుకొని చనిపోయినట్టు మా బంధువులు ఫోన్ ద్వారా తెలిపారు. అక్కడికి వెళ్లి చూసేసరికి నా భర్త ఉరి వేసుకుని చనిపోయి ఉన్నాడు.. ఆరోగ్యం సహకరించక, చేసిన అప్పులు తీర్చలేక నా భర్త ఆత్మహత్య చేసుకున్నాడు.. నా భర్త మరణం పై ఎలాంటి అనుమానం లేదు.. అని ఫిర్యాదు పోలీసులకు ఫిర్యాదు చేయగా,కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ , ప్రేమానందం తెలిపారు,



తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. హైదరాబాద్ లోని ప్రజా భవనంలో పౌరసరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తంకుమార్ రెడ్డి తో కలిసి చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ మరియు మాజీ పార్లమెంట్ సభ్యులు మధు యాష్కీ గౌడ్ తదితరులు ఉన్నారు.
**చేవెళ్ల, జూన్ 15 (జనంసాక్షి)**

## సాంఘిక సంక్షేమ గురుకులాలలో

# తాత్కాలిక పోస్టుల భర్తీకి ఆహ్వానం

**ఇబ్రహీంపట్నం, (జనం సాక్షి) :** హైదరాబాద్, రంగారెడ్డి ,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లోని బాలుర/ బాలికల పాఠశాలలు/ కళాశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేస్తున్నట్లు జోన్ 6 - జోనల్ అధికారిణి శ్రీమతి కె. నిర్మల తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 19న సరూర్ నగర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల /కళాశాల నందు (మెట్రో పిల్లర్ నంబర్ 1570 నియర్ చైతన్యపురి మెట్రో స్టేషన్) రిజిస్ట్రేషన్, డెమోకు హాజరుకావాలి ఉదయం 8.00 గంటలకు రిజిస్ట్రేషన్ , మరియు 10.00 గంటల నుండి 5.00 గంటల వరకు సంబంధిత సబ్జెక్టులలో డెమో నిర్వహించనున్నారు. ఇంగ్లీష్, హిందీ ,గణితం ,ఫిజికల్ సైన్స్, బయోసైన్స్, సాంఘిక శాస్త్రం, లైబ్రేరియన్, హెల్త్ సూపర్వైజర్, ఫిజికల్ డైరెక్టర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ కళాశాలకు సంబంధించి గణితం, బోటనీ, జువాలజీ ,ఫిజిక్స్, కెమిస్ట్రీ ,ఎకనామిక్స్ ,సివిక్స్, కామర్స్ సబ్జెక్టులకు తేదీ 19.06. 2025 నాడు రిజిస్ట్రేషన్ మరియు డెమో ఉంటాయి ఆసక్తిగల అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్స్ తో పాల్గొనవచ్చు.

# బాసర గోదావరి నది వద్ద విషాదఛాయలు

- స్నానాలకు వెళ్లి ఐదుగురు గల్లంతు నలుగురు మృతి
- ఇంకొకరి కోసం నదిలో గాలింపు





బాసర, జూన్ 15 (జనం సాక్షి) పవిత్ర పుణ్యక్షేత్రమైన నిర్మల్ జిల్లాలోని బాసర గోదావరి నదిలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్నానాల కోసం హైదరాబాద్ ప్రాంతానికి చెందిన ఐదుగురు యువకులు నదిలో వెళ్లి గల్లంతయ్యారు. నలుగురు రాకేష్ (17), వినోద్ (18), రితిక్ (18), భరత్ లు చనిపోగా మరొకరి కోసం గజ ఈతగాళ్లు గాలింపు చర్యలు చేస్తున్నారు. వివరాల్లోకెళ్తే హైదరాబాద్ కు చెందిన 22 మంది కుటుంబ సభ్యులు పవిత్ర పుణ్యక్షేత్రం బాసర అమ్మవారి దర్శనానంతరం గోదావరి నదిలో స్నానానికి వెళ్లగా నదిలో లోతైన ప్రాంతం గమనించకుండా ఐదుగురు యువకులు నీటిలో దిగి గల్లంతయ్యారు. కుటుంబ సభ్యుల కళ్ళముందే ఈ ఘటన జరుగుతున్న ఏమి చేయలేని నిస్సయ స్థితిలో ఉండిపోయారు. ఘటన స్థలంలో యాత్రికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు హుటాహుటిన గజ ఈతగాళ్లతో నలుగురి మృతదేహాలను వెలికి తీయగా మరొక యువనికోసం నదిలో గాలింపు చర్యలు చేస్తున్నారు. మృతి చెందిన వారిని అంబులెన్స్ లో ఏరియా ఆసుపత్రికి తరలించారు. అంతకుముందు నీటిలో నుంచి గజ ఈతగాళ్లు శవాలను బయటికి తీయగా కుటుంబ సభ్యులు సిఆర్పి చేసి బ్రతికించుకోవడానికి కష్టపడుతున్న తీరు అక్కడున్న వారిని కంటతడి పెడుతుంది. ఏదేమైనాప్పటికీ వర్షాకాలం మొదట్లోనే ఇలాంటి ఘటనలు జరిగి వచ్చే భక్తులకు భయాందోళనలను కలిగింపజేస్తున్నాయని యాత్రికులు అంటున్నారు. చనిపోయిన వారందరూ ఒకే కుటుంబానికి చెందడంతో కుటుంబ సభ్యుల రోధనలు హృదయాలను కలిచివేస్తుంది.

# గత పాలకుల వల్లే విద్యావ్యవస్థ నిర్వీర్యం

- తెలంగాణ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం
- ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రిన్సిపాల్స్ అందరూ ఆంధ్రప్రాంతం వారే ఉన్నారు
- విద్యావిధానం జేబు దొంగల వ్యవహారంగా మారింది
- విద్యాప్రమాణాలు ఏ ఉన్నత విద్యా సంస్థలో పాటించడం లేదు
- ఇటీవల ఇన్స్పెక్షన్ లో వెలుగుచూసిన నిజాలు




హైదరాబాద్ (జనంసాక్షి) : గత పాలకుల వల్లే విద్యావ్యవస్థ నిర్వీర్యమయ్యాయని తెలంగాణ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం తెలిపారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో తెలంగాణ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రముఖ కవిర్, విమర్శకులు డా. సుంకిరెడ్డి నారాయణ రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ పురుషోత్తం మాట్లాడుతూ తెలంగాణలో విద్యావ్యవస్థ కుంటుపడింది. అందుకు కారణం గత పాలకుల వైఫల్యమే. మొత్తం విద్యావిధానం గాడి తప్పింది. ఇవాళ కార్పోరేట్ కళాశాలలు కేవలం వ్యాపార దృక్పథంతో మాత్రమే నడుపుతున్నాయి. దీంతో విద్యా ప్రమాణాలు పూర్తిగా తగ్గిపోయాయి. నడవని కాలేజ్ లకు ఫీజ్ రియాంబర్స్ మెంట్ ఇవ్వకూడదు. విద్యావైద్యం ఫ్రీగా అందించాలి. అప్పుడే విద్యావ్యవస్థ బాగుపడుతుంది. సోషల్ వెల్ఫేర్ పిల్లలే ఇవాళ నీట్ వంటి పోటీ పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించారు. నారాయణ, శ్రీచైతన్య విద్యాసంస్థలు విద్యావ్యవస్థను నాశనం చేస్తున్నాయి. వాళ్లు ఇచ్చే మార్కులు, ర్యాంకులు పిల్లల్ని విదేశాల్లో చిన్న చిన్న పనులు చేయడానికి పనికి రాకుండా చేస్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డికి విద్యావ్యవస్థను బాగుపరచాలనే సంకల్పం ఉంది. పౌరసమాజం కూడా భాగస్వాములు కావాలి. ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త ఆర్. వెంకట్ రెడ్డి...చరిత్ర పరిశోధకులు డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్, తెలంగాణ ఉద్యమకారిణి దేవకీదేవితో పాటు వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డా. పసునూరి రవీందర్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, ప్రవేట్ విద్యా సంస్థల ఉపాధ్యక్షుడు పల్లె వినయ్ కుమార్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఇరివెంటి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో లక్ష 93వేల కేసుల పరిష్కారం

హైదరాబాద్ (జనంసాక్షి) : జాతీయ లోక్ అదాలత్ లో రాష్ట్ర వ్యాప్తంగా నమోదైన కేసులలో లక్షా 93వేల పై చిలుకు కేసులు పరిష్కారమైనట్లు డీజీపీ జితేందర్ ఆదివారం ప్రకటనలో వెల్లడించారు. అందులో 6,294 కేసులు సైబర్ క్రైమ్ కి సబంధించినవిగా ఉన్నాయని వెల్లడించారు. దేశ వ్యాప్తంగా శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం జరగ్గా అందులో బాగాంగా రాష్ట్ర వ్యాప్తంగా నమోదైన కేసులకు సబంధించి స్థానిక న్యాయస్థానాలలో , జిల్లా, రాష్ట్ర న్యాయస్థానలలో కేసులు పరిష్కారం అయినట్లు తెలిపారు. మొత్తం ఎఫ్ఐఆర్ లు కేసులు: 22,095, విపత్తు నిర్వహణ కేసులు 8,922,పెట్టీ కేసులు 84,601 మోటారు వాహన చట్టం కేసులు 71,527 పరిష్కరమైనట్లు వెల్లడించారు. సైబర్ క్రైమ్ బాధితులకు రూ.53.5 కోట్లు రిఫండ్ చేసినట్లు తెలిపారు.

## జాగృతి ఆధ్వర్యంలో త్వరలో రాజకీయ శిక్షణా తరగతులు



హైదరాబాద్ (జనంసాక్షి) : జాగృతి ఆధ్వర్యంలో త్వరలో రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ కవిత కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో యువతకు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా లీడర్ బిల్డ్ తెలంగాణ అనే పోస్టర్ ఆమె విడుదల చేశారు. తెలంగాణ జాగృతి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని చెప్పారు. జాగృతి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు దేశవ్యాప్తంగా పాస్ అవ్వడంలో జాగృతి ప్రత్యేక పాత్రను పోశించిందన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లు కోసం సైతం పోరాటం చేస్తామని చెప్పారు. మహిళలను జాగృతి ఎంతో ఎంకరేజ్ చేసిందన్నారు. అదే విధంగా జాగృతి యువతను ఎంకరేజ్ చేస్తుందని చెప్పారు. యూత్ రాజకీయాల్లోకి వస్తేనే క్లీన్ పాలిటిక్స్ అవుతాయని అన్నారు. పొలిటికల్ బ్యాగ్రౌండ్ లేనివాళ్లు రాజకీయాల్లోకి వచ్చేందుకు జాగృతి ప్లాట్ ఫామ్ కాబోతుందన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే యువత గెలిచిన తరవాత ఏం చేయాలో నేర్పించడమే జాగృతి శిక్షణలో నేర్చుకుంటారని చెప్పారు. ప్రతి నెల మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తామని అన్నారు. జూలైలో పైలెట్ ప్రాజెక్ట్ కింద తమ కొత్త జాగృతి ఆఫీసులో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.మూడు రోజుల కార్యక్రమంలో విధులు, రెండో రోజు గెలిచిన రాజకీయ నాయకులతో ట్రైనింగ్, మూడో రోజు ఏం చేయాలి, ఎలా ఉండాలి అనేవి నేర్పిస్తామన్నారు.

## కేటీఆర్‌పై ప్రతీకారానికే 14 కేసులు

- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్ (జనంసాక్షి) :తెలంగాణలో దొంగ చేతికి తాళాలు ఇచ్చినట్టు పాలన సాగుతోందని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. కేటీఆర్‌పై ప్రతీకారం తీర్చుకునేందుకు 14 కేసులు పెట్టారని విమర్శించారు. కేసీఆర్‌ను కాళేశ్వరం కమిషన్ విచారణకు రప్పించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీం గైడ్ లైన్స్‌కు విరుద్దంగా కేటీఆర్ పై కేసులు పెట్టారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల గొంతుకగా లగచర్ల నుండి ఆదిలాబాద్ వరకు, మహబూబా బాద్ నుండి మహబూబ్ నగర్ వరకు ఎక్కడ సమస్య ఉన్నా అక్కడికి ఆగమేఘాల మీద పోయి అక్కడ ప్రజల తరుపున పోరాటం చేస్తున్న కేటీఆర్ మీద రేవంత్ రెడ్డి ప్రతీకారం తీర్చుకో డానికి కేసులు పెట్టారని వ్యాఖ్యానించారు. కర్నాటక ప్రభుత్వం తొక్కిసలాట ఘటనలో ఆఫీసర్లను సస్పెండ్ చేసి తమ సీట్లను కాపాడుకుందని ఆరోపించారు. కానీ కేటీఆర్ ఫార్ములా-ఈ కేసు విషయంలో ఏ మంత్రి చేయని సాహసం చేశారన్నారు. వేరే ఏ మంత్రి అక్కడ ఉన్నా నేను చేయలేదు ఆఫీసర్లే చేశారంటారని చెప్పారు.



## దాడికి పాల్పడ్డ తండ్రి, కొడుకును అరెస్టు చేయాలని గ్రామస్తుల రాస్తారోకో

మంచిర్యాల (జనంసాక్షి) : మంచిర్యాల జిల్లా మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ మల్టిపర్పస్ వర్కర్ ప్రభాకర్ (పై దాడి చేసిన వ్యక్తులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. గ్రామానికి చెందిన తండ్రి, కుమారుడు భారతారపు లింగయ్య, కుమారస్వామి భూమి విషయమై మహిళతో గొడవపడ్డారు. ఆమె జీపీ మల్టిపర్పస్ వర్కర్ ప్రభాకర్‌కు విషయాన్ని వివరించడంతో అతడు అక్కడికి చేరుకున్నాడు. దివ్యాంగుడైన ప్రభాకర్‌ను తండ్రి, కొడుకులు చితకబాదడడంతో అతడికి తీవ్ర గాయాలు కావడంతో అతడిని ఆసుపత్రిలో చేర్పించారు. దాడికి పాల్పడ్డ ఇద్దరిపై చర్యలు తీసుకోవాలని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎస్సై పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ గ్రామస్థులు రాస్తారోకో చేశారు. ఎస్సై తహసీనోద్దిన్ రాస్తారోకో ప్రాంతానికి చేరుకుని గ్రామస్థులను శాంతిం చేశారు. నిందితులపై చర్యలు తీసుకుంటామని సీఐ రమణమూర్తి హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు.

## కేటీఆర్ మీద కేసులు పెడతాం

- ఎమ్మెల్యే నాయిని హాట్ కామెంట్స్



హైదరాబాద్ (జనంసాక్షి) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పై కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఫైర్ అయ్యారు. ఇవాళ ఆయన వరంగల్ లో మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతలంతా పక్కా దొంగలని కామెంట్ చేశారు. అధికారంలో ఉండి వారు చేసిన పాపాలకు మరో పది జన్మల పాటు జైల్లో పెట్టినా.. ఆ శిక్ష సరిపోదని ధ్వజమెత్తారు. వరంగల్‌లో జరిగిన అవినీతి, పెద్ద ఎత్తున నిధుల దుర్వియోగంపై కేటీఆర్ మీద కేసులు పెడతామంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. అలాంటి చీడ పరుగులు బయట తిరగనివ్వొద్దని సీఎం రేవంత్ రెడ్డికి తాను విజ్ఞప్తి చేస్తున్నట్లుగా పేర్కొన్నారు. మీడియా ప్రతినిధుల సమక్షంలోనే కేటీఆర్‌ను వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పిలిపించాలని.. నగరానికి బీఆర్ఎస్ చేసిందేంటో, కాంగ్రెస్ చేసిందేంటో తేల్చుదామని అన్నారు. ఒకవేళ తమ పార్టీది తప్పుంటే తాను రాజీనామా చేస్తానని.. బీఆర్ఎస్‌ది తప్పుంటే కేటీఆర్ రాజీనామా చేయాలన్నారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్, రేవంత్ రెడ్డిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందని.. కనీసం కూతురి పెళ్లికి కూడా రానివ్వకుండా చేశారని గుర్తు చేశారు. పదేళ్ల అక్రమ సంపాదన, బలుపుతో సీఎం రేవంత్ రెడ్డిని పట్టుకుని కేటీఆర్ అడ్డగోలుగా మాట్లాడుతున్నాడని అన్నారు. మళ్లీ ప్రభుత్వమే వారిపై కక్షసాధింపు చర్యకు పాల్పడుతోందంటూ కామెంట్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తమను బీఆర్ఎస్ నేతలు ఉరికించి కొడుతామంటు స్టేట్‌మెంట్లు ఇస్తున్నారని.. అదే తాము తలుచుకుంటే వాళ్లంతా రాష్ట్రం వదిలి పరార్ అయ్యే పరిస్థితి వస్తుందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.

## జీవో 118ను ఆపి సమస్యను జఠిలం చేశాడు

- మధుయాష్కీపై మండిపడ్డ బీఆర్ఎస్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



హైదరాబాద్ (జనంసాక్షి) : ఎల్బీనగర్ నియోజకవర్గంలోని రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కారానికి తీసుకువచ్చిన జీవో 118ను ఆపి, సమస్యను మరింత జఠిలం చేస్తున్న దుర్మార్గుడు కాంగ్రెస్ నేత మధుయాష్కీ అని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మండిపడ్డారు. ఆదివారం బిఎన్ రెడ్డి నగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్ రెడ్డి నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలో ఉండి సమస్యను పరిష్కరించడం చేతగాక పోరాడి సాధించిన జీవో పైన అవాకులు చెవాకులు పేలుతున్నారని దుయ్యబట్టారు. 14 ఏళ్ల పాటు వందలాది సమావేశాలు ఏర్పాటు చేసి వందలాది అధికారులను ఒప్పించి అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, పురపాలక మంత్రి కేటీఆర్‌ల సహకారంతో 118 జీవోను తీసుకురావడం జరిగిందన్నారు. 70 శాతం మందికి కన్వీనియన్స్ డీడ్లు వచ్చాయని చాలామంది లోన్లు కూడా తీసుకున్నారని తెలిపారు. కాగా అనుమతి లేకుండా నిర్మించిన ఇండ్లకు రిజిస్ట్రేషన్లు కావడంలేదని దీనికి జీవో నెంబర్ 168 అడ్డుపడుతుందని తెలిపారు. ఆ జీవోని సవరించడం కానీ రద్దు చేయడం కానీ చేస్తే సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారం జరుగుతుందన్నారు. అది చేతకాక ఉన్న జీవోను ఆపి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. అధికారంలో ఉన్నవాళ్లు సమస్యను పరిష్కరించినందుకు కృషి చేస్తారు కానీ ఎల్బీనగర్లో మధుయాష్కీ గౌడ్ సమస్యను మరింత జఠిలం చేసి బాధితులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న 168 జీవోను సవరించి రిజిస్ట్రేషన్‌లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఆ జీవో సవరణకు అన్ని ప్రతిపాదనలు చేయడం జరిగిందని దానిపై లీగల్ ఒపీనియన్ కూడా తీసుకున్నామన్నారు. అప్పటికే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఆపేశామని తిరిగి తాము అధికారంలోకి రాకపోవడం వల్ల సమస్య అలాగే ఉండిపోయిందని తెలిపారు. ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వంతో సంప్రదింపులు, వినతి పత్రాల ద్వారా ప్రయత్నం చేయడం జరిగిందన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే తన విశ్వరూపం చూస్తారని హెచ్చరించారు. ప్రజా ఉద్యమాన్ని తీసుకువచ్చి ప్రభుత్వాన్ని ఎండగడతామన్నారు. బాధితులు ఎవరు ఆందోళనకు గురి కావద్దని 118 జీవోతో సమస్య పరిష్కారం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ప్రతి ఇంటికి సంపూర్ణమైన హక్కులు కలిగించేంతవరకు తాను విశ్రమించబోను అని తెలిపారు.

## రేవంత్‌రెడ్డిపై కేసులు నమోదు చేయండి

- లేకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్లను ముట్టడిస్తాం
- మాజీ మంత్రి జోగు రామన్న




ఆదిలాబాద్ టౌన్/ ఎదులాపురం : సీఎం రేవంత్ రెడ్డిపై కేసులు నమోదు చేయకపోవడాన్ని నిరసిస్తూ త్వరలో పోలీస్‌స్టేషన్ల ముట్టడికి బీఆర్ఎస్ నాయకులు , కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని మాజీ మంత్రి జోగు రామన్న పిలుపునిచ్చారు. ఆదివారం సాత్నాల, జైనథ్, బోరజ్, బేలా మండలాల ముఖ్య నాయకులతో బీఆర్ఎస్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి భయంతో సీఎం రేవంత్ రెడ్డి హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. రైతులకు రూ.41 వేల కోట్ల రైతు బంధు ఇస్తామని హామీ ఇచ్చి కేవలం రూ. 22 వేల కోట్లు మాత్రమే ఇచ్చి మోసం చేశారని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ రూ.320 కోట్ల విలువగల భూములను కబ్జా చేశాడని కాంగ్రెస్ నాయకులు ఆరోపించినా కూడా స్థానిక ఎమ్మెల్యే స్పందించకపోవడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. భూ కబ్జాలపై ఎస్పీ కేసులు నమోదు చేయడం మంచి పరిణామమైనా ఎమ్మెల్యే పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఎన్నికలు వస్తేనే కాంగ్రెస్‌కు రైతులు గుర్తొస్తున్నారే తప్ప, రైతు సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు సిద్ధంగా ఉండాలని కోరారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో గంజాయి రాయుళ్లు

- భయాందోళనలో టీచర్లు, విద్యార్థులు



మీర్‌పేట (జనంసాక్షి) : అసాంఘిక కార్యకలాపాలకు ప్రభుత్వ పాఠశాలలు నిలయాలుగా మారుతున్నాయి. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న జిల్లెలగూడ చల్లా లింగారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శిర్లాయిల్స్‌లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, లెనిన్ నగర్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలలో గంజాయి రాయుళ్లు స్వైర విహారం చేస్తున్నారని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రగ్స్, గంజాయి సేవించిన మత్తులో ఏం చేస్తున్నారో వారికే తెలియడం లేదు. పాఠశాలలో ఉన్న లైట్లు, ఫ్యాన్లు, స్విచ్ బోర్డులు ధ్వంసం చేస్తున్నట్లు ఉపాధ్యాయుల పేర్కొంటున్నారు. ఇలా ఎందుకు చేస్తున్నారని అడిగేందుకు ప్రయత్నం చేస్తున్న తమపై గంజాయి రాయుళ్లు ఎదురుదాడికి పాల్పడుతున్నారని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీసీ కెమెరాలను ధ్వంసం చేయడం, వాటర్ పైప్ లైన్లు, నల్లాలను సైతం ఎత్తుకుపోయినట్లు టీచర్లు పేర్కొంటున్నారు.

జిల్లాలగూడ చల్లా లింగారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడు లక్షల వరకు నష్టం జరిగినట్లు మండల విద్యాధికారి కృష్ణయ్య పేర్కొన్నారు. గంజాయి రాయుళ్లు చేస్తున్న అరాచకాలపై మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా టీచర్లకు, విద్యార్థినులకు రక్షణ లేకుండా పోతుందని వాపోయారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శిర్లాహిల్స్ లో ఉన్న ప్రాథమిక పాఠశాలలో సైతం సైతం ఇలాంటి ఘటనలు పునరావృత్తం అవుతున్నట్లు టీచర్లు పేర్కొంటున్నారు. గంజాయి సేవిస్తున్న వారిని పట్టుకొని పోలీసులకు అప్పగించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలకు రక్షణ లేకపోతే ఇక సుదూర ప్రాంతాలలో ఉన్న పాఠశాలల పరిస్థితి చెప్పనవసరం లేదు. ఉపాధ్యాయులు ఫిర్యాదులు చేస్తున్న పోలీసులు ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. గంజాయి రాయుళ్లు ప్రభుత్వ పాఠశాలలలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుంటే పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించడం పట్ల విమర్శలు వెలువెత్తుతున్నాయి.

ప్రభుత్వం డ్రగ్స్, గంజాయి నిరోధించడానికి కఠిన చర్యలు తీసుకోవాలని పదేపదే చెప్తున్నప్పటికీ ఎక్కడ కూడా సత్ఫలితాలు వచ్చిన సందర్భాలు కనిపిస్తలేవు. ప్రభుత్వ పాఠశాలలే కాకుండ, చెరువుల సమీపంలోనూ గంజాయి రాయుళ్లు తిష్ట వేస్తున్నారని కాలనీవాసుల నుంచి సైతం పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్నారు. ఎవరు ఎన్ని ఫిర్యాదులు చేసినా గంజాయి రాయుళ్లను నియంత్రించడంలో పోలీసులు విఫలం చెందుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఫిర్యాదులకు స్పందించి గంజాయి రాయుళ్లపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడంపై పలు అనుమానాలకు తావిస్తున్నట్లు ఫిర్యాదుదారులు పేర్కొంటున్నారు.

### పాఠశాలలో ఫర్నిచర్ ధ్వంసం : ఎంఈవో కృష్ణయ్య

జిల్లెల్లగూడ చల్లాలింగారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గంజాయి రాయుళ్లు ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. లైట్లు, సీసీ కెమెరాలు, పైపులు ధ్వంసం చేశారు. రెండు లక్షల వరకు నష్టం జరిగింది. మళ్లీ రూ. 1,50,000 పెట్టి అన్ని రిపేర్ చేయించాం. మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు కూడా చేశాం. ప్రభుత్వ పాఠశాలలకు రక్షణ కల్పించాలి. సాయంత్రం అయిందంటే గంజాయి రాయుళు తిష్ట వేస్తున్నారు అని ఎంఈవో పేర్కొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370